www.manatelangana.news

Mana Telangana

మన తెలంగాణ

హైదరాబాద్ | సంపుటి 7 | సంచిక: 226 | మంగళవారం | 5 ఫిబ్రవరి, 2019

Published from: Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nalgonda, Mahabubnagar, Nizamabad

పేజీలు: 12 + టాబ్లాయిడ్ | వెల రూ. 5.00

రాకేషే

జయరాంను తానే చంపానని అంగీకారం?

చంద్రబాబు, విజయశాంతితో కూటమి ప్రచారంలో పాల్గొన్న నిందితుడు!



చంద్రబాబు నాయుడుతో రాకేష్‌రెడ్డి



విజయశాంతితో రోడ్‌షోలో

మన తెలంగాణ/హైదరాబాద్

చిన్నపాటి బెదిరింపులతో ప్రారంభమైన రాకేష్‌రెడ్డి జీవితం చివరకు హత్యలకు పాల్పడేవరకు వచ్చింది. తనకు రావాల్సిన ఐదున్నర కోట్ల రూపాయలు ఇవ్వనందుకే జయరాంను హత్య చేసినట్లు పోలీసులు విచారణ సందర్భంగా స్వయంగా రాకేష్ రెడ్డి అంగీకరించినట్లు సమాచారం. విచారణ సందర్భంగా రాకేశ్‌రెడ్డి అంగీకరించిన అంశాలను పరిగణనలోకి తీసుకున్న పోలీసులు రాకేష్‌రెడ్డి గతంలోని నేర చరిత్రపై దృష్టి సారించారు. ఆరా తీసిన తర్వాత గతంలో అతనిపై పలు కేసులు ఉన్నట్లు పోలీసులు నిర్ధారణకు వచ్చారు. ప్రముఖ సినీ హీరోయిన్‌తో వ్యభిచారం చేయించిన కేసులో గతంలో జూబ్లీహిల్స్ పోలీసులు అతడ్ని పట్టుకున్నారని, తరువాయి 6లో

దగాపడ్డ విద్యార్థులు

అమెరికా నుంచి రాక

మొదటి విడతగా హైదరాబాద్ చేరుకున్న 30 మంది



మన తెలంగాణ/శంషాబాద్, హైదరాబాద్

ఉన్నత చదువుల కోసం గంపెడాశలతో అమెరికా వెళ్లి పడరాని బాధలు పడిన తెలుగు విద్యార్థుల్లో ముప్పై మంది సోమవారం తరువాయి 6లో

సుదర్శన భాగ్యంగా యాదాద్రి



- నాలుగున్నర ఎకరాల్లో ప్రధాన దేవాలయం
- 302 ఎకరాల్లో దేవాలయ ప్రాంగణం
- కింది నుంచి గుట్టమీదకు ఎక్కడానికి దిగడానికి వేర్వేరు రహదారులు
- ఆలయం చుట్టూ రింగురోడ్డు నిర్మాణం
- తుర్కపల్లి నుంచి నాలుగులైన్ల రోడ్డు

> దేశంలోని ప్రతి ఒక్కరూ ఒక్కసారైనా యాదాద్రిని సందర్శించాలనే ఉత్సుకత కలిగేలా, ఆసక్తి పుట్టేలా దేవాలయ ప్రాంగణాన్ని తీర్చిదిద్దాలి. పునరుద్ధరణ తర్వాత యాదాద్రికి భక్తుల సంఖ్య ఎన్నో రెట్లు పెరుగుతుంది. దానికి అనుగుణంగా ఏర్పాట్లు ఉండాలి
> - సిఎం

ఆలయ పునరుద్ధరణ తర్వాత సహస్రాష్టక కుండ యాగం

పరిపూర్ణ ఉపాసకులతో పదకొండు రోజుల పాటు మహా యాగం

మన తెలంగాణ /హైదరాబాద్

ఆధ్యాత్మికత ఉట్టిపడేలా, అద్భుత ఆలయ శిల్ప కళా నైపుణ్యంతో, ఆలయ ప్రాశస్త్యం, వైభవం ప్రస్ఫుటమయ్యేలా యాదాద్రి పునరుద్ధరణ పనులు జరగాలని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు అధికారులకు సూచించారు. యాదాద్రిలో చేపట్టిన నిర్మాణ పనులకు నిధుల కొరత లేకుండా ఈసారి బడ్జెట్‌లో అవసరమైనన్ని నిధులు కేటాయిస్తామని స్పష్టం చేశారు. పునరుద్ధరణ పనులన్నీ పూర్తయిన తర్వాత సహస్రాష్టక కుండ యాగం (1008 యాగ కుండాలతో) 11 రోజుల పాటు మహాయాగం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్రపతి, ఉప రాష్ట్రపతి, ప్రధాన మంత్రి, కేంద్ర మంత్రులు, వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులు, గవర్నర్లను ఆహ్వానిస్తామని చెప్పారు. వందల ఏళ్ల పాటు నిలిచిపోయే దేవాలయం కాబట్టి, ప్రతీ అంగుళం నిర్మాణంలో అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలని, నిర్మాణాలులు వైభవోపేతంగా ఉండాలని స్పష్టం తరువాయి 6లో



మాల్యా అప్పగింతకు బ్రిటన్ ఓకే

10

పంచాయతీ అధికారులతో రేపు సిఎం భేటీ

3

కెసిఆర్ వల్లనే మొదటి సారి ఎంఎల్‌ఎ అయ్యాను : జగ్గారెడ్డి

3

హరితహారం భేష్

3

యుపి అధికారుల బృందం నేడు గజ్వేల్, సిద్ధిపేట జిల్లాల్లో పర్యటన



వేగంగా పనులు

- కాళేశ్వరం 9వ ప్యాకేజీ మల్కపేట రిజర్వాయర్, టన్నెల్ పనులను పరిశీలించిన కెటిఆర్
- త్వరితగతిన పూర్తి చేయాలని కాంట్రాక్టర్లకు, అధికారులకు ఆదేశం


మన తెలంగాణ/సిరిసిల్ల / తంగళ్లపల్లి /కోనరావుపేట

సిరిసిల్ల ఎంఎల్‌ఎ కెటిఆర్ సోమవారం నియోజకవర్గంలో విస్తృత పర్యటన జరిపారు. కాళేశ్వరం ప్రాజెక్టు తొమ్మిదో ప్యాకేజీ పనుల్లో భాగంగా మధ్యమానేరు ప్రాజెక్టు నుండి ఎగువ మానేరులోకి నీటిని తరలించేందుకు మల్కపేట ప్రాజెక్టులోకి నీటిని చేర్చే టన్నెల్ నిర్మాణ తరువాయి 6లో

బెంగాల్ వేఢీ

- గవర్నర్ నుంచి నివేదిక రప్పించుకున్న కేంద్ర హోంశాఖ
- రాజ్యాంగాన్ని కాలరాశారు, తగిన చర్యలు తప్పవు : రాజ్‌నాథ్
- మమతా బెనర్జీకి ప్రతిపక్షాల మద్దతు, కొనసాగుతున్న దీదీ ధర్నా

పార్లమెంట్‌లో రభస, వాయిదా





న్యూఢిల్లీ: కోల్‌కతాలో సిబిఐ బృందాలు పోలీసు వర్గాల మధ్య తగవు సోమవారం పార్లమెంట్‌ను కుదిపేసింది. ఉభయ సభలు దీనిపై అర్థాంతరంగా వాయిదా పడ్డాయి. సిబిఐ వ్యవహార శైలిని కాంగ్రెస్, టిఎంసి ఇతర ప్రతిపక్షాలు తీవ్రస్థాయిలో తప్పుపట్టాయి. అయితే బెంగాల్‌లో పరిస్థితిని గమనిస్తున్నామని, అక్కడ చర్య తీసుకునేందుకు కేంద్రానికి అన్ని అధికారాలు ఉన్నాయని హోం మంత్రి రాజ్‌నాథ్ సింగ్ హెచ్చరించారు. లోక్‌సభ ఆరంభం కాగానే తృణమూల్ కాంగ్రెస్ సభ్యులకు కాంగ్రెస్, బిజెడి, ఎన్‌సిపి, ఎస్‌పి, ఆర్జేడీ సభ్యులు మద్దతు ప్రకటించారు. కేంద్రం నేరుగా బెంగాల్ వ్యవహారాలలో జోక్యం చేసుకొంటోందని, ఇది సమాఖ్య వాదానికి విరుద్ధం అని ప్రతిపక్షాలు విమర్శించాయి. నరేంద్ర మోడీ ప్రభుత్వం సిబిఐని దుర్వినియోగపరుస్తోందని ఆరోపించాయి. దీనిని అధికార తరువాయి 10లో

కుంచెపోటు



ఎంపి కవితకు కేరళ ఆహ్వానం



అసెంబ్లీ వజ్రోత్సవ ముగింపు వేడుకల్లో ప్రసంగించాలని కోరుతూ స్పీకర్ లేఖ

మన తెలంగాణ/హైదరాబాద్

ఉత్తమ పార్లమెంటేరియన్‌గా ఇటీవల అవార్డు అందుకున్న నిజామాబాద్ ఎంపి కల్వకుంట్ల కవితకు కేరళ అసెంబ్లీ నుంచి అరుదైన ఆహ్వానం అందింది. దేశంలోని విద్యాలయాల విద్యార్థులతో కేరళ అసెంబ్లీ ఈ నెల 23న ప్రతిష్టాత్మంగా నిర్వహిస్తున్న వజ్రోత్సవ ముగింపు వేడుకల్లో ప్రసంగించాల్సిందిగా కేరళ శాసనసభ స్పీకర్ పి.శ్రీరామకృష్ణన్ టిఆర్‌ఎస్ ఎంపి కవితను ఆహ్వానిస్తూ లేఖ రాశారు. కేరళ అసెంబ్లీ వజ్రోత్సవ వేడుకల్లో భాగంగా ఈ నెల 23 నుంచి 25 వరకు నిర్వహిస్తున్న ముగింపు సదస్సును ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు 23న ప్రారంభిస్తారు. అదే రోజు మధ్యాహ్నం జరిగే సదస్సులో 'క్యాస్ట్స్ అండ్ ఇట్స్ డిసకంటెట్స్' అనే అంశంపై ప్రసంగించాల్సిందిగా కవితను కేరళ అసెంబ్లీ స్పీకర్ కోరారు. ఈ సదస్సుకు కేరళ సిఎంతో పాటు దేశంలోని పలు రాష్ట్రాల మంత్రులు, శాసనసభ్యులు హాజరుకానున్నారు. దేశంలో సామాజికంగా, రాజకీయంగా క్రియాశీలకంగా ఉన్న ప్రతిభావంతులైన జాతీయ విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొననున్నారని ఆ ఆహ్వానంలో తరువాయి 6లో

అటవీ రక్షణకు ప్రజాప్రతినిధుల సహకారం



ప్రజాప్రతినిధులతో అటవీశాఖ ప్రత్యేక సమావేశాలు • అటవీ రక్షణపై వివరిస్తున్న సిబ్బంది

మన తెలంగాణ / హైదరాబాద్ : అటవీ సంపద రక్షణతో పాటు వన్యప్రాణుల సంరక్షణ కోసం ప్రజాప్రతినిధులను కలిసి ప్రత్యేకంగా సమావేశాలను నిర్వహించాలని అటవీ శాఖ నిర్ణయించింది. సర్పంచ్ స్థా యి ప్రజాప్రతినిధిని మొదలుకొని ఎంఎల్‌ఎ, ఎంపితో పాటు జిల్లా మంత్రులను ఆయా స్థాయిలోని జిల్లాల అధికారులు, సిబ్బంది కలవాలని అటవీ శాఖ ఉన్నతాధికారులు సూచించారు. ఈ సందర్భంగా అటవీ సంపద రక్షణకు ప్రజాప్రతినిధుల సహకారం కోరాలని విజ్ఞప్తి చేశారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో కొత్తగా ఎన్నికైన శాసన సభ, శాసన మండలి సభ్యులతో పాటు సర్పంచ్‌లను సైతం కలవాలని ఆదేశించినట్లు సమాచారం. ఇందులో భాగంగానే సర్పంచ్‌లుగా బాధ్యతలను చేపట్టిన మొదటిరోజు గుర్తుగా సర్పంచ్‌ల చేత అటవీశాఖ సిబ్బంది రాష్ట్రవ్యాప్తంగా మొక్కలను నాటించారు. వాటి పెంపునకు సంబంధించిన బాధ్యతలను పర్యవేక్షించాలని ఈ సంద ర్భంగా అటవీ సిబ్బంది ప్రజాప్రతినిధులకు విజ్ఞప్తి చేశారు. ప్రతి ఏడాది ఫిబ్రవరి రెండవ తేదీని "చిత్తల నేలల" దినోత్సవంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగానే శని వారం చిత్తడి నేలల దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లాల్లో చిత్తడి నేలల ప్రాధాన్యతను వివరిస్తూ ప్రజాప్రతినిధులతో పాటు ప్రజలకు అవగాహన కల్పించారు. ఇందుకోసం ప్రత్యేకంగా పలు ప్రాంతాల్లో కార్యక్రమాలను నిర్వహించారు. అటవీ ప్రాంతాలన్ని సురక్షితంగా ఉండాలని, అడవుల నుంచి పూచిక పుల్ల కూడా బయటకు వెళ్ళకూడదని, ఒక చెట్టును కూడా నాశనం చేసేందుకు వీలు లేదని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. అవసరమైన చట్టాలను కూడా కఠినతరం చేయాలని సూచించారు. ఇటీవల జంగిల్ బచావో జంగిల్ బడావో నినాదమిచ్చారని తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రజాప్రతినిధులతో పాటు ప్రజల సహకారం కూడా తీసుకోవాలని అటవీ సంరక్షణకు చర్యలను తీసుకో వాలని అటవీశాఖ నిర్ణయించిందన్నారు. ఇందులో భాగంగానే "తెలంగాణకు హరితహారం" కార్యక్రమం కింద చేపట్టిన పనులు, కొత్త పంచాయతీరాజ్ చట్టం ప్రకారం గ్రామాల్లో పచ్చదనం, పరిశుభ్రత కోసం చేయాల్సిన పనులపై ప్రజాప్రతినిధులకు అవగాహన కల్పించాలని అటవీ సిబ్బందికి ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం. పచ్చ దనం కోసం పాటు పడే గ్రామాలతో పాటు వ్యక్తులకు రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సాహకరంగా అందిస్తున్న హరితమిత్ర అవార్డులు, రివార్డులను వారికి వివరించాలన్నారు. దీంతో పాటు అటవీ ప్రాంతాల సరిహద్దు ఏర్పాటు, ఆక్రమణల నియంత్రణ, క్షీణించిన అడవుల పునరుజ్జీవనం, పట్టణ ప్రాంతాలకు సమీపంలో "అర్బన్ ఫారెస్టు పార్కుల" ఏర్పాటు తదితర అంశాలను ప్రజాప్రతినిధులకు వివరించాలని కూడా సూచించినట్లు సమాచారం. గ్రామాల వారీగా అటవీ రక్షణ కమిటీల ఏర్పాటు ప్రాధాన్యతను కూడా వారికి తెలియజేయాలన్నారు. సమీపంలో అటవీ ప్రాంతాలుంటే వాటి రక్షణకు తీసుకుంటున్న చర్యలు, కొత్త చెక్‌పోస్టుల ఏర్పాటు, పోలీస్, రెవెన్యూ అధికారులతో సమన్వయం చేసుకోవడంతో పాటు అటవీ రక్షణలో ప్రజలు, ప్రజాప్రతినిధుల విధుల నిర్వహణపై కూడా సమాచారమివ్వాలన్నారు. స్మగ్లింగ్, వేట నివారణకు సహకరించడంతో పాటు ఎలాంటి సమాచారం ఉన్న వెంటనే సంబంధిత అధికారులకు తెలియజేసేలా అవగాహన కల్పించాలన్నారు. ఇందుకోసం సంబంధిత ఫోన్ నెంబర్లను అందజేయాలని క్షేత్రస్థాయిలోని అధికారులు, సిబ్బందిని అటవీశాఖ ఆదేశించింది.

తారకరత్న భవనంపై చర్యలు

మనతెలంగాణ/ సిటీబ్యూరో : నివాస భవనాలను నిర్మించాల్సిన బంజారాహిల్స్ ప్రాంతంలో నియమనిబంధనలకు విరుద్ధంగా వ్యాపార భవనాన్ని నిర్మించాడు సినీనటుడు తారకరత్న. భవనాన్ని నిర్మించడంతోపాటు వ్యాపార కార్యకలాపాలను నిర్వహిస్తుండటం, నివాసాల ప్రాంతంలో రెస్టారెంట్‌ను ఏర్పాటు చేయడం, రాత్రి వేళల్లో మద్యం సేవిస్తూ, డిజె సౌండ్స్‌తో న్యూసెన్స్‌ను సృష్టిస్తున్నారని ఎమ్మెల్యే కాలనీల వారు గ్రేటర్ అధికారులకు ఫిర్యాదు చేశారని అధికారులు వెల్లడిస్తున్నారు. రంగంలోకి దిగిన గ్రేటర్ అధికారులు ఆ భవనంపై చర్యలు తీసుకునేందుకు ఉపక్రమించారు. దీంతో బంజారాహిల్స్ రోడ్డు నెం. 12లో ఉద్రిక్తత వాతావరణం నెలకొన్నది. సినీహీరో తారకరత్నకు చెందిన డ్రైవ్ ఇన్ రెస్టారెంట్ నిర్మాణంపై చర్యలు తీసుకునేందుకు గ్రేటర్ అధికారులు అక్కడకు వెళ్ళారు.

చర్యలు ఎందుకు తీసుకుంటున్నారని రెస్టారెంట్ నిర్వాహకులు అధికారులతో వాగ్వివాదానికి దిగారు. నిబంధనలకు విరుద్ధంగా రెస్టారెంట్ నిర్వహిస్తున్నారని, తమకు ఫిర్యాదు అందడంతో కూల్చేందుకు వచ్చినట్టు వారు తెలిపారు. ఇది కాస్త తీవ్రస్థాయికి చేరుకోవడంతో సినీనటుడు తారకరత్న అక్కడకు చేరుకున్నారు. రెస్టారెంట్‌లోని సామాగ్రిని తీసుకునేందుకు గడువు కావాలని కోరారు. అయితే, జిహెచ్‌ఎంసి అధికారులు కొంత గడువు ఇవ్వడంతో వివాదం కాస్త సద్దుమనిగింది. పోలీసులు రంగంప్రవేశం చేసి ఎలాంటి సంఘటనలు చోటుచేసుకోకుండా ఆక్కడ నిబంధనలకు విరుద్ధంగా ఉన్న ఏర్పాట్లు తొలగించారు.

ముగిసిన ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ

మన తెలంగాణ/హైదరాబాద్: పార్లమెంట్ ఎన్నికల కోసం రాష్ట్రంలో నిర్వహించిన ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమం సోమవారంతో ముగిసింది. గత ఏడాది డిసెంబర్ 26వ తేదీన ప్రారంభమైన ఈ కార్యక్రమంలో ఈ నెల 4వ తేదీ సాయంత్రం వరకు 22.23 లక్షల దరఖాస్తులు వచ్చినట్లు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి కార్యాలయ వర్గాలు వెల్లడించాయి. ఈ నెల 14వ తేదీ వరకు ఈ దరఖాస్తులన్నింటినీ పరిష్కరించనున్నారు. ఆ తరువాత 22వ తేదీన తుది జాబితా ప్రకటిస్తారు. ప్రస్తుతం వచ్చిన వాటిలో 11.68 లక్షల దరఖాస్తులు ఆమోదం పొందగా మరో 9.70 లక్షల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. అత్యధికంగా ఓటరు నమోదుకు ఫామ్ 6 అప్లికేషన్‌లు 17 లక్షల వరకు వచ్చినట్లు అధికారులు తెలిపారు. ఇందులో 8.75 లక్షల దరఖాస్తులు ఆమోదించగా, 5.57 లక్షల దరఖాస్తులు తిరస్కరణకు గురయ్యాయి. మరో 7.67 లక్షల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. వాస్తవానికి గత నెల 26వ తేదీ నాడే ఓటరు కార్డులో తప్పులను సవరించుకోవడానికి, ఒకచోట నుంచి మరొక చోటుకు మార్చుకోవడానికి గడువుగా ఉంది. అయితే పంచాయతీ ఎన్నికలు రావడం, సంక్రాంతి పండుగ నేపథ్యంలో గడువును పొడిగించాలని రాజకీయ పక్షాలు సిఇఒ రజత్ కుమార్‌కు విజ్ఞప్తి చేశాయి. అందుకు అనుగుణంగా సిఇఒ కేంద్ర ఎన్నికల సంఘానికి నివేదించగా ఈ నెల 4వ తేదీ వరకు అనుమతించింది. ఆదివారం నాడు బూత్‌స్థాయి అధికారులను అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద అందుబాటులో ఉంచి ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఓటరు దరఖాస్తులు స్వీకరించారు. దీంతో ఓటరు దరఖాస్తులు పెరిగాయని అధికారులు చెబుతున్నారు. గడిచిన అసెంబ్లీ ఎన్నికలకు వినియోగించిన ఓటర్ల తుది జాబితా ప్రకారం రాష్ట్రంలో 2.81 కోట్ల మంది ఓటర్లు ఉన్నారు.

రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్‌దే విజయం

మన తెలంగాణ/ హైదరాబాద్ : రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధించడం, రాహుల్‌గాంధీ ప్రధాని కావడం తథ్యమని పార్టీ రాష్ట్ర క్యాంపెయినింగ్ కమిటీ చైర్మన్ విజయశాంతి, కోచైర్మన్ డికె అరుణ వ్యాఖ్యానించారు. దేశ వ్యాప్తంగా మళ్ళీ కాంగ్రెస్ ప్రభంజనం మొదలైందన్నారు. పార్లమెంట్ ఎన్నికల దృష్టిలో పెట్టుకుని తమకు ముఖ్యమైన క్యాంపెయినింగ్ కమిటీలో కీలక బాధ్యతలు అప్పగించిన రాహుల్‌గాంధీకి కృతజ్ఞతలు తె లిపారు. డికె అరుణ నివాసంలో ఏర్పాటు చేసిన మీడి యా సమావేశంలో మాట్లాడుతూ, రాష్ట్రంలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్నో అవకతవకలు జరిగాయని, ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించడంలో రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి రజత్‌కుమార్ విఫలమయ్యారని విమర్శించారు.

కొత్త సర్పంచ్‌లకు సరికొత్త సవాళ్ళు

మన తెలంగాణ/హైదరాబాద్ : రాష్ట్రంలో రెండు రోజుల క్రితం సర్పంచ్‌లుగా బాధ్యతలు స్వీకరించిన గ్రామ ప్రజా ప్రతినిధులకు పన్నుల వసూళ్ళ ప్రక్రియ కీలకంగా మారింది. పంచాయతీల్లో పన్నులు వసూళ్ళలో ఎంత వేగం పెరిగితే అంతగా అభివృద్ధి పనులు జరుగుతాయని ఇప్పటికే వారికి ఒక స్పష్టత వచ్చింది. అందుకే బాధ్యతలు స్వీకరించిన సర్పంచ్‌లు తొలుత ఈ అంశంపైనే దృష్టి సారిస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికలు, ఆ వెంటనే పంచాయతీ ఎన్నికలు జరగడంతో చాలా చోట్ల ఆస్తి పన్ను వసూలు పూర్తిస్థాయిలో జరగలేదు. చిన్న పంచాయతీల్లో ఈ ప్రక్రియ నత్తనడకన సాగుతోంది. అందుకే ఆస్తిపన్నును వంద శాతం వసూలు చేయడంపై దృష్టి పెట్టారు. పంచాయతీల్లో ఇంకా వసూలు కావాల్సిన ఆస్తిపన్ను ఎంత, రానున్న ఆర్థిక సంవత్సరంలో ఎంత వసూలు చేయడానికి అవకాశముంది, పంచాయతీల్లో భవన నిర్మాణ అనుమతుల్లో వస్తున్న ఆదాయం ఎంత, అనుమతుల ప్రకారమే నిర్మాణాలు జరుగుతున్నాయా, ఆస్తిపన్ను కట్టకుండా తప్పించుకుంటున్నవారు ఎంత మంది, విలువను తక్కువగా చూపించి పన్ను చెల్లిస్తున్న వారు ఎంత మంది తదితర అంశాలపై సర్పంచ్‌లు ఆరా తీస్తున్నారు. బకాయిలు లేకుండా పన్నుల్ని సకాలంలో, క్రమం తప్పకుండా చెల్లించేవారికి అవసరమైతే చిరు ప్రోత్సహకాలను అందించాలని కూడా ఆలోచన చేస్తున్నట్లు సమాచారం. ఇప్పటికే జిహెచ్‌ఎంసి పరిధిలో ఈ విధానం విజయవంతంగా అమలవుతోంది. ఆర్థిక సంవత్సరం మొదలైన తొలి మాసంలోనే ఆస్తిపన్నును మొత్తం చెల్లించేవారికి ఐదు శాతం రిబేటు కల్పిస్తోంది. దీని వల్ల ఆర్థిక సంవత్సరం ప్రారంభమైన మొదటి నెలలోనే గ్రేటర్ బల్దియాకు పెద్దఎత్తున ఆదాయం లభిస్తోంది. అభివృద్ధి పనులకు నిధుల సమస్య తప్పింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మరో రెండు నెలల్లో ముగియనున్నందున వసూలు కావాల్సిన మొత్తం ఆస్తి పన్నుపై కొత్త సర్పంచ్‌లు వివరాలు తీసుకుంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వం 300 జనాభా ఉన్న గ్రామాలతో పాటు గిరిజన గూడేలు, తండాల్లో వెలుగులు నింపాలన్న లక్ష్యంలో అతి తక్కువ జనాభా ఉన్న గ్రామాలను సైతం పంచాయతీలుగా రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసి నిధులను కూడా విడుదల చేయనున్నట్లు హామీ ఇచ్చింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం బడ్జెట్‌లో రూ.12 వేల కోట్లను కేటాయించింది. ఒక్కో పంచాయితీ ఐదు లక్షల రూపాయల మొదలు పది లక్షల వరకు ఆర్థిక కేటాయింపులు చేయనున్నట్లు ప్రభుత్వం స్పష్టం చేసినందున రానున్న ఆర్థిక సంవత్సరంలో ఆ నిధులు విడుదలయ్యే అవకాశం ఉంది.

పిఎంకెఎస్‌ఎఫ్‌ను రైతుబంధులో విలీనం?

మన తెలంగాణ/హైదరాబాద్: కేంద్ర ప్రభుత్వం తాజాగా ప్రవేశపెట్టిన 'కిసాన్ సమ్మాన్ నిధి' పథకాన్ని తెలంగాణ ప్రభుత్వం అమలుచేస్తున్న 'రైతుబంధు'లో విలీనంచేసే అంశాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఆలోచిస్తోంది. కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదన పంపాలని ప్రాథామిక నిర్ణయానికి వచ్చినట్లు తెలిసింది. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి పథకం అమలు చేయడంతో పాటు రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుతం అమలుచేస్తున్న 'రైతుబంధు'పై అధ్యయనం చేయడానికి కేంద్ర వ్యవసాయ మంత్రిత్వశాఖ అదనపు కార్యదర్శి వసుధా మిశ్రా మంగళవారం నగరానికి వస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్‌కె జోషితో ఆమె చర్చించనున్నారు. ఈ సమావేశానికి రాష్ట్రంలోని వ్యవసాయ, ఆర్థిక, రెవెన్యూ, ఐటి శాఖలకు చెందిన ఉన్నతాధికారులూ హాజరుకానున్నారు. రాష్ట్రంలో రైతుబంధు పథకాన్ని ఎలా అమలు చేశారన్న సమాచారంతోపాటు కేంద్ర ప్రభుత్వ పథకాన్ని ఎలా అమలు చేయవచ్చన్న అంశంపై ఆమె చర్చించనున్నట్లు వ్యవసాయశాఖ వర్గాలు తెలిపాయి. రాష్ట్రంలో ఇప్పటికే దిగ్విజయంగా అమలు చేసినందున ఇక్కడి అనుభవాలను కూడా రాష్ట్ర ఉన్నతాధికారులు ఆమెకు వివరించే అవకాశముంది. కేంద్రం నిధులు ఇస్తున్నందున అవసరమైతే ఈ పథకాన్ని 'రైతుబంధు పిఎంకెఎస్‌ఎస్‌ఎఫ్'గా మార్చడానికి కూడా అభ్యంతరం లేదన్న ప్రతిపాదనను వసుధా మిశ్రా దృష్టికి తీసుకెళ్ళాలని రాష్ట్ర అధికారులు యోచిస్తున్నట్లు తెలిసింది. అయితే సిఎం కెసిఆర్ ఆదేశాల మేరకు కేంద్ర పథకాన్ని రాష్ట్రంలో ఎలా అమలుచేయాలో నిర్ణయిస్తామని అధికారులు చెబుతున్నారు. రాష్ట్రంలో గత ఖరీఫ్, రబీ సీజన్లకు కలిపి రాష్ట్ర ప్రభుత్వం రూ. 10,500 కోట్లకు పైగా రైతులకు పెట్టుబడి సాయం చేసిన సంగతి తెలిసిందే. అందులో 90 శాతం సన్నచిన్నకారు రైతులకే అందింది. ఈ నేపథ్యంలో కేంద్రం సాయం చేస్తే రూ. 2,800 కోట్లకు పైగా తెలంగాణ ప్రభుత్వానికి కలిసివచ్చే అవకాశముందని అంటున్నారు. అయితే తెలంగాణ ప్రతిపాదనలకు కేంద్రం అంగీకరిస్తుందా లేదా అన్న అంశంపై వ్యవసాయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. పేదలకు ఇండ్లు నిర్మించే పథకంలో సైతం కేంద్రం సానుకూలంగా స్పందించి రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న డబుల్ బెడ్ రూమ్ ఇళ్ళ పథకంలో భాగం చేసింది. ఇప్పుడు రైతుబంధు విషయంలోనూ అది సాకారమయ్యే అవకాశం లేకపోలేదు.

విద్యుత్ ఉత్పత్తి నిలిపేయండి

మన తెలంగాణ/హైదరాబాద్: శ్రీశైలం రిజర్వాయర్ నుంచి విద్యుత్ ఉత్పత్తి నిలిపివేయాలని కృష్ణాబోర్డు రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాసింది. ఎపి ప్రభుత్వ ఫిర్యాదు మేరకు ఈ లేఖ రాసింది. తొలి నుంచి విద్యుత్ అంశంలో ఎపి ప్రభుత్వం రాష్ట్రాన్ని ఇబ్బందిపెట్టేలా వ్యవహరిస్తుంది.

క్యాన్సర్‌ను తరిమి వేయాలి

టిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్



మన తెలంగాణ/హైదరాబాద్: క్యాన్సర్‌కు వ్యతిరేకంగా ఉద్యమించేవారికి ఎల్లవేళలా సహకారం ఉంటుందని టిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు పేర్కొన్నారు. ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా కెటిఆర్ ట్విట్టర్ ద్వారా ప్రజలకు సందేశమిచ్చారు. క్యాన్సర్ మహమ్మారి నుంచి బయటపడినవారిని ప్రశంసించడంతో పాటు క్యాన్సర్ రాకుండా ప్రజలు ముందస్తు చర్యలు పాటించాలని కెటిఆర్ కోరారు. అయితే కాన్సర్ ఉందని తెలిసినవారు అధైర్యపడకుండా చికిత్స తీసుకోవాలని సూచించారు. ప్రజల జీవన విధానాలు, ఆహార అలవాట్లను మార్చుకుని క్యాన్సర్‌ను తరిమివేయాలని ఆయన పిలుపు ఇచ్చారు. క్యాన్సర్‌పై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని పేర్కొన్నారు. క్యాన్సర్‌ను తరిమివేయాలంటే ప్రధానంగా పొగతాగడం, పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉండటం, పరిమిత ఆల్కాహాల్ తీసుకోవడం పాటించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అలాగే పౌష్టికాహారం తీసుకోవడం మర్చిపోవద్దని గుర్తు చేశారు. తల్లిపాలు బిడ్డలకు ఇస్తే బ్రెస్ట్ క్యాన్సర్ రాదని వైద్యనిపుణులు స్పష్టం చేస్తున్నారని గుర్తుచేశారు. అధిక ఎండల నుంచి శరీరాన్ని కాపాడుకోవాలన్నారు. వాయు కాలుష్యం కూడా క్యాన్సర్‌కు కారణమన్నారు. శారీరక వ్యాయామాన్ని తప్పనిసరిగా అలవర్చుకోవాలని ప్రజలను కెటిఆర్ కోరారు.

కెసిఆర్ వల్లే మొదటిసారిగా ఎంఎల్ఏనయ్యాను : జగ్గారెడ్డి



మన తెలంగాణ/హైదరాబాద్ : టిఆర్ఎస్ అధ్యక్షుడు కెసిఆర్ వల్లే తాను మొదటిసారి శాసనసభ్యుడిగా ఎన్నికయ్యానని కాంగ్రెస్ పార్టీ శాసనసభ్యుడు జగ్గారెడ్డి వ్యాఖ్యానించారు. 2004లో జరిగిన ఎన్నికల్లో టిఆర్ఎస్ అభ్యర్థిగా సంగారెడ్డి నియోజకవర్గం నుంచి పోటీచేసి మొదటిసారిగా గెలిచానని, అప్పట్లో తన గెలుపుకు కెసిఆర్ ఎంతో కృషి చేశారని వ్యాఖ్యానించారు. అలాంటి వ్యక్తితో తనకు ఎలాంటి వైరం లేదన్నారు. కెసిఆర్‌పై తానెప్పుడూ వ్యక్తిగతంగా విమర్శలు చేయలేదన్నారు. కేవలం రాజకీయ ఆరోపణలు మాత్రమే చేశానన్నారు. రాజకీయాల్లో అది సహజమన్నారు. కెసిఆర్ చాలా నిజాయితీ గల వ్యక్తి అని జగ్గారెడ్డి ప్రశంసించారు. సోమవారం నాడిక్కడ మీడియాతో జగ్గారెడ్డి చిట్‌చాట్ చేస్తున్న సందర్భంగా పై వ్యాఖ్యలు చేశారు. సంగారెడ్డి జిల్లా అభివృద్ధి కోసం తాను త్వరలో సిఎం కెసిఆర్, టిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్‌ను కూడా కలుస్తానన్నారు. వారిని కలిసినంత మాత్రాన తాను టిఆర్ఎస్‌లో చేరుతున్నట్లు కాదన్నారు. అయితే ఎట్టి పరిస్థితుల్లోనూ తాను కాంగ్రెస్‌ను వీడే ప్రసక్తే లేదన్నారు. టిఆర్ఎస్‌కు చెందిన ఒక ముఖ్యనాయకుడి ఒత్తిడి కారణంగానే పోలీసులు తనను అరెస్టు చేయాల్సి వచ్చిందన్నారు. అందుకే వారు తనపై పెట్టిన నమ్మకాన్ని నిలబెట్టుకునేందుకు ఎవరినైనా కలుస్తానని జగ్గారెడ్డి పేర్కొన్నారు.

కొండపోచమ్మ కాల్వ పనులకు టెండర్లు

మన తెలంగాణ/హైదరాబాద్: కాళేశ్వరం కాలువల పనులకు ప్రభుత్వం టెండర్లు పిలిచింది. కాలువల నిర్మాణం, అంచనా వ్యయాలకు వారం క్రితమే పరిపాలనా అనుమతులు పొందిన ఇరిగేషన్ శాఖ, అనుమతులు వచ్చిన వెంటనే రంగంలోకి దిగింది. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా నిర్మిస్తున్న కొండపోచమ్మ సాగర్ నుంచే ఎక్కువగా ఆయకట్టుకు నీరు ఇవ్వాల్సి ఉంది. ఇందుకోసం కొండపోచమ్మ సాగర్ కాలువలు తవ్వడానికి వీలుగా ఇరిగేషన్ శాఖ టెండర్లు పిలిచింది. తొలుత పెద్ద కెనాల్ అయిన సంగారెడ్డి కాలువకే టెండర్లు పిలవడం గమనార్హం. సంగారెడ్డి కాలువ రీచ్ 1కు రూ.365.54 కోట్లు, రీచ్ 2కు రూ.375.54 కోట్లతో టెండర్లు పిలిచారు. సంగారెడ్డి కాలువ నుంచి 26.825 కిలోమీటర్ వద్ద నుంచి శామీర్‌పేట చెరువు వరకు, ఇక్కడి నుంచి బొమ్మల రామారం చెరువు, మరో వైపు కీసర వరకు నియమించే కాలువల వ్యవస్థకు రూ.353.48 కోట్ల అంచనాతో టెండర్లు ఆహ్వానించారు. ఫిబ్రవరి 21 వరకు టెండర్లు స్వీకరిస్తారు. దీనికి సంబంధించి ఫిబ్రవరి 14వ తేదీన జలసౌధలో ప్రీ బిడ్ సమావేశం ఏర్పాటు చేశారు. టెక్నికల్ బిడ్‌ను 22న, ప్రైస్ బిడ్‌ను 27వ తేదీన తెరుస్తారు. మొత్తం ప్రాజెక్టులో సంగారెడ్డి కాలువ ద్వారానే ఏడు జిల్లాలకు చెందిన ఆయకట్టుకు సాగు నీరు, తాగు నీరు అందుతుంది. మెదక్, సిద్దిపేట, సంగారెడ్డి, యాదాద్రి భువనగిరి, మేడ్చల్, రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాలు ఈ కాలువ ద్వారా లబ్ధిపొందనున్నాయి. హైదరాబాద్ తాగునీటి కోసం ప్రత్యేకంగా కేశవాపూర్‌లో నిర్మిస్తున్న రిజర్వాయర్‌కు సంగారెడ్డి కాలువ ద్వారానే నీరు అందుతుంది. అవసరాన్ని బట్టి భవిష్యత్తులో ఈ కెనాల్‌ను గండిపేట, హిమాయత్‌సాగర్ చెరువులకు అనుసంధానం చేస్తారు.

ఉపాధ్యాయుల పదోన్నతులకు లైన్ క్లియర్

మనతెలంగాణ/హైదరాబాద్ : ఉపాధ్యాయుల పదోన్నతులకు లైన్ క్లియర్ అయ్యింది. ఏకీకృత సర్వీసు నిబంధనలపై హైకోర్టు ఇచ్చిన తీర్పును సుప్రీం కోర్టు నిలుపుదల చేయడంతో ఉపాధ్యాయుల పదోన్నతులకు మార్గం సుగమమైంది. ఏకీకృత సర్వీసు నిబంధనలపై రాష్ట్రపతి సవరణ ఉత్తర్వులు అమలైతే రాష్ట్రంలో సుమారు 10 వేల నుంచి 12 వేల మంది ఉపాధ్యాయులకు పదోన్నతులు లభించనున్నాయి. ఉపాధ్యాయుల పదోన్నతులకు సంబంధించి ఏకీకృత సర్వీసు నిబంధనల సవరణ ఉత్తర్వులకు రాష్ట్రపతి ఆమోదం తెలిపినప్పటికీ, రాష్ట్ర హైకోర్టు ఆ సవరణ ఉత్తర్వులను కొట్టివేస్తూ గత ఏడాది ఆగస్టు 28న తీర్పు వెలువరించింది. దానిని సవాల్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్(ఎస్ఎల్‌పి) దాఖలు చేసింది.సోమవారం రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన ఎస్ఎల్‌పిని విచారించిన సుప్రీంకోర్టు రాష్ట్ర హైకోర్టు ఇచ్చిన తీర్పుపై స్టే విధించింది. దాంతో రాష్ట్రంలో ఉపాధ్యాయుల పదోన్నతులకు మార్గం సుగమమైంది. రాష్ట్రంలో పదోన్నతుల ద్వారా 500 మండలా విద్యాధికారి, పోస్టులు, 350 డైట్ లెక్చరర్లు, 56 డిప్యూటీ డిఇఒ పోస్టులు, సుమారు వెయ్యికిపైగా ప్రధానోపాధ్యాయుల పోస్టులు భర్తీ కానున్నాయి. వీటితోపాటు ప్రస్తుతం సెకండరీ గ్రేడ్ టీచర్లుగా కొనసాగుతున్న టీచర్లకు స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతి లభించనుంది.

పెరుగుతున్న ఉష్ణోగ్రతలు

మన తెలంగాణ/హైదరాబాద్ : మరో వారంరోజుల పాటు స్వల్పంగా చలి ఉంటుందని, పగటి ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతూ ఉన్నాయని, పొడి వాతావరణం కొనసాగుతుందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. ఆదిలాబాద్ నుంచి హైదరాబాద్ వరకు పగటి ఉష్ణోగ్రతలు నాలుగు డిగ్రీల మేర పెరగడంతో రాష్ట్రవ్యాప్తంగా 30.8 నుంచి 32 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయని తెలిపారు. ఆదిలాబాద్, మెదక్, నల్లగొండ, నిజామాబాద్, రామగుండం, రంగారెడ్డి, హన్మకొండ తదితర ప్రాంతాల్లో చలి స్వల్పంగా కొనసాగుతోందని, హైదరాబాద్‌లో ఉష్ణోగ్రత సాధారణ స్థాయికి చేరి 16.9 డిగ్రీలుగా నమోదైందని, గాలిలో తేమ తగ్గిందని తెలిపారు. రానున్న రోజుల్లో ఉష్ణోగ్రతలు పెరగడం వలన చలి తీవ్రత తగ్గే అవకాశం ఉందని పేర్కొన్నారు.

నేడు కార్యదర్శులతో సిఎస్ భేటీ

మన తెలంగాణ/హైదరాబాద్: పదిహేనవ ఆర్థిక సంఘానికి సమర్పించాల్సిన వివరాలపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్‌కె. జోషి అన్ని శాఖల ముఖ్యకార్యదర్శులతో మంగళవారం సన్నాహక సమావేశాన్ని నిర్వహించనున్నారు. ఈ నెల 18 నుంచి 20వ తేదీ వరకు రాష్ట్రంలో 15వ ఆర్థిక సంఘం పర్యటన ఉన్నందుకు అందుకు సంబంధించిన వివరాలన్నింటిపై సమీక్షించనున్నారు. ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్‌రావు ఆదేశాలకు అనుగుణంగా ఆర్థిక సంఘం నుంచి రాష్ట్రానికి రావాల్సిన నిధుల కేటాయింపులకు కావాల్సిన సమాచారంపై శాఖలవారీగా సిఎస్ చర్చించనున్నారు.

రేపు జిశాట్ 31 ప్రయోగం

బెంగళూరు: ఫ్రెంచ్ గుయానా స్పేస్ పోర్ట్ నుంచి 40వ సమాచార ఉపగ్రహం జిశాట్ 31ని బుధవారం ప్రయోగించేందుకు భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ ఇస్రో అన్ని ఏర్పాట్లూ చేసింది. కొన్ని ఇనార్బిట్ శాటిలైట్ల ఆపరేషనల్ సర్వీసుల్ని కొనసాగించేందుకు ఈ శాటిలైట్ వీలుకల్పిస్తుంది. జి శాట్ 15 ఏళ్లపాటు పనిచేస్తుందని స్పేస్ ఏజెన్సీ తెలిపింది.

హరితహారం భేష్



- ప్రశంసించిన యుపి అధికారుల బృందం, క్షేత్రస్థాయి అధ్యయనం
- రాష్ట్ర అధికారులతో సుదీర్ఘ చర్చ, నేడు గజ్వేల్, సిద్దిపేట జిల్లాల్లో పర్యటన

మన తెలంగాణ / హైదరాబాద్ : అడవుల సంరక్షణ, పచ్చదనం పెంపు కోసం రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 'తెలంగాణకు హరితహారం' కార్యక్రమం దేశానికే ఆదర్శవంతంగా మారిందని ఉత్తర ప్రదేశ్ రాష్ట్రానికి చెందిన అధికారుల బృందం ప్రశంసించింది. హరితహారం పథకం అమలు తీరుతో పాటు అడవుల సంరక్షణ, పచ్చదనం పెంపుకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను తెలుసుకునేందుకు ఉత్తరప్రదేశ్ రాష్ట్ర అధికారుల బృందం సోమవారం నగరానికి చేరుకుంది. యూపి గ్రీన్ ప్రాజెక్టు మిషన్ డైరెక్టర్, ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి సొంత నియోజకవర్గం గోరఖ్‌పూర్ చీఫ్ కన్జర్వేటర్‌గా బివాస్ రంజన్ నేతృత్వంలో అధికారుల బృందం అరణ్యభవన్‌లో సమావేశమైంది. గత ఐదేళ్లుగా పచ్చదనం పెంపు కోసం ప్రభుత్వం చేపట్టిన హరితహారం ప్రాజెక్టుపై సుదీర్ఘంగా చర్చించారు. కోట్లాది మొక్కలు నాటాలనే ముఖ్యమంత్రి చంద్రశేఖర్ రావు సంకల్పమే తమకు అత్యంత ధైర్యానిచ్చిందని రాష్ట్ర అటవీశాఖ అధికారులు తెలిపారు. హరితహారం తీరుపై అధ్యయనం చేసి తమ రాష్ట్రంలో కూడా గ్రీన్ ప్రాజెక్టును సమర్థవంతంగా అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటామని యూపి గ్రీన్ ప్రాజెక్టు మిషన్ డైరెక్టర్ తెలిపారు. ఈ ఏడాది వర్షాకాలంలో యూపి జనాభా 22 కోట్లు మంది ఉండగా ఒక్కొక్కరుగా ఒక్కొ మొక్క చొప్పున 22 కోట్ల మొక్కలను నాటాలని తమ ముఖ్యమంత్రి అధిత్యనాథ్ నిర్ణయించారని తెలిపారు. ఇందుకోసం ఎలా సంసిద్ధత కావాలన్న ప్రణాళికలో భాగంగానే తాము తెలంగాణ రాష్ట్ర పర్యటనకు వచ్చినట్లు తెలిపారు. పచ్చదనాన్ని గ్రామ అభివృద్ధిని తప్పనిసరి అంశంగా చేరుస్తూ కొత్తగా తెచ్చిన పంచాయతీరాజ్ చట్టాన్ని కూడా యూపి అధికారులు ప్రసంశించారు. తమ రాష్ట్రంలో కూడా ఈ ప్రతిపాదనపై అధ్యయనం చేస్తామన్నారు. భారీ సంఖ్యలో నర్సరీల ఏర్పాటు, ఉపాధి హామి నిధుల అనుసంధానం, మొక్కలు నాటే కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికార యంత్రాంగం, ప్రజలు, విద్యార్థుల భాగస్వామ్యంపై తెలంగాణ అదనపు అటవీ సంరక్షణ అధికారి ఆర్ఎం.డోబ్రియేల్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. అన్న అడవులను కాపాడుకోవడంతో పాటు కొత్తగా పచ్చదనం పెంచాలన్న సృహను స్వయంగా ముఖ్యమంత్రే ప్రజల్లో ఒక ఉద్యమ స్ఫూర్తిని రగిలించారన్నారు. ఈ నేపథ్యంలో పచ్చదనం పెంపునకు సంబంధించిన పథకం విజయవంతమైందని అటవీ సంరక్షణ ప్రధాన అధికారి ప్రశాంత్‌కుమార్ ఝా తెలిపారు. అలాగే అటవీ రక్షణ, వేట, స్మగ్లింగ్ నిరోధ చర్యలు, అటవీ పునర్దరణ చర్యలు, కొత్తగా అర్బన్ ఫారెస్టు పార్కుల ఏర్పాటు, ప్రభుత్వం చేపట్టిన సాగునీటి ప్రాజెక్టులకు అత్యంత వేగంగా అటవీ అనుమతుల సాధన, వాటి స్థానంలో ప్రత్యామ్నాయ మొక్కల పెంపకం చేపట్టడం, అటవీ భూములను రెవెన్యూ రికార్డులో చేర్చడం, సరిహద్దుల గుర్తింపు, భవిష్యత్‌లో అక్రమణలు జరగకుండా కంచె ఏర్పాటు, కందనాల ఏర్పాటుపై పిసిసిఎఫ్ రఘువీర్, అదనపు పిసిసిఎఫ్ లోకేష్ జైస్వాల్, స్వర్గం శ్రీనివాస్ వివరించారు. అటవీ సంరక్షణ, హరితహారం అమలుపై ప్రతి విషయాన్ని అత్యంత ఆసక్తిగా అధ్యయనం చేసిన ఉత్తరప్రదేశ్ అధికారులు, మంగళవారం గజ్వేల్, సిద్దిపేట, మెదక్ ప్రాంతాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించనున్నారు. ఉత్తరప్రదేశ్ అధికారుల బృందంలో మిషన్ డైరెక్టర్ బివాస్ రంజన్‌తో పాటు లక్నో, మీరట్, ఝాన్సీ, కాన్పూర్, బరైలీ సిసిఎఫ్‌లు విష్ణుసింగ్, లలిత్ వర్మ, జిఎన్.మూర్తి, ఓపి.సింగ్, అరవింద్ గుప్తా, నోడల్ అధికారి పంకజ్‌మిశ్రా, గోరఖ్‌పూర్, లక్నో మండల సిసిఎఫ్‌లు హేమంత్‌కుమార్, ప్రవీణ్‌రావు, మీర్జాపూర్ అదనపు పిసిసిఎఫ్ ప్రభాకర్ దూబే, కాన్పూర్ వైల్డ్‌లైఫ్ సిపిఎఫ్ సునీల్ చౌదరి ఉన్నారు.

పంచాయతీ అధికారులతో రేపు సిఎం భేటీ

సర్పంచ్‌లకు శిక్షణ ఇచ్చే ట్రైనర్‌లకు మార్గనిర్దేశం



మన తెలంగాణ/హైదరాబాద్: రాష్ట్రంలో ఇటీవల బాధ్యతలు స్వీకరించిన సర్పంచ్‌లకు అవగాహన కల్పించేందుకు పంచాయతీరాజ్ శాఖలోని ట్రెయినర్‌లతో నెల 6వ తేAదీన ముఖ్యమంత్రి కెసిఆర్ సమావేశం కానున్నారు. ప్రగతి భవన్‌లో జరిగే ఈ సమావేశానికి సుమారు 350 మంది పంచాయతీరాజ్ ఉద్యోగులు హాజరయ్యే అవకాశం ఉంది. కొత్తగా ఎన్నికలైన సర్పంచ్‌లకు గ్రామాభివృద్ధి, ప్రజా సంక్షేమం తదితర అంశాలతో పాటు రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించిన నూతన పంచాయతీరాజ్ చట్టం, ప్రభుత్వ లక్ష్యాలు, ప్రాధాన్యతా క్రమం తదితరాలపై అవగాహన కలిగించేందుకు ట్రెయినర్‌లకు తొలుత మార్గనిర్దేశనం చేయాలని ముఖ్యమంత్రి భావిస్తున్నారు. కేంద్రం నుంచి ఏయే పథకానికి ఎంత మేరకు నిధులు వస్తున్నాయని, రాష్ట్ర ప్రభుత్వం కూడా తన వంతు వాటాగా జమ చేసి విడుదల చేస్తుండడం, వాటిని పంచాయతీ అభివృద్ధి పనులకు ఖర్చు చేస్తుండడం తదితరాలన్నింటిపై సర్పంచ్‌లకు అవగాహన కల్పించాలన్న ఉద్దేశంతో ట్రెయినర్‌లతో సిఎం ఈ సమావేశాన్ని ఏర్పాటుచేస్తున్నారు. ఇక్కడ అవగాహన చేసుకున్న అంశాలను వారు ఒక షెడ్యూలు ప్రకారం సర్పంచ్‌లకు వివరిస్తారు. పంచాయతీలు కొలువుదీరిన తర్వాత వారితో రాష్ట్ర స్థాయిలో ఒక సదస్సును నిర్వహించనున్నట్లు, దానికి స్వయంగా తాను హాజరుకానున్నట్లు గతంలోనే ముఖ్యమంత్రి కెసిఆర్ పేర్కొన్నారు. దీనికి తోడు కొత్తగా సర్పంచ్‌లు అయినవారికి కొత్త పంచాయితీరాజ్ చట్టంతో పాటు ప్రభుత్వ ఆలోచనలపై విడతలవారీగా శిక్షణ ఇవ్వనున్నట్లు కూడా పేర్కొన్నారు. గ్రామాల్లో పచ్చదనం, పారిశుద్ధ్యం, కనీస సౌకర్యాలు తదితర అంశాలకు ఇవ్వాల్సిన ప్రాధాన్యతపై పంచాయతీరాజ్ అధికారులు ఈ శిక్షణా శిబిరాల్లో కొత్త సర్పంచ్‌లకు వివరిస్తారని కూడా పేర్కొన్నారు. ఆ ప్రకారం బుధవారం ప్రగతిభవన్‌లో సర్పంచ్‌లతో పాటు సుమారు 350 మంది పంచాయతీరాజ్ అధికారులు, సిబ్బంది పాల్గొననున్నట్లు సమాచారం. రాష్ట్ర పాలనలో పంచాయతీల పాత్ర, గ్రామాల్లోని ప్రజలు ప్రభుత్వం నుంచి, సర్పంచ్‌ల నుంచి ఏం ఆశిస్తున్నారు, జనాభా తక్కువగా ఉన్న గ్రామాలను సైతం ఎందుకు పంచాయతీలుగా ఏర్పాటు చేయాల్సి వచ్చింది, రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యాలు, ఆశయాలను ఎలా సాధించాలి, పాలనలో ఎలాంటి మెలుకవలు నేర్చుకోవాలి, ప్రజలకు కావాల్సిన కనీస సౌకర్యాలకు ఎలాంటి ప్రాధాన్యతను ఇవ్వాలి, కొత్త పంచాయతీరాజ్ చట్టం ఏం చెబుతోంది, వ్యవసాయ రంగానికి రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యత తదితర అంశాలపై కెసిఆర్ కూలంకషంగా వివరించనున్నట్లు తెలిసింది.

ఉపాధి కల్పనలో నైపుణ్యాలే కీలకం

సిలబస్‌లో మార్పులు రావాలి : నవీన్ మిట్టల్



మనతెలంగాణ/హైదరాబాద్ : ఉన్నత విద్యాసంస్థల్లో పరిశ్రమలకు అవసరమైన కీలక నైపుణ్యాలు నేర్పించడం ద్వారా విద్యార్థులకు ఉపాధి అవకాశాలు పెంపొందించవచ్చని రాష్ట్ర సాంకేతిక విద్య, కళాశాల విద్య కమిషనర్ నవీన్ మిట్టల్ వ్యాఖ్యానించారు. పరిశ్రమల అవసరాలను త్వరితగతిన నేర్చుకునే విధంగా సమస్యను అర్థం చేసుకుని పరిష్కరించే నైపుణ్యం, క్లిష్టమైన సమస్యలపై ఆలోచించడం, కమ్యూనికేషన్ స్కిల్స్ తదితర నైపుణ్యాలు నేర్పించడం ద్వారా ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని పేర్కొన్నారు. సోమవారం మారియట్ హోటల్‌లో ఉన్నత విద్య, మానవ వనరులపై నిర్వహిస్తున్న రెండు రోజుల సదస్సు ప్రారంభమైంది. ఈ సదస్సు ప్రారంభ సెషన్‌లో ఎఐసిటిఇ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ నీతూ భగత్, యెస్ బ్యాంక్ గ్రూప్ ప్రెసిడెంట్ రింకి డింగ్రా, సాంకేతిక విద్య, కళాశాల విద్య కమిషనర్ నవీన్ మిట్టల్, ఉన్నత విద్యామండలి వైస్ ఛైర్మన్ ఆర్.లింబాద్రి, ఇంటర్మీడియేట్ బోర్డు కార్యదర్శి ఎ.అశోక్, ఇక్ఫాయ్ వైస్ ఛాన్సలర్ జె.మహేందర్‌రెడ్డి, అన్నపూర్ణ ఇంటర్నేషనల్ స్కూల్ ఆఫ్ ఫిల్మ్ అండ్ మీడియా డిప్యూటీ డైరెక్టర్ అమల అక్కినేని, శ్రీనిధి విద్యాసంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నర్సింహ్మారెడ్డి తదితరులు పాల్గొని ప్రసంగించారు.

పిసిసి చీఫ్‌లకు అధిష్ఠానం పిలుపు

మన తెలంగాణ/హైదరాబాద్: పార్లమెంట్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని అన్ని రాష్ట్రాల పిసిసి అధ్యక్షులతో రాహుల్‌గాంధీ మంగళవారం సాయంత్రం ఢిల్లీలో సమావేశం కానున్నారు. ఈ సమావేశానికి హాజరుకావాల్సిందిగా ఇప్పటికే అధిష్ఠానం నుంచి పిసిసి చీఫ్‌లకు లేఖలు అందాయి. రానున్న ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపై రాహుల్ గాంధీ దిశానిర్దేశం చేయనున్నారు. ఈ సమావేశంలో పాల్గొనేందుకు తెలంగాణ పిసిసి చీఫ్ సహా ఉపాధ్యక్షులు, వర్కింగ్ ప్రెసిడెంట్‌లు, సీనియర్ నేతలు ఢిల్లీకి వెళ్తున్నారు.

'మా పై కౌశిక్ దాడి చేశాడు'

మన తెలంగాణ/ సిటీబ్యూరో : టాలీవుడ్ ప్రముఖ నటుడు,యాంగ్రీ స్టార్ రాజశేఖర్ సోదరుడి గుణశేఖర్‌పై కౌశిక్ రెడ్డి అనే వ్యక్తి దాడికి పాల్పడ్డాడని జీవితా రాజశేఖర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. గుణకు సంబంధించిన దుకాణం ముందు కౌశిక్ కారు పార్కింగ్ చేయడంతో ఇక్కడెందుకు పార్కింగ్ చేశావంటూ గుణశేఖర్ వెళ్ళి ఆయన్ని ప్రశ్నించగా తీవ్ర ఆ గ్రహానికి లోనైన కౌశిక్ దాడి చేసినట్లు జీవితా ఆరోపిస్తున్నారు. షాపు ముందు సీసీ పుటేజిని సేకరించి ఆధారాలతో సహా సోమవారం బంజారాహిల్స్‌లోని సీపీ కార్యాలయానికి వెళ్ళి ఫిర్యాదు చేశారు. గుణతోపాటు జీవితా రాజశేఖర్ కూడా ఉన్నారు.


దేశంలోనే నిట్ నంబర్‌వన్‌గా ఉండాలి : కడియం



మనతెలంగాణ/సుబేదారి(నిట్ క్యాంపస్): దేశంలో నిట్ మొదటిస్థానంలో ఉండాలని మాజీ ఉపముఖ్యమంత్రి, ఎంఎల్‌సి కడియం శ్రీహరి అన్నారు. సోమవారం జాతీయ సాంకేతిక విద్యా సంస్థలో సిల్వర్ జూబ్లీ ఉత్సవాల్లో భాగంగా ఎస్సి, ఎస్టి నాన్‌టీచింగ్ వర్కర్లకు నేషనల్ వర్క్‌షాప్, సాఫ్ట్ స్కిల్స్ అనే కార్యక్రమం అంబేద్కర్ లర్నింగ్ సెంటర్‌లో ఎస్సి, ఎస్టి అధ్యక్షుడు హీరాలాల్ ఆధ్వర్యంలో నిర్వహించారు. రెండు రోజులు జరిగే ఈ కార్యక్రమానికి మొదటిరోజు ముఖ్యఅతిథులుగా మాజీ ఉపముఖ్యమంత్రి, ఎంఎల్‌సి కడియం శ్రీహరి, నిట్ డైరెక్టర్ ఎన్‌వీ రమణారావు హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కడియం శ్రీహరి మాట్లాడుతూ మారుతున్న టెక్నాలజీని బట్టి మన ఆలోచన విధానాన్ని పెంపొందించుకోవాలని తెలిపారు. నాన్‌టీచింగ్, టీచింగ్ సాఫ్ట్ స్కిల్స్ నేర్చుకునుటకు వచ్చిన వారందరికీ అభినందనలు తెలిపారు. బిఆర్ అంబేద్కర్ రాజ్యాంగంలో ఎస్సి, ఎస్టి రిజర్వేషన్లను కల్పించారని వాటిని వినియోగించుకొని లబ్ధిపొందడం జరిగిందని తెలిపారు. భారతదేశంలో గొప్ప మేధావి బిఆర్ అంబేద్కర్ అని తెలిపారు. సమాజంలో ఎస్సి, ఎస్టి ఉద్యోగులను కొంతమంది రిజర్వేషన్లతో ఉద్యోగంలోకి వచ్చారని వీరికి స్కిల్స్ లేవని ప్రచారం చేస్తున్నారన్నారు. సమాజంలో వచ్చే మార్పులకు అనుగుణంగా మారాలి అని అంశాలను తెలపడానికి ఈ కార్యక్రమం ఉద్దేశం. ఎస్సి, ఎస్టిలు మరింత ముందుకు వెళ్లి అంబేద్కర్ ఆశయాలను నెరవేర్చాలని తెలిపారు. అనంతరం ఎన్‌వీ రమణరావు వచ్చిన తరువాత నిట్‌లో అనేక మార్పులు వచ్చాయని తెలిపారు. దేశంలోనే మొదటిస్థానంలో నిట్ ఉండాలని తెలిపారు. అలా చేయాలంటే అందరూ కలిసి ఉంటేనే సాధ్యమవుతుందని తెలిపారు. తెలుగు, హిందీ, ఇంగ్లీష్, మూడు భాషలలో పట్టు సాధిస్తే మన వృత్తి ఎంతగానో అభివృద్ధి చేసుకోవచ్చని తెలిపారు. మీరు నేర్చుకున్న స్కిల్స్ మీ వృత్తిలో మరొకరికి పంచుకుంటూ ముందుకు సాగాలని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో మహిళలు సెల ఫోన్, స్మార్ట్‌ఫోన్‌లు వాడుతున్నారని వారికి చదువు లేకున్నా ఏవిధంగా వాడాలి? గుర్తు పెట్టుకొని స్మార్ట్ ఫోన్లను వినియోగించుకొని ఫోటోలు తీయడం రికార్డ్స్ తదితర పనులు చేస్తూ స్మార్ట్‌ఫోన్‌ని ఉపయోగించుకున్నారని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎస్సి, ఎస్టి సెక్రటరి సంజీవ్, రిజిస్ట్రార్ గోవర్ధన్ ఆనంద్ కిషోర్, కోలా శ్రీధర్, ప్రొఫెసర్లు, నిట్ అధ్యాపకులు, ఉద్యోగులు, నాన్‌టీచింగ్ స్టాఫ్, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు సేఫ్టీ కోసం పటిష్ట చర్యాలు

- తెలంగాణలో క్రైం రేటు తగ్గింది : హోం మంత్రి మహమూద్ అలీ
- రాచకొండ పోలీసుల 30వ రోడ్ సేఫ్టీ వీక్



మనతెలంగాణ/ సిటీబ్యూరో: రోడ్ సేఫ్టీ కోసం తెలంగాణ ప్రభుత్వం పలు చర్యలు తీసుకుంటోందని తెలంగాణ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, హోం మంత్రి మహమూద్ అలీ అన్నారు. యూఎస్ఏ, యూకేలో వలే రోడ్ సేఫ్టీ కోసం కృషి చేస్తోందని అన్నారు. రాచకొండ పోలీసులు మెగా ట్రాఫిక్ అవేర్‌నెస్ ప్రోగ్రాం, 30వ రోడ్ సేఫ్టీ వీక్‌ను సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్ సేఫ్టీపై తెలంగాణ ప్రభుత్వం దృష్టి సారించిందని, రవాణాను మెరుగుపరిచిందని అన్నారు. ఢిల్లీలో హోం మంత్రి తెలంగాణ రాష్ట్రం చాలాబాగా పనిచేస్తోందని అన్నారు. పోలీసులకు వాహనాలు ఇచ్చామని, ఆఫీసర్లకు కార్లు, పెట్రోలింగ్ కోసం మోటార్ సైకిళ్లు ఇచ్చామని తెలిపారు. రోడ్డు ప్రమాదం జరిగిన ప్రాంతానికి త్వరగా చేరకునేందుకు వాహనాలను ఇచ్చామని తెలిపారు. తెలంగాణ వచ్చిన తర్వాత క్రైం రేటు తగ్గిందని అన్నారు. మద్యం తాగి వాహనాలు నడుపవద్దని కోరారు. మన కోసం కుటుంబ సభ్యులు వేచిచూస్తారనే విషయం తెలుసుకోవాలని అన్నారు. మనకోసమే కానిస్టేబుల్ నుంచి డిజిపి వరకు కష్టపడుతున్నారని, ఎండనకా వాన అనకా విధులు నిర్వర్తిస్తున్నారని అన్నారు.



ఒక్క క్షణం ఆలోచించండి : జానకిరామ్

ట్రాఫిక్ నిబంధనలు అందరికీ తెలుసని కాని పాటించకపోవడం వల్లే రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని సినీ హీరో నందమూరి జానకిరామ్ అన్నారు. ప్రతి ఒక్కరూ హెల్మెట్, సీటు బెల్ట్ పెట్టుకోవాలని అన్నారు. అలసత్వం వల్ల కుటుంబ సభ్యులు బాధపడుతున్నారని అన్నారు. రోడ్డు ప్రమాదాల వల్ల తన అన్నయ్య, నాన్న చనిపోయారని తెలిపారు. పతి ఒక్కరూ భద్రత నిబంధనలు పాటించాలని కోరారు. ఒక్క క్షణం ఆలోచించాలని, ఇంటిలో

అధిక వేగం వల్లే ప్రమాదాలు : కృష్ణప్రసాద్

నేను వాహనాన్ని నడుపుతున్నప్పుడు కాని, నిత్య జీవితంలో ఏ ఇతర సందర్భంలోనైనా గాని రోడ్డు భద్రత నియమాలు పాటిస్తానని ఇతరులు పాటించేలా ప్రోత్సహిస్తానని ప్రతిజ్ఞ చేస్తున్నాను. అని విద్యార్థులతో టి. కృష్ణ ప్రసాద్, డిజి రోడ్డు సేఫ్టీ ప్రతిజ్ఞ చేయించాడు. ఈ సందర్భంగా టి.కృష్ణప్రసాద్, డిజి రోడ్డు సేఫ్టీ ప్రతిజ మాట్లాడుతూ ప్రతి ఏడాది రాచకొండ పోలీసులు రోడ్ సేఫ్టీ కార్యక్రమం నిర్వహించడం శుభపరిణామమని అన్నారు. ప్రతి ఒక్కరికి రోడ్ సేఫ్టీ చాలా ముఖ్యాంశామని అన్నారు. రోడ్డు ప్రమాదాల వల్ల ప్రపంచ వ్యాప్తంగా 12లక్షలు, దేశంలో 1.5లక్షల మంది మృతిచెందుతున్నారని తెలిపారు. రోడ్డు ప్రమాదాల్లో ఎక్కువగా 15 నుంచి 35 వయస్సుగల యువకులు రోడ్డు ప్రమాదాల్లో మృతిచెందుతున్నారని అన్నారు. 2016లో రోడ్డు ప్రమాదాల్లో 22,800 రోడ్డు ప్రమాదాలు జరుగగా, 7,219మంది మృతిచెందారని, 2017లో 22,485 ప్రమాదాలు జరుగగా, 6,596మంది మృతిచెందారని, 2018లో 21,000 ప్రమాదాలు జరుగగా, 6,400 మంది మృతిచెందారని తెలిపారు. 50శాతం యువకులు రోడ్డు ప్రమాదాల వల్లే చనిపోతున్నారని అన్నారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, కుటుంబ సభ్యులు, స్నేహితులు పాటించేలా గుర్తు చేయాలని అన్నారు. అధిక వేగం, డ్రంక్ అండ్ డ్రైవ్ వల్ల ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని అన్నారు.

భద్రతే ట్రాఫిక్ పోలీసుల కర్తవ్యం : జితేందర్

రోడ్డు ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ పోలీసులు చాలా చర్యలు తీసుకుంటున్నారని అడిషనల్ డిజి లాఅండ్ ఆర్డర్ జితేందర్ అన్నారు. రోడ్డు ప్రమాదాల వల్ల 2016లో 400మంది మరణించారని, 2017–18లో 300 మంది మృతిచెందారని తెలిపారు. డబ్బులు వసూలు చేసేందుకు ట్రాఫిక్ చలన్లు వేయడంలేదని, భద్రతే తమ కర్తవ్యమని తెలిపారు.

ఓవర్ స్పీడ్ వల్లే ప్రమాదాలు : మహేష్ భగవత్

వాహనాలను అధిక వేగంగా నడపడం వల్లే 50శాతం రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని రాచకొండ పోలీస్ కమిషనర్ మహేష్ భగవత్ అన్నారు. మద్యం తాగి కారు నడపడం వల్లే చిన్నారి రమ్య మృతిచెందిందని అన్నారు. వారి కుటుంబంలో ముగ్గురు మృతిచెందారని తెలిపారు. తాగి డ్రైవింగ్ చేయడం వల్ల వారి కుటుంబంలో ముగ్గురు మృతిచెందారని తెలిపారు. కార్యక్రమంలో జబర్దస్త్ టీం సభ్యులు డ్రంక్ అండ్ డ్రైవ్‌పై స్టేజీ షో ఇచ్చారు. హోం మంత్రి మోటార్ సైకిల్ ర్యాలీని ప్రారంభించి స్వయంగా బైక్‌ను నడిపాడు. రోడ్డు ప్రమాదాల్లో మృతిచెందిన వారికి నివాళులు అర్పించారు. డిసిపి క్రైం నాగరాజు, మల్కాజ్‌గిరి డిసిపి ఉమామహేశ్వర శర్మ, ఎల్‌బి నగర్ డిసిపి సన్‌ప్రీత్ సింగ్, ట్రాఫిక్ డిసిపి దివ చరణ్, అడిషనల్ డిసిపి ట్రాఫిక్–1 ఎండి తాజుద్దీన్ అహ్మద్, ఎస్‌సిఎస్‌సి ట్రాఫిక్ ఫోరం కృష్ణ ఏదుల, వెంకట్ నవీన్ విపి హర్ష టాయోటా, శ్రీధర్ పాల్గొన్నారు.

కోల్‌కతా పరిణామాలు!

సంపాదకీయం

కేంద్ర దర్యాప్తు సంస్థ (సిబిఐ) వివాదాస్పద వృత్తాంతాల చిట్టాకు కోల్‌కతా కేంద్రంగా మరొక సంచలనాత్మక పరిణామం వచ్చి చేరింది. బహుశ గతంలో ఎన్నడూ లేని విధంగా సిబిఐ అధికారులను ఒక రాష్ట్ర పోలీసులు అదుపులోకి తీసుకొని విడిచిపెట్టారు. కోల్‌కతా పోలీసులు సిబిఐ సిబ్బందిని అధికారికంగా అరెస్టు చేశారని కూడా ధ్రువపడని వార్తలు వచ్చాయి. ఈ క్రమంలో సిబిఐ అధికారులకు కోల్‌కతా పోలీసులకు జరిగిన బాహాబాహీ ఘర్షణను ప్రపంచమంతా చూసింది. దేశమంతటిలో జరిగే తీవ్రమైన నేరాలను దర్యాప్తు చేయడానికి నియమితమైన జాతీయ స్థాయి సంస్థ సిబ్బందికి ఒక రాష్ట్ర పోలీసులకు మధ్య తలఎత్తిన ఈ ఘర్షణను కేంద్రానికీ రాష్ట్రానికీ మధ్య జరిగిన అధికార పరిధుల యుద్ధంగానే భావించాలి. ఇది ఎంతమాత్రం హర్షించకూడనిది. ఎంతైనా ఆందోళన చెందవలసినది. కేవలం చట్ట, న్యాయ నియమాల పరిధికి పరిమితమై ఉంటే వ్యవహారం ఇంతగా ముదిరి ఉండేది కాదు. దీని వెనుక కేంద్రంలో అధికారంలో గల భారతీయ జనతా పార్టీకి, పశ్చిమ బెంగాల్ పాలక పక్షం తృణమూల్ కాంగ్రెస్‌కు మధ్య రగులుతున్న రాజకీయ వైరం స్పష్టంగా కనిపిస్తున్నది. ఇది ఈ మధ్య పరాకాష్ఠకు చేరుకున్నది. లోక్‌సభ ఎన్నికలు అతి త్వరగా చేరువవుతున్న తరుణంలో ముందుముందు మరింత వేడి రగిలే అవకాశమున్నది. ముఖ్యంగా ప్రధాని మోడీకి, ముఖ్యమంత్రి మమతా బెనర్జీకి మధ్య పచ్చిగడ్డి కూడా భగ్గుమంటున్నది. మోడీ వ్యతిరేక ప్రతిపక్ష కూటమిలో మమతా బెనర్జీ కీలక పాత్ర వహిస్తున్నారు.

రెండు చిట్‌ఫండ్ కంపెనీల భారీ కుంభకోణాలకు సంబంధించి సుప్రీంకోర్టు ఆదేశించిన దర్యాప్తులో భాగంగా కోల్‌కతా పోలీసు కమిషనర్ రాజీవ్ కుమార్‌ను ప్రశ్నించడానికంటూ సిబిఐ అధికారులు తమకు బాగా అలవాటైన పద్ధతిలో సరాసరి ఆయన ఇంటికి వెళ్లడం ఆదివారం నాటి ఘటనలకు మూలం. ఢిల్లీ పోలీసు చట్టం కింద పురుడు పోసుకున్న సిబిఐని తమ తమ రాష్ట్రాల కేసులలో జోక్యం చేసుకోకుండా దూరంపెడుతూ ఆంధ్రప్రదేశ్, పశ్చిమ బెంగాల్‌లు అధికారిక నిర్ణయం తీసుకున్నాయి. అయితే నేరుగా సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు జరుపుతున్న దర్యాప్తు కాబట్టి పశ్చిమ బెంగాల్‌లో విధి నిర్వహణ చేపట్టే అధికారం సిబిఐకి ఉంటుంది. కాని ఆ రాష్ట్ర ప్రభుత్వానికి అధికారికంగా ముందస్తు సమాచారమిచ్చి అక్కడికి వెళ్లడం సిబిఐపై ఉన్న గురుతరమైన ఫెడరల్ బాధ్యత. ఇటువంటి మర్యాదలేవీ సిబిఐ పాటించినట్లు కనిపించడం లేదు. పైపెచ్చు కోల్‌కతా పోలీసు కమిషనర్ రాజీవ్ కుమార్ పరారీలో ఉన్నాడని, రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు చిట్ ఫండ్ కుంభకోణాలపై ప్రత్యేక దర్యాప్తు బృందానికి (సిట్) సారథ్యం వహించినపుడు ఆయన కొన్ని కీలక పత్రాలను మాయం చేశాడని సిబిఐ ప్రచారంలో పెట్టినట్టు వార్తలు వచ్చాయి. ఇందుకు విరుద్ధంగా, నిష్పాక్షికమైన నిజాయితీతో కూడిన విధి నిర్వహణలో రాజీవ్ కుమార్ ప్రపంచంలోనే నంబర్ వన్ విశిష్ట అధికారని మమతా బెనర్జీ కొనియాడారు. తమ పోలీసులను లొంగదీసుకోడానికే కేంద్రం సిబిఐని ఆయన మీదకి ప్రయోగించిందని ఆరోపిస్తూ ఆమె హుటాహుటిన ధర్నాకు దిగి కొనసాగిస్తున్నారు. ఇటీవల బెంగాల్‌లో జరిగిన బిజెపి బహిరంగ సభలో ప్రధాని మోడీ చేసిన ప్రసంగం మమతా బెనర్జీ పాలనపై సునిశితమైన దాడితో సాగింది. తృణమూల్‌ది బలవంతపు వసూళ్ల ప్రభుత్వమని మోడీ విమర్శించారు. బిజెపి తనకలవాటైన రథయాత్రల ప్రచార పర్వానికి అక్కడ తెర తీయబోగా మమతా బెనర్జీ ప్రభుత్వం అడ్డుకున్నది. యుపి ముఖ్యమంత్రి ఆదిత్య నాథ్ హెలికాప్టర్ దిగడానికి అనుమతించలేదు. ఆదివారం నాటి ఘటనలపై కేంద్ర హోం శాఖ పశ్చిమ బెంగాల్ రాష్ట్ర గవర్నర్ నుంచి నివేదిక కోరడం గమనార్హం. రాష్ట్రపతి పాలన విధించడానికి కేంద్రం కుట్ర పన్నుతున్నదని ఇప్పటికే మమతా బెనర్జీ ఆరోపించి ఉన్నారు. సిబిఐని, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్‌ను బిజెపి రాజకీయ ప్రత్యర్థులపై కక్ష సాధింపు కోసం వినియోగిస్తున్నారనే విమర్శ ఈసరికే తీవ్ర స్థాయిలో వినవస్తున్నది. రాజ్యాంగ వ్యవస్థలపట్ల పాటించవలసిన పరిధులను కేంద్రం అతిక్రమిస్తున్నదనే భావన ఏర్పడి ఉన్నది. బెంగాల్‌లో సిబిఐ విధి నిర్వహణ ప్రయత్నం మామూలుగా అయితే ఆక్షేణీయం ఎంతమాత్రం కాకపోయినప్పటికీ తృణమూల్ కాంగ్రెస్, బిజెపిల మధ్య గల రాజకీయ ఘర్షణ వాతావరణం నేపథ్యమే పలు అనుమానాలకు తావు కలిగించింది. కోల్‌కతా పోలీసులు తమ విధి నిర్వహణను అడ్డుకున్నారంటూ సిబిఐ దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు మంగళవారం నాడు విచారణ చేపట్టనున్నది. తీర్పు ఏ రీతిలో వస్తుందో వేచి చూడాలి. ప్రజాహితమే పరమావధిగా పనిచేయవలసిన సిబిఐ, పోలీసు వంటి కీలక వ్యవస్థలు రాజకీయాధిపతుల పాదాక్రాంతమై పనిచేస్తున్నాయనే అభిప్రాయానికి తావు కలగడమే భారత ప్రజాస్వామ్యానికి కళంకం తెస్తున్న అంశం.

పేదలను పీడించే వాతావ'రణం'!

శీతోష్ణ స్థితిలో మార్పులతో ప్రభావితమైన దేశాల్లో భారత్ అయిదో స్థానంలో ఉంది. మన దేశంలో 80 కోట్ల మంది ప్రజలు గ్రామాల్లో నివసిస్తారు. వీరికి వ్యవసాయం, సహజ వనరులే జీవనాధారం. వీటివల్లే వారికి జీవనోపాధి లభిస్తుంది. మన దేశంలోని వ్యవసాయ భూముల్లో 50 శాతం వర్షాల మీద ఆధారపడ్డవే. రుతుపవనాల్లో మార్పులు జీవనోపాధిని దెబ్బ తీస్తాయి. శీతోష్ణ స్థితిలో మార్పుల వల్ల గోధుమ పంట తగ్గిపోయినట్టు అనుభవపూర్వకమైన ఆధారాలున్నాయి.

శీతోష్ణ స్థితిలో మార్పులు మొత్తం భూగోళంపై ఉండే మనుషులు, వృక్షజాలం, జంతువులు మొదలైన సకల జీవరాసులపై భారీగానో, కొద్ది మేరకో ప్రభావం చూపడం సహజం. ఈ ప్రభావం పేదల మీద, వర్ధమాన దేశాల మీద విపరీతమైన ప్రతికూల ప్రభావం చూపుతోంది.


ఇంతకు ముందు శీతోష్ణ స్థితిలో మార్పులు నెమ్మదిగా కనిపిస్తాయని అనుకునే వారు. కాని 2018 అక్టోబర్ లో ఐక్య రాజ్య సమితి శీతోష్ణ స్థితిలో మార్పులపై వివిధ ప్రభుత్వాల నివేదిక విడుదల చేసిన తర్వాత అభిప్రాయం తప్పని తేలింది. భూగోళ కవోష్ణత 1.5 డిగ్రీల సెంటీగ్రేడ్ ఉందని ఈ నివేదికలో తెలియజేశారు. ఉష్ణోగ్రత 1.5 డిగ్రీలు పెరగడంవల్ల కోట్లాది మంది పేదలు అయిపోతారు అని ఈ నివేదికలో తెలియజేశారు.

శీతోష్ణ స్థితిలో మార్పు పేదలపై ఎంతటి దుష్ప్రభావం చూపుతుంది అనడానికి ప్రస్తుతం అనుభవ పూర్వకమైన సాక్ష్యాధారాలు చాలా అందుబాటులో ఉన్నాయి. ఈ మార్పులవల్ల ఆహారం, నీటి కొరత పెరుగుతాయి. ఈ నిత్యావసరాలను పొందడానికి పోటీ తీవ్రం అవుతుంది. దీనివల్ల ఇప్పుడున్న ఘర్షణలు పెరగడంతో పాటు కొత్త ఘర్షణలు పెరుగుతాయి. దక్షిణాఫ్రికాలోని అతి ప్రాచీనమైన కేప్‌టౌన్ లో 2015లో నీటి కొరత ప్రారంభం అయింది. ప్రపంచంలో అతి పెద్దదైన ఈ నగరంలో మంచి నీరు దొరక్కుండా పోయే ప్రమాదం ఉంది. ఈ నగర పరిసరాల్లో ఉన్న ఆవాసాలలో అనేక ఏళ్లుగా నీటి కొరత తాండవిస్తోంది. ఆ ప్రాంతాలు ఈ సంక్షోభాన్ని మరింత తీవ్ర స్థాయిలో ఎదుర్కోవలసి రావచ్చు. కాంగోలో వర్షపాతంలో మార్పులవల్ల ఆహారోత్పత్తి తగ్గింది. సేద్య యోగ్యమైన భూమి మీద ఒత్తిడి పెరిగింది.వివిధ జాతుల మధ్య ఘర్షణలు జరుగుతున్నాయి. ఆ దేశంలో ఉద్రిక్తతలు ఎక్కువ అయినాయి. ఈ ఘర్షణలకు ఎక్కువగా బలయ్యే ది పేదలే. ఇది మరింత పేదరికానికి, ఆవాసాలు కోల్పోవడానికి దారి తీసి జనం విష వలయంలో చిక్కుకుంటారు.



శీతోష్ణ స్థితిలో మార్పులవల్ల తరచుగా వరదలు, అనావృష్టి కారణంగా ఆహార కొరత పెరిగి, ఆహార పదార్థాల ధరలు పెరుగుతాయి. ఇది ఆకలికి, పోషకాహార లోపానికి దారి తీస్తుంది. వీటి వల్ల ఇబ్బంది పడేది పేదలే. ఆహార సంక్షోభంపై ప్రపంచ ఆహార పథకం 2018లో విడుదల చేసిన ఆహార సంక్షోభం నివేదిక ప్రకారం 23 దేశాలలో ఆహార సంక్షోభం ఏర్పడింది. ఈ దేశాల్లో ఎక్కువ ఆఫ్రికాలోనే ఉన్నాయి. అనావృష్టి ప్రభావం దాదాపు నాలుగు కోట్ల మంది ప్రజలపై ఉంది. వీరికి అత్యవసరంగా సహాయం అందజేయవలసి ఉంది.

143 దేశాలలో ఘర్షణల వల్ల 2017లో 3 కోట్ల ఆరు లక్షల మంది నిర్వాసితులయ్యారు. అంటే ప్రతి రోజూ 80,000 మంది నిర్వాసితులవుతున్నారు. వరదలు, తుపాన్ల వల్ల నిర్వాసితులవుతున్న వారే ఎక్కువ మంది ఉన్నారు. వరదల వల్ల 86 లక్షల మంది, తుపాన్ల వల్ల 75 లక్షల మంది నిర్వాసితులయ్యారు. శీతోష్ణ స్థితిలో మార్పుల ప్రభావం అన్ని చోట్లా కనిపిస్తోంది.



ఢాకాలో తీర ప్రాంతాల్లో వరదలు వచ్చాయి. ప్యూర్టోరికోలో మరియా తుపాను బీభత్సం సృష్టించింది. పశ్చిమ ఆఫ్రికాలో ఛాద్ సరస్సు ఎడారిలా మారిపోతోంది. 2100 సంవత్సరానికల్లా యూరప్ సమాజ దేశాల్లో ఆశ్రయం పొందే వారు 28 శాతం పెరుగుతారని అంచనా.

శీతోష్ణ స్థితిలో మార్పులతో ప్రభావితమైన దేశాల్లో భారత్ అయిదో స్థానంలో ఉంది. మన దేశంలో 80 కోట్ల మంది ప్రజలు గ్రామాల్లో నివసిస్తారు. వీరికి వ్యవసాయం, సహజ వనరులే జీవనాధారం. వీటివల్లే వారికి జీవనోపాధి లభిస్తుంది. మన దేశంలోని వ్యవసాయ భూముల్లో 50 శాతం వర్షాల మీద ఆధారపడ్డవే. రుతుపవనాల్లో మార్పులు జీవనోపాధిని దెబ్బతీస్తాయి. శీతోష్ణ స్థితిలో మార్పుల వల్ల గోధుమ పంట తగ్గిపోయినట్టు అనుభవపూర్వకమైన ఆధారాలున్నాయి. శ్రామికుల ఉత్పాదకత తగ్గింది. చిన్న రైతులకు శీతోష్ణ స్థితిలో మార్పుల ప్రభావం ఏమిటో తెలుసు. వాతావరణంలో మార్పులవల్ల పంటల విధానాలను మార్చుకోవలసి వచ్చింది. ఇది సామాజిక ఆర్థిక మార్పులకు దారి తీసింది. చిన్న రైతులకు రుణాలు అందవు. బీమా ఉండదు. శీతోష్ణ స్థితిలో మార్పుల ప్రభావం వీరి మీదే ఎక్కువ ఉంటుంది. శీతోష్ణ స్థితిలో మార్పులవల్ల పేదరికం, పోషకాహార లోపం, రైతుల ఆత్మహత్యలు పెరుగుతాయి.

2018లో కొటోవిస్‌లో శీతోష్ణ స్థితిలో మార్పులపై జరిగిన మహాసభలో ఈ మార్పుల దుష్ప్రభావాన్ని ఎదుర్కోడానికి వర్ధమాన దేశాలకు ఆర్థిక సహాయం చేస్తామన్న వాగ్దానాన్ని సంపన్న దేశాలు నిలబెట్టుకోలేదని భారత్ విమర్శించింది. పేదలు, వర్ధమాన దేశాలే శీతోష్ణ స్థితిలో మార్పుల దుష్ప్రభావానికి అధికంగా లోనవుతున్నాయి. నిజానికి శీతోష్ణ స్థితిలో మార్పులవల్ల తలెత్తిన సంక్షోభానికి ఈ దేశాలు కారణం కాదు. కానీ అభివృద్ధిలోనూ ఈ దేశాలే వెనుకబడుతున్నాయి. శీతోష్ణ స్థితిలో మార్పుల వల్ల ఎదురవుతున్న సమస్యలను ఎదుర్కోవడానికి కృషి చేస్తున్నది కూడా వర్ధమాన దేశాలే. ఇచ్చిన వాగ్దానాలకు కట్టుబడుతున్నాయి. సత్వరం చర్యలు తీసుకోకపోతే ప్రపంచ వ్యాప్తంగా అభివృద్ధి కోసం దశాబ్దాలుగా చేస్తున్న కృషి నిష్ఫలంగా తయారవుతుంది. ముఖ్యంగా మన దేశంలో అభివృద్ధి కుంటువడుతుంది. కొంత కాలంగా ఈ ప్రమాద ఘంటికలు మోగుతూనే ఉన్నాయి. సంపన్న దేశాలకు, వర్ధమాన దేశాలకు మధ్య; పేదలకు, సంపన్నులకు మధ్య అంతరాలు అంతకంతకూ పెరిగిపోతున్నాయి. ఇది చాలా స్పష్టంగా కనిపిస్తోంది.

** (ఇ.పి.డబ్ల్యు.సౌజన్యంతో)*

పాఠ్యాంశాల్లో స్త్రీలపై చిన్నచూపు



డా. దేవరాజు మహారాజు
9573706806

వరుసగా జరిగిన మానవవాదుల హత్యలు, హేతువాదులపై దాడులు, ఆలోచనా పరులైన రచయితలపై ఒత్తిళ్లు, నోట్ల రద్దు, జిఎస్‌టి, బ్యాంకుల దివాలా, రైతుల లాంగ్ మార్చ్ వంటివన్నీ భవిష్యత్తు చీకటిగా ఉండబోతోందని హెచ్చరిస్తున్నాయి. ప్రమాద ఘంటికలు మోగుతున్నాయి. అందుకు కారణం కేంద్ర మంత్రుల ఉపన్యాసాలు ఒక కారణమైతే, వివిధ రాష్ట్రాలలో పాఠ్యపుస్తకాలలోని అంశాలు మరొక కారణం! దేశంలోని వివిధ రాష్ట్రాల్లో పాఠశాల పాఠ్య పుస్తకాల్లో అసంబద్ధమైన అంశాలు, అసత్యాలు ఎలా చోటు చేసుకున్నాయో గమనించండి. పదమూడు – పదిహేను సంవత్సరాల మధ్య వయసున్న బాలబాలికలకు తప్పుడు సమాచారం అందించడమంటే, వారిని తప్పుడు వ్యక్తులుగా తయారు చేయడమే కదా? గుజరాత్‌లో యాభై వేల మంది చదువుకునే ఒక సామాన్య శాస్త్ర పాఠ్య గ్రంథంలో రెండవ ప్రపంచ యుద్ధం జరుగుతున్న సమయంలో జపాన్, అమెరికాపై అణు యుద్ధం ప్రకటించిందని ఉంది. వక్రీకరించిన చారిత్రక అంశాలు చదువుకుని భావి భారత పౌరులు ఎలా తయారవుతారన్నది ఆందోళన పడాల్సిన విషయం.



అదే విధంగా స్త్రీల గౌరవాన్ని దిగజార్చే అంశాలు పాఠ్యగ్రంథాల్లో చేర్చడం వల్ల భవిష్యత్తులో మహిళల పరిస్థితి ఏమిటీ? రాజస్థాన్‌లో బోధిస్తున్న ఒక పాఠ్య గ్రంథంలో స్త్రీలకు గాడిదలకు పోలిక చూపబడింది. ఉదయం నుండి రాత్రి వరకు స్త్రీలు గాడిదల్లా చాకిరి చేయాల్సి ఉంటుందని హిందీ పాఠ్య పుస్తకంలో సెలవిచ్చారు. గాడిదలకు చెట్టు కింద కాసేపు విశ్రాంతి నివ్వొచ్చు. కానీ స్త్రీలకు ఇవ్వకూడదు – 'పాపం గాడిదలు పారిపోయినా వెంటనే మళ్లీ దొరుకుతాయి. వాటికి స్త్రీలవలె పుట్టింటికి పారిపోయే సౌకర్యం లేదు' – అని ఆ పాఠం రాసిన రచయిత ఓ చమక్కు విసిరాడు. ఆ విషయాన్ని కింది స్థాయి నుండి పై స్థాయి అధికారుల దాకా అందరూ ఆమోదించారు. కాస్త సున్నిత మనస్కులు, ఇంగిత జ్ఞానం ఉన్న ఉపాధ్యాయనీ, ఉపాధ్యాయులు ఎవరైనా ఉంటే ఆ పాఠం పిల్లలకు ఎలా చెపుతారూ? మనసు చంపుకుని ఉద్యోగ ధర్మంగా పాఠం చెప్పడమంత శిక్ష మరొకటి ఉండదు కదా? 'పిల్లల పాఠంలో అలాంటి అంశం ఎందుకుందని'– ఒక జాతీయ పత్రికా విలేకరి సంబంధిత అధికారిని అడిగితే ''ఏదో పిల్లలకు కాస్త సరదాగా ఉంటుందని అలా పెట్టి ఉంటారని – అదో పెద్ద విషయమా?'' – అని ఎదురు ప్రశ్నించాడు. ''భార్యలు గాడిదల్లాంటి వారు'' అన్న వాక్యంలో అతనికి ఏ తప్పూ కనిపించలేదు. బిజెపి ప్రభుత్వాలున్న గుజరాత్, రాజస్థాన్‌లలో అధికారులకు, మంత్రులకు, ముఖ్యమంత్రులకు అలాగే కేంద్ర ప్రభుత్వం వారికీ ఎవరికీ అందులో తప్పే కనిపించలేదు. వీళ్లంతా ఆధునిక మనువాద ప్రతినిధులన్నమాట!

సెంట్రల్ బోర్డ్ ఫర్ సెకండరీ ఎడ్యుకేషన్ (సిబిఎస్ఇ) పాఠ్య పుస్తకంలో పది, పదకొండేళ్ళ పిల్లలు చదువుకునే పుస్తకంలో మాంసాహారం తినేవారి వల్ల సమాజంలో దౌర్జన్యాలు జరుగుతున్నాయని ఉంది. మాంసాహారం తీసుకునేవారు అవలీలగా అబద్ధాలు చెపుతారని, ఇచ్చిన వాగ్దానాలు నిలబెట్టుకోరని, అల్లర్లు, అలజడులూ సృష్టిస్తారని, ముఖ్యంగా లైంగిక దాడులకు పాల్పడుతారని, వారికి నిజాయితీ నిబద్ధత ఉండవని, ఊరికే ఆవేశపడి బూతులు మాట్లాడుతారని ఉంది. ఇలా దోషాలన్నీ మాంసాహారులకు అంటగట్టి పసి మనసుల్ని ప్రభావం చేయడం ఏం సబబు? ఏ ఆహారం తీసుకుంటే ఏఏ లాభాలున్నాయి? ఎందులో ఎన్ని నష్టాలున్నాయి? అనేది శాస్త్రీయంగా వివరించారు. ఆహారం ఎంచుకునే స్వేచ్ఛ పిల్లలకు ఇవ్వాలి. అంతేగాని, నైతికంగా దిగజారిన వారి లక్షణాలన్నీ గుదిగుచ్చి మాంసాహారులకు ఆపాదిస్తే, అది నిజమై పోదు కదా? ఒక రకంగా చూస్తే మాంసాహారులు – శాఖాహారులు ప్రపంచంలో సమానంగా ఉండి ఉంటారు. లేదా మాంసాహారుల సంఖ్యే ఎక్కువగా ఉండి ఉంటుంది. అట్లని శాఖాహారులంతా సచ్ఛీలురు, సత్యవ్రతులు, సత్ప్రవర్తన గల మహనీయులు కాదు గదా? ఈ విషయమే సిబిఎస్ఇ డైరెక్టర్‌ని అడిగితే ''పాఠ్యాంశాలపై దేశంలో నియంత్రణ లేదని, ఒక్కో ప్రాంతంలో ఒక్కో భాషలో విషయాలు ఒక్కో రకంగా ఉన్నాయని ఒప్పుకున్నారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి డెబ్బయి ఏళ్లయిపోయినా బాలబాలికలకు చెప్పాల్సిన పాఠ్యాంశాలపై నిర్దిష్టమైన ప్రణాళిక లేకపోవడం ఘోరం! ప్రభుత్వాలు మారినప్పుడల్లా అంశాలు, వక్రీకరణలు మారుతూ ఉండడం మరో ఘోరం!

మధ్య భారతంలోని చత్తీస్‌గఢ్‌లో హైస్కూలు విద్యార్థుల పాఠ్య గ్రంథంలో 'దేశంలో నిరుద్యోగ సమస్యకు మూల కారణం – మహిళలు' – అని ఉంది. మహిళలు అన్ని రంగాల్లో విజృంభించడం వల్ల , అన్ని రకాల ఉద్యోగాల్లో చేరుతూ ఉండడం వల్ల పోటీ ఎక్కువైంది. అభ్యర్థుల సంఖ్య అనూహ్యంగా పెరుగుతూ వచ్చింది. ఫలితంగానే నిరుద్యోగ సమస్య పెరిగిపోయింది – అని ప్రభుత్వం వారు నిర్ధారించారు. స్త్రీ, పురుషులందరూ దేశ పౌరులయినపుడు పౌరులకు సమాన హక్కులున్నప్పుడు అందుకు తగిన విధంగా ప్రభుత్వాలు పని చేయాలి. ఉద్యోగావకాశాలు కల్పించాలి. అంతేగాని, మహిళలు చదువుకుని ఉద్యోగాలకు పోటీపడడం వల్ల నిరుద్యోగ సమస్య పెరిగిందనడం అసంబద్ధంగా ఉంది. స్త్రీలని గాడిదలని, వారివల్లే ఉద్యోగాలు లేకుండా పోయాయని, మాంసాహారులంతా నీతిమాలిన వారని చెపుతూ ఏ సమాజాన్ని నిర్మించాలని ప్రభుత్వం కలలు కంటోంది. జనాభాలో సగ భాగమైన మహిళల్ని హీనంగా చూపిస్తూ ఆరోగ్యకరమైన సమాజాన్ని రూపొందించగలరా? పాఠశాల స్థాయి నుండే పిల్లలకు అసత్యాలను నూరిపోస్తే పర్యవసానం ఎలా ఉంటుంది? ఎలాగైనా సరే మళ్లీ మనువాదాన్ని నిలబెట్టే ప్రయత్నం బిజెపి రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు చేస్తున్నట్టుగా లేదూ? ఇలాగైతే భవిష్యత్తంతా అంధకారమే కదా? అచ్ఛేదిన్, స్వచ్ఛ భారత్ – నినాదాల కింద ఎంత మురుగు పేరుకుపోతోందో ప్రజలు తెలుసుకోవాల్సి ఉంది. ఒక్కటంటే ఒక్కటీ ముందడుగు వేయకపోగా, దేశం వెయ్యడుగులు వెనక్కి వేస్తున్నట్టుగా ఉంది. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులూ నిజాలు గ్రహించి, పిల్లలకు వాస్తవాలు చెప్పాలి. వారికి హేతుబద్ధంగా ఆలోచించడం నేర్పాలి.

ఈ పేజీకి రచనలు పంపవలసిన మెయిల్ :
editor@manatelangana.org

కాలగర్భంలో చరిత్ర ఆనవాళ్లు

రాష్ట్రంలోని పలు చారిత్రిక ఆనవాళ్లు కాలగర్భంలో కలిసిపోతున్నాయి. అధికారుల నిర్లక్ష్య వైఖరి కారణంగా బౌద్ధారామాలకు భద్రత కరువైంది. తెలంగాణ ప్రభుత్వం కోట్లాది రూపాయల నిధులు సమకూరుస్తున్నా అధికారుల పనితీరు మూలంగా ప్రసిద్ధి చెందిన ఆ ప్రాంతాలను ప్రజలు వీక్షించలేకపోతున్నారు. దేశ, విదేశాల నుంచి వస్తున్న బౌద్ధ భిక్షువులు, రీసెర్చ్ విద్యార్థులు అక్కడి పరిస్థితిని చూసి తల్లడిల్లుతున్నారు. రాష్ట్రంలో ప్రసిద్ధిగాంచిన కోటిలింగాల, ఫణిగిరి, పెద్దబొంకూరుల పరిస్థితి ఇలాగే ఉంది. రాష్ట్రంలో అత్యంత ప్రసిద్ధిగాంచిన సూర్యాపేట జిల్లా అర్వపల్లి మండలం ఫణిగిరి బౌద్ధ క్షేత్రానికి వెళ్లడానికి కనీసం దారిలేక పర్యాటకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని ఫణిగిరి స్టేజ్ నుంచి రెండు కిలోమీటర్ల దూరంలో ఈ బౌద్ధక్షేత్రం ఉంది. ఈ క్షేత్రానికి వెళ్లడానికి సరైన దారి లేదు. రెండు కిలోమీటర్ల మేర మట్టి రోడ్డుపై ప్రయాణించాల్సిందే. పైగా దారి ఇరువైపుల కంపచెట్లు, మూలమలుపులు, రోడ్డు పక్కనే ప్రమాదకరంగా పాడుపడిన బావులున్నాయి. మట్టి రోడ్డు గుంతలమయంగా ఉండడమే కాకుండా, అక్కడక్కడ వర్షాలకు కోతలకు గురైంది.

ఈ క్షేత్రానికి చైనా, జర్మనీ, మయన్మార్, భూపాల్, భూటాన్, శ్రీలంక తదితర దేశాల నుంచి వందలాది మంది రీసెర్చ్ స్కాలర్స్, బౌద్ధ సన్యాసులు వచ్చి బౌద్ధక్షేత్రాన్ని దర్శించుకునే కొందరు పరిశోధనలు చేస్తుంటారు. ఇంత ఘన చరిత్ర కలిగిన ఈ బౌద్ధ క్షేత్రానికి వెళ్లడానికి దారి లేకపోవడం, బౌద్ధ సంపదను భద్రపర్చడానికి ఒక భవనం కూడా లేకపోవడం దీని దుస్థితిని కళ్లకు కడుతుంది. మాజీ కలెక్టర్ సురేంద్రమోహన్ ఫణిగిరి బౌద్ధక్షేత్రం అభివృద్ధికి రూ. 3 కోట్లతో ప్రణాళికలు రూపొందించి ప్రభుత్వానికి పంపారు. ఫణిగిరికొండపై రూ. 72 లక్షలతో అతిథి గృహం, ఫణిగిరి గ్రామం నుంచి కొండ వరకు రూ. 44 లక్షలతో సిసి రోడ్డు నిర్మాణం, కొండపైకి రూ. 57లక్షలతో మెట్ల ఏర్పాటుకు సంకల్పించి రెండు సంవత్సరాలైనా ఏ ఒక్క పని ముందుకు జరగలేదు. జగిత్యాల జిల్లా వెల్గటూరు మండలంలో కోటిలింగాల గ్రామం ఉంది. ఈ కోటిలింగాల చారిత్రక బౌద్ధక్షేత్రం చరిత్రకారులు దీనిని శాతవాహనుల తొలి రాజధానిగా భావిస్తున్నారు. ఇక్కడి పురాతన కోటలో శివ లింగం ఉండటం వల్ల కోటి లింగంగా పిలువబడే ఈ గ్రామం రానురాను కోటి లింగాలగా మారిపోయింది. ఇక్కడ 110 ఎకరాల విస్తీర్ణంలో దీర్ఘచతురస్రాకారంలో పెద్ద కోట ఉండేది. ఎత్తైన గోడలతో నాలుగు మూలల బురుజులుండేవి. ఈశాన్య మూలన ఉన్న కోట బురుజు శిథిలమై ఎత్తైన గడ్డగా మారింది. తర్వాత కాలంలో గడ్డపై గుడి నిర్మించి లింగాన్ని ప్రతిష్టించారు. ఇందులోని దేవుడు కోటేశ్వర్వస్వామిగా పిలువబడుతున్నాడు. రాష్ట్ర పురావస్తుశాఖ ఇక్కడ 1979 నుంచి 1984 వరకు మొదటి దఫా, 2009లో రెండవ దఫా తవ్వకాలు జరిపారు. మొదటి తవ్వకాల్లో ప్రాచీన నగరం బయటపడింది. నాలుగు వైపులా మహాబురుజులు, వాటిని అనుసంధానిస్తూ మహాప్రాకారంతో కూడిన కోటిలింగాల నగరం బయటపడింది.





తెలుగువారి చరిత్రకు ఆద్యులుగా పేర్కొనే శాతవాహనుల తొలి రాజధాని ఇదేనని చారిత్రకారులు చెబుతున్నారు. దేశంలోనే మూడవ వంతు ప్రాంతాన్ని మూడు శతాబ్దాలపాటు ఏలిన ఘన చరిత్ర వారిది. తవ్వకాలలో లభించిన ఆధారాలను బట్టి కోటిలింగాలలో లభించిన శ్రీముఖుని నాణేలు, వారి రాజధాని కోటిలింగాల అని నిరూపించిన్నట్లు ప్రముఖ చరిత్రకారుడు రాజారెడ్డి పేర్కొన్నారు. ఇంతటి ఘనచరిత్ర కలిగిన కోటిలింగాలపై హెరిటేజ్ డైరెక్టర్ విశాలాక్షి దృష్టి సారించారు. ఆ ప్రాంతంలో భూములను సేకరించి తవ్వకాల ప్రతిపాదనను తెరపైకి తెచ్చారు. కానీ, తవ్వకాలు జరగకుండానే నిలిచిపోయాయి. గోదావరి పుష్కరాల సమయంలో జిల్లా అధికారులు చారిత్రక ఆనవాళ్లు ఉన్న ఈ ప్రాంతంలో పుణ్య స్నానాలు చేసేందుకు వచ్చే భక్తుల వాహనాల కోసం పార్కింగ్ స్థలంగా వినియోగించారు. ఆ స్థలంలో పెద్ద సంఖ్యలో ట్రాక్టర్లతో మొరం, మట్టి పోయించి రోడ్డు రోలర్లతో చదును చేయించారు. దీంతో గత తవ్వకాల్లో బయటపడిన చారిత్రక ఆనవాళ్లు మట్టిలో కలిసిపోయాయి. ఈ విషయాన్ని అధికారులు గుర్తించలేదు. ఇటీవల దీనిపై ఫిర్యాదులు రావడంతో వెళ్లి పరిశీలించిన అధికారులు అవాక్కయ్యారు. కాగా, ఎల్లంపల్లి ప్రాజెక్టుతో ఈ ప్రాంతంలో సాగు పెరిగింది. కోటి లింగాల లోనూ 30 ఎకరాల మేర వ్యవసాయం చేస్తున్నారు. దీంతో భూగర్భంలోని నిర్మాణాలు దెబ్బతినే అవకాశం ఉందని చెబుతున్నారు. పెద్దపల్లి జిల్లా జూలపల్లి మండలం తేలుకుంట గ్రామ సమీపంలోని పాటిగడ్డ ప్రాంతంలో గత డిసెంబర్ మాసంలో జరిపిన తవ్వకాల్లో క్రీస్తు పూర్వం మొదటి దశాబ్దపు నాటి ఇనుమును కరిగించి పోత పోసే కర్మాగారం అవశేషాలను, రాతి పనిముట్లు, పాత్రలను గుర్తించారు. ఈ ప్రాంతంలో కాల్చిన ఇనుము పెద్ద ముద్దలు లభించాయి. దీని బట్టి రెండు వేల ఏళ్ల క్రితమే ఇక్కడ ఇనుమును కరిగించే కర్మాగారం ఉన్నట్లు గుర్తించారు. రామప్ప చెరువు నుంచి ఆరంభమయ్యే ఉస్సేనిమియా వాగు పరీవాహక ప్రాంతంలో రాతి పనిముట్లు వాటిని నూరుకోవడం కోసం ఏర్పరచిన పరుపుబండలను గుర్తించారు. పెద్దపల్లి జిల్లా పెద్దబొంకూర్ గ్రామంలో గత ప్రభుత్వం 1964 నుంచి 1970 వరకు జరిపిన తవ్వకాల్లో గృహ నిర్మాణ అవశేషాలు, పురాతన బావులు, దంతపు గాజులు, రాగినాణాలు బయలుపడ్డాయి. వీటిని పరిశీలించిన అధికారులు శాతవాహనుల కాలం నాటివిగా గుర్తించారు. ఫారెస్టు, రెవెన్యూ అధికారులతో సర్వే జరిపించి తవ్వకాలు జరిపారు.

సుమారు 67 ఎకరాలు పురావస్తుశాఖ తన ఆధీనంలోకి తీసుకున్న అనంతరం తవ్వకాలు నిలిచిపోయాయి. దీంతో కొందరు నిధులు దొరుకుతాయన్న ఆశతో ఆ ప్రాంతంలో తవ్వకాలు జరపడం మొదలుపెట్టగా గ్రామస్థులు అధికారులకు ఫిర్యాదు చేశారు. తిరిగి 2017 ప్రాంతంలో బొంకూర్‌లో పర్యటించిన హెరిటేజ్ అధికారులు 67 ఎకరాల చుట్టు ఫెన్సింగ్ ఏర్పాటు చేసి కాపాలాదారులను నియమించారు. దీంతో ఆ ప్రాంతానికి పూర్తి రక్షణ ఏర్పడింది. ఇదే పద్ధతిని చారిత్రక అవశేషాలు లభించిన ప్రాంతాల్లో కూడా పాటిస్తే శతాబ్దాల చారిత్రక అవశేషాలను భద్రపరిచి భవిష్యత్తు తరాలకు గత చరిత్రను తెలియజేసే అవకాశం లభిస్తుంది.

*** శ్యామల**

సకుటుంబం



ఆపేస్తే కుంగుబాటు తప్పదు!

ఆరోగ్యంగా ఉండాలంటే వ్యాయామం తప్పనిసరి. అయితే, వ్యాయామాన్ని మధ్యలో ఆపేస్తే కుంగుబాటుకు గురయ్యే ప్రమాదం ఉందని ఒక పరిశోధనలో వెల్లడైంది. ఆస్ట్రేలియాలోని యూనివర్శిటీ ఆఫ్ అడిలైడ్' పరిశోధకులు ఈ విషయాన్ని వెల్లడించారు.కుంగుబాటుకు దూరంగా ఉండాలంటే వారంలో కనీసం 150 నిమిషాలైనా వ్యాయామం చేయాలని సూచిస్తున్నారు.

ఈ మధ్య ఆరోగ్యంపై చాలా మందికి అవగాహన పెరిగింది. అందుకోసం ప్రతీరోజూ గంటల తరబడి వ్యాయామం చేసేవాళ్లు ఉంటారు. కొంచెం బరువు పెరిగినట్టు అనిపించగానే విపరీతంగా వర్కవుట్‌లు చేస్తుంటారు. కాకపోతే మొదలెట్టినప్పుడు ఉన్నంత శ్రద్ధ చివరి వరకు ఉండదు. మధ్యలో హఠాత్తుగా మానేస్తుంటారు. ఇలా చేయటం మంచిది కాదు అంటున్నారు నిపుణులు. వారంలో కనీసం నాలుగురోజులైనా శరీరానికి వ్యాయామం అవసరమంటున్నారు.

వ్యాయామం చేస్తూ మధ్యలో ఆపేయటం వల్ల కీళ్లు పట్లేసి శరీరం అంతగా సహకరించదని నిపుణులు చెబుతున్నారు. చేస్తూ చేస్తూ మధ్యలో వ్యాయామం మానేస్తే కండరాల కదలిక తగ్గిపోతుందని అంటున్నారు. అంతేకాకుండా కొవ్వు శాతం శరీరంలో పెరుగుతుందని హెచ్చరిస్తున్నారు. ఫలితంగా మధుమేహం, గుండెజబ్బు లాంటివి వస్తాయని తెలియజేస్తున్నారు.

వ్యాయామం చేయడానికి ముందు కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి.

* ఎక్సర్‌సైజుకు ముందు వామప్స్ చేయాలి.
* మళ్లీ కొత్తగా వ్యాయామం మొదలుపెట్టినట్లుగా భావించాలి. రెండు వారాల వరకు సులభంగా ఉండే వ్యాయామాల్నే చేయాలి.
* మొదటి రోజే గంటలతరబడి కాకుండా ఒక పావుగంట చేస్తే సరిపోతుంది. క్రమంగా సమయం పెంచుకుంటూ పోవాలి.
* అలా కాకుండా అతిగా వ్యాయామం చేస్తే నీరసం వస్తుంది.
* వారంలో ఐదురోజులు వ్యాయామం చేయాలి.
* వాకింగ్, సైక్లింగ్ లాంటివి చేసిన తరువాత చివరగా ప్రాణాయామంతో ఉపశమనం పొందాలి.
* చాలా మంది జిమ్‌కు వెళ్తేనే ఎక్సర్‌సైజ్ చేసినట్టు అనుకుంటారు. ఇంట్లో కూడా వ్యాయామం చేసుకోవడం అలవాటు చేసుకోవాలి.
* రోజూ ఉదయాన్నే నిద్ర లేవలేకపోవడం వల్ల వ్యాయామం చేయలేకపోతున్నామని నిరుత్సాహపడుతుంటారు. కానీ రోజులో ఎప్పుడైనా సరే వ్యాయామం చెయ్యొచ్చు అని చెబుతున్నారు నిపుణులు.
* యోగా వల్ల కూడా శరీర బరువును అదుపులో ఉంచుకోవచ్చు.
* కంప్యూటర్ ముందు పని చేసే చోట గంటకోసారి లేచి నాలుగు అడుగులు వేయాలి. లిఫ్ట్‌కు బదులు మెట్లు ఎక్కాలి. జంక్ ఫుడ్ మానేయాలి. ఇలా రోజుకు కనీసం ఐదువేల అడుగులు వేస్తుంటే ఆరోగ్యం సొంతమవుతుందని నిపుణులు చెబుతున్నారు.

పొడుగ్గా కనిపించాలంటే..

చాలా మంది పొట్టిగా ఉన్నామనే ఆత్మన్యూనతా భావంతో బాధపడుతుంటారు. అలాంటి వాళ్లు కాస్త పొడుగ్గా కనిపించాలంటే కొన్ని చిట్కాలు చెబుతున్నారు ఫ్యాషన్ డిజైనర్లు. కొన్ని రకాల దుస్తులను ధరించడం వల్ల పొడుగ్గా కనిపించవచ్చంటున్నారు. ఎత్తు తక్కువగా ఉన్నవారు పొడుగ్గా కనిపించాలనుకోవడం తప్పేమి కాదు. అందుకు హైహీల్స్ ధరిస్తే సరిపోదు. దుస్తుల ఎంపిక కూడా ప్రత్యేకంగా ఉండాలి. అప్పుడే కొంతైనా మార్పు తీసుకురావొచ్చు.

*గీతలున్న దుస్తులను ధరించడం వల్ల కాస్త పొడుగ్గా కనిపిస్తారు.

*టాప్ డిజైన్‌లోని అల్లికలు కూడా నిలువుగా ఉంటే బావుంటుందని గమనించాలి.

*చిన్న పువ్వులు, ప్రింట్లు, తక్కువ అల్లికలు ఉన్న వస్త్రాలు మిమ్మల్ని మరింత ఎత్తుగా కనిపించేలా చేస్తాయి. ఇలాంటి డిజైన్లు, ఒకే రంగుల్లో ఉండేలా చూసుకుంటే సరిపోతుంది.





*చీరలు ధరిస్తున్నప్పుడు పెద్ద పెద్ద అంచులున్నవి ఎంచుకోకూడదు. సన్న ప్రింట్లున్నవి, తక్కువ అంచున్న రకాలను ఎంచుకుంటే చూడముచ్చటగా ఉంటాయి.

*జీన్స్ లాంటివి కొంటున్నప్పుడు, ఏవో ఒకటి కాకుండా.. కప్డ్ రకాలను కొనడం మేలు. వీటివల్ల పొడుగ్గా కనిపిస్తారు. అప్పుడు హైహీల్స్ ధరిస్తే ఆ అందమే వేరు.

*రెండు రంగులతో కాంట్రాస్ట్ రకాలను ఎంచుకోవడం పొరబాటు. దానివల్ల వాటి మధ్యనున్న తేడా అడ్డంగా ఓ గీతలా కనబడుతుంది. ఇది మరింత చిన్నగా కనిపించేలా చేస్తుంది. కాబట్టి మీరు ధరించే డ్రెస్ రెండింటినీ ఈ తరహాల్లో ఎంచుకోకపోవడమే మంచిది.

ఇది వ్యసనం కాదు అవసరం

ఫేస్‌బుక్‌లో ప్రతి 60 సెకండ్లకి, 5,10,000 వ్యక్తుల 136 000 ఫొటోలు అప్‌లోడ్ అవుతున్నాయని ఒక అధ్యయనం చెబుతోంది. ఫేస్‌బుక్ వినియోగదారుల్లో 76 శాతం స్త్రీలు, 66 శాతం పురుషులున్నారు. ఇది 2019 జనవరిలో ఫేస్‌బుక్ లెక్కల సర్వే.

సోషల్ మీడియా ఏ స్థాయిలో దూసుకుపోతుందో ఈ లెక్కల్ని బట్టితెలుస్తోంది. అన్న ప్రాశనలు, అక్షరా భ్యాసాలు,పెళ్లి రోజులు, పుట్టినరోజులు, గృహప్రవేశాలు ఏదైనా సరే ఫేస్‌బుక్‌లోకి వెళ్లాల్సిందే. వచ్చిపడుతున్న క్లిక్కులు, మెసేజ్‌లు చూసుకునే ఆనందిం చడాలే ఎక్కువయ్యాయి. ఇక్కడ అందరూ ఫొటోగ్రాఫర్లే. భారతదేశంలోనే మొబైల్ ఫోన్ల వినియోగదారుల సంఖ్య 730.7 మిలియన్లుగా నమోదైంది. ప్రతి నిత్యం తీసుకునే సెల్ఫీలు, ఫొటోలు ఒక కొత్త ప్రపంచాన్ని ప్రతి వాళ్లకు సృష్టించి ఇచ్చాయి. పెద్ద నైపుణ్యం లేకపోయినా కళాత్మకత ఉట్టి పడకపోయినా, అనుభూతి చెందితే చాలు దాన్ని తాజాగా ఆత్మీయులకు చేరవేసేయచ్చు.



ఉదయాన్నే వాకిట్లో విరబూసిన మందారాన్నో అప్‌లోడ్ చేసి శుభాకాంక్షలతో మొదలు పెట్టటం అలవాటైపోయింది. వెంటనే పలకరింపులు మొదలవుతాయి. ఎంతో బావుంది, ఇక్కడ సేమ్ టు సేమ్, ఆసమ్, అమేజింగ్ అంటూ కామెంట్లు పడిపోయి ఉంటే ఉదయాలు అద్భుతమై పోతున్నాయి.

ఇప్పుడున్నవి ఉమ్మడి కుటుంబాలు కావు. భార్య భర్త పిల్లలు నగరంలో విపరీతమైన పని ఒత్తిడిలో ఎప్పుడూ తొందరే. పండక్కో, పబ్బానికో కూడా బంధుమిత్రులను కలిసే వీలు లేదు. మరి ఆ ఒంటరితనం ఎలా పోవాలి. ఒక్క సెల్ఫీ ట్విట్టర్‌తోనో, ఇన్‌స్టాగ్రామ్‌లోనో పోస్ట్ చేయటం, నిమిషంలో వచ్చి పడే స్పందనతో హుషారు నిండుతోంది మనసులో. ఈ సెల్ఫీ 1839 లో మొదటి సారి రాబర్ట్ కార్నెలియస్ అనే ఫొటోగ్రఫీ నిష్ణాతుడు తీసుకొన్నట్లుగా రికార్డులు చెబుతున్నాయి. 1914లో పరమూడేళ్ల రష్యన్ యువతి తొలిసారిగా సెల్ఫీ తీసుకొని స్నేహితులకు పంపిందిట. ఈమె సెల్ఫీని అద్దంలోను తీసింది. ఆస్ట్రేలియాకు చెందిన కార్ల్ క్రూజెన్ని, మొదటి సారిగా సెల్ఫీ అన్న పదం ఉపయోగించారట. ప్రముఖ మొబైల్ కంపెనీ సోనీ ఎరిక్సన్ 2003 సంవత్సరంలో ఫ్రంట్ కెమెరాతో ఉన్న సోనీజెడ్ 1010అనే మోడల్‌తో సెల్ఫీ కెమెరాని తొలిసారిగా మార్కెట్‌లోకి ప్రవేశపెట్టింది. ఇక ప్రముఖ మొబైల్ కంపెనీలన్నీ సరికొత్త ఫీచర్స్‌తో ఎన్నో ఫోన్‌లు విడుదల చేస్తూనే ఉన్నారు.

ఫేస్‌బుక్ సంస్థ ఇన్‌స్టాగ్రామ్‌ను బిలియన్ డాలర్లతో అంటే భారతీయ కరెన్సీ 5200 కోట్లతో కోనేశాక, సెల్‌ఫోన్ ఫొటో గ్రాఫర్లు మరింత చెలరేగిపోయారు. నెమ్మదిగా ప్రతి అంశం, చుట్టూ జరిగే అన్యాయాలు, సంఘటనలో చేతిలో కెమెరా ఉంటే చాలు అప్‌లోడ్ చేస్తున్నాడు. బ్రేకింగ్‌న్యూస్ ఇవ్వటానికి అనుభవం ఉన్న జర్నలిస్ట్ దిగిరానక్కర్లేదు. కొన్నేళ్లుగా ప్రపంచవ్యాప్తంగా ఎన్నో ప్రజా ఉద్యమాలు జరగాయి. వాటికి సంబంధించిన కవరేజ్‌లో సాధారణ ప్రజలే ముందున్నారు. ఎక్కడ ఏం జరిగిన క్షణాల్లో పాకిపోతుంది. ప్రకృతి వైపరీత్యాలు వరదలూ, వానలూ, సెల్‌ఫోన్ లోంచి సోషల్ మీడియాలో జారి ప్రజల్లోకి నిమిషాల్లో చేరిపోతున్నాయి.

ఇక్కడ అద్భుతమైన ఫొటో అంటే కాకాలు తీరిన ఫొటోగ్రాఫర్లు అత్యంతనైపుణ్యంతో క్లిక్ మనిపించిన ఫొటోకాదు. ఆ నిమిషంలో, ఎక్కువ మంది చేరేది మాత్రమే. ఎంత త్వరగా ఎంత మంది చూశారు అనేది ముఖ్యం. ఇది ఇప్పుడు శాంతి భద్రతల పరిరక్షణతో భాగం అయిపోయింది. కళ్ళ ముందు జరిగిన ఏ అన్యాయమైనా పోలీసులకు ఫిర్యాదు చేయకుండానే చేరుతోంది. ఫేస్‌బుక్ ఇచ్చిన వెసులుబాటు ఇది. సామాన్యుల కళ్లు కూడా సమాజాన్ని ఎలా చూడాలో నేర్చుకొంటున్నాయి. లైన్స్ లోంచి కాదు లెన్స్ లేకుండా, ఏ మాత్రం అనుభవం లేకుండా, కెమెరా ఫీచర్స్ లేకుండా, కేవలం ఒక్క సెల్ఫీ లాగానో, ఒక్క చిన్ని వీడియో ద్వారానో, సోషల్ మీడియాలోంచి జనం మధ్యకి క్షణాల్లో చేరుతోంది. ఒక్క వృద్ధురాలిని కన్న పిల్లల చూడటం లేదు, పక్కింట్లోంచి ఒక వీడియో వెళ్లిపోతుంది. ఒక పాప ఉపాధ్యాయుడి చేతిలో లైంగిక వేధింపుకు గురవుతోంది. ఒక్క చిన్న పిల్లాడిని కొట్టి దండిస్తున్నారు . ఒక హాస్టల్‌లో భోజనం పురుగులతో నిండి ఉంది' బోర్‌లో నీళ్లు రావు. ఓట్లు వేయించుకొన్న ప్రజా నాయకుడు, రోడ్ల దుస్థితి చూడడు. ఒక్కటేమిటి కళ్లముందు కదిలే ప్రతి క్షణాన్ని, ప్రతి అన్యాయాన్ని ఎలా ప్రశ్నించాలో నేర్చుకొన్నారు ప్రజలు. సోషల్ మీడియాలో నిత్యం కనిపిస్తున్నారు. ఫేస్‌బుక్ ఇచ్చిన ఒక అపూర్వమైన అవకాశం ఇది. అదే సమయంలో కొన్ని నష్టాలు లేక పోలేదు. సాంకేతిక పరిజ్ఞానం దుర్వినియోగం చేసిన అనేక దుష్ఫరిమాణాలు వస్తూనే ఉంటాయి. సెల్ఫీలు దిగుతూ ప్రమాదాల బారిన పడుతున్న కథలు వింటూనే ఉన్నాం.

18 సంవత్సరాల ఒక యువకుడు రోజుకు 200 సెల్ఫీలు తీసుకొనే వాడట. దీనితో అనారోగ్యానికి గురయ్యాడు. నిరంతరం సెల్‌ఫోన్‌తో ఛాటింగ్స్ చేస్తూ, సోషల్ మీడియాలోనే కాలం గడుపుతూ కుటుంబాలను కూడా నిర్లక్ష్యం చేసుకుంటున్న కథలు ఎన్నో ఉన్నాయి.

అతి ఏదైనా అనర్థమే. ఒక లాభం పక్కనే పరుగెత్తుతూ నష్టం వస్తోంది. టెక్నాలజీని ఎలా వాడుకోవాలో తెలుసుకొని దాన్ని ఆరోగ్యభరితంగా ఉపయోగించుకోవాలి. చేతికి చిక్కిన ఆయుధం లాంటి ఈ సోషల్ మీడియాను ఎలా వాడుకుంటే లాభమో యువత ఆలోచించాలి. ప్రతి వేకువనీ ఆనందంతో ఆహ్వానించాలి. అనుభవంలోకి దొరుకుతున్న ప్రతి నిమిషాన్ని శ్రద్ధగా జాగ్రత్తగా వాడుకోవాలి.

నవ్వండి కాసేపు...



రానున్న రోజుల్లో వైద్యులు ప్రిస్క్రిప్షన్ రాయవలసి వస్తే 15 నిమిషాల పాటు నవ్వండి సరిపోతుంది అనిఅన్నా ఆశ్చర్యపోనక్కర్లేదు. నవ్వుల వ్యాయామం రక్త సరఫరాను మెరుగుపరుస్తుందని పరిశోధకులు గుర్తించారు. ఏరోబిక్ వ్యాయామం వల్ల పొందే ఫలితం నవ్వు ఇస్తుందట.

గుండె పై ఎలాంటి ఒత్తిడి పడకుండా చేస్తుంది. నవ్వు నైట్రిక్ ఆక్సైడ్ విడుదలని ఉత్తేజపరుస్తుంది. ఇది రక్త కణాలను రిలాక్స్ చేస్తుంది. అలాగే కాసేపు నవ్వితే ఆ నవ్వు రక్త నాళాలని మరమ్మతు చేసే ఎండార్ఫిన్ లను విడుదల చేస్తుంది. రోజుకు 15 నిమిషాలు హాయిగా నవ్వండి. ఇది గుండెని పదిలంగా కాపాడుతోందని అధ్యయనాలు చెబుతున్నాయి.

ట్రిమ్ చేస్తే పెరగవు..



శిరోజాలను ఎప్పటికప్పుడు ట్రిమ్ చేస్తుంటే బాగా పెరుగుతాయనుకోవటం కేవలం అపోహే అంటున్నారు నిపుణులు. జుట్టు కుదుళ్ళ దగ్గర నుంచి పెరుగుతోంది కానీ కొసన నుంచి కాదు. కాబట్టి జుట్టు కట్ చేసినా చేయక పోయినా వెంట్రుకల ఎదుగుదలపై ఎలాంటి ప్రభావం ఉండదు. కాకపోతే చిట్లిపోయిన కొసల్ని కట్ చేయటం వల్ల నీట్ గా కనిపిస్తుంది. తాజా రూపం కోసం ఎక్కువ వ్యాల్యూమ్ కోసం జుట్టు కట్ చేసుకోవాలి. ఇక పోతే షాంపూలనూ పూర్తిగా శిరోజాలకు పట్టించాలి అనుకొంటారు. కానీ షాంపూ ప్రయోజనం క్లెన్సింగ్. దాన్ని మాడుపైన అప్లెయ్ చేసి దాన్నే స్ప్రెడ్ చేస్తూ తలంతా రుద్దేయొచ్చు. కండిషనర్‌ను మాత్రం కొసలదాకా రాయాలి. అప్పుడే జుట్టు మెత్తగా ఉండి కొసలు చిట్లిపోకుండా ఉంటాయి.

ఫ్రిజ్‌లో చెడువాసన పోవాలంటే..?

పండగలు, వేడుకలే కాదు, మామూలు రోజుల్లోనూ వంటకాలు మిగిలిపోవడం దాదాపు అందరి ఇళ్లలో జరుగుతూంటుంది. మిగిలిపోయిన వంటలతో పాటు కూరగాయలు, ఫ్రోజన్ ఫుడ్‌తో ఫ్రిజ్ నింపేస్తూంటాం. కొన్నింటిని చాలా రోజులు పట్టించుకోకుండా వదిలేస్తాం. దీంతో ఫ్రిజ్ తలుపు తెరవగానే చెడువాసన వస్తుంది. కొన్ని జాగ్రత్తలతో ఈ సమస్యలను దూరం చేయవచ్చు. అవేంటో తెలుసుకుందాం...

ఫ్రిజ్ శుభ్రంగా ఐస్ పేరుకుపోకుండా ఉండాలి. డిఫ్రాస్ట్ చేసేటప్పుడు ఫ్రిజ్‌ని ఖాళీ చేస్తే మంచిది.

* అన్నిటికన్నా ముఖ్యంగా గుర్తుంచుకోవాల్సింది... ఫ్రిజ్ డంపింగ్ యార్డ్ కాదని. ఫ్రిజ్‌లో కంటెయినర్లను, పదార్థాల్ని జాగ్రత్తగా సర్దుకోండి.
* రకరకాల ఆహార పదార్థాల వాసనలకు ఫ్రిజ్ లోపల ఉష్ణోగ్రతలు తగ్గిపోవడం వల్ల తయారయ్యే రసాయనాల దుర్వాసన తోడైతే ఇక చెప్పక్కర్లేదు. కాబట్టి వండిన పదార్థాలు, పాలు, పెరుగు గిన్నెల మీద మూతలు తప్పనిసరిగా పెట్టండి. పండ్లు, కాయగూరల్లాంటి వాటిని కవర్లలో ఉంచండి.
* బేకింగ్ సోడాని చిక్కటి ముద్ద చేసి, ఫ్రిజ్‌లోని అన్ని అరల్లో, మూలల్లో రాయండి. తరువాత నీటితో కడగండి. దీనివల్ల అహారం మరకలే కాదు, చెడువాసన కూడా ఉండదు.
* బేకింగ్ సోడాని మూత తెరిచి ఉన్న కంటెయినర్‌లో పోసి, ఫ్రిజ్ లోపల పెట్టండి. కనీసం 24 గంటలు అలా ఉంచితే, చెడువాసనల్ని అది పీల్చుకుంటుంది.
* ఒకవేళ, బేకింగ్ సోడా వల్ల ఫలితం కనిపించకపోతే, తాజాగా గ్రైండ్ చేసిన కాఫీ పొడిని ఒక ప్లేట్‌లో వేసి 24 గంటలసేపు ఫ్రిజ్‌లో ఉంచండి. వాసనల్ని కాఫీ సమర్థవంతంగా పీల్చుకుంటుంది.
* ఫ్రిజ్ తాజా సువాసనలు వెదజల్లాలంటే, వెనిల్లా ద్రవంలో నాన బెట్టిన దూదిని లోపల ఉంచితే సరి.



గర్భిణులకు మంచిది..



గర్భవతులు లేదా ప్రెగ్నెన్సీ ప్లాన్ చేసుకుంటున్న వాళ్ళు ఫోలిక్ యాసిడ్ పుష్కలంగా ఉన్న బొబ్బర్లు తినమంటున్నారు డాక్టర్లు. దాని వల్ల పుట్టబోయే బిడ్డలు న్యూరల్ ట్యూబ్ రిఫ్లెక్ట్ కాకుండా నివారించవచ్చు. ఇవి తరచు తింటే మంచిది. విటమిన్ బి ,విటమిన్ డి కూడా ఉండటం వల్ల రోగ నిరోధక శక్తి కూడ పెరుగుతుంది. ఎన్నో వ్యాధులు రాకుండా ఇవి కాపాడతాయి. బొబ్బర్లులో పిండి పదార్థాలు చాలా ఎక్కువ అయినప్పటికి తిన్న తరువాత జీర్ణం అయి వంటికి పట్టేటప్పుడు ఈ చక్కరలు వెచ్చగా రక్తంలోకి ఎక్కుతాయి. డయాబెటిక్ రోగులకు చాలా మేలు చేస్తాయి. వాటిలో పొటాషియం పాలు చాలా ఎక్కువ. రక్తపోటు నివారణ నియంత్రణలో ఉంచేందుకు బొబ్బర్లు ఆహారంలో భాగంగా చేసుకోవడం మంచిది.

జిల్లాల పర్యటనలకు కెటిఆర్?

టిఆర్‌ఎస్ సభ్యత్వానికి రాష్ట్రవ్యాప్తంగా పెరిగిన డిమాండ్

మనతెలంగాణ/హైదరాబాద్ : సుస్థిర రాజకీయవ్యవస్థగా ఆవిర్భవించిన టిఆర్‌ఎస్ పార్టీ భవిష్యత్ ఎన్నికల రంగంపై పూర్తి స్థాయి దృష్టి సారించింది. శాసన సభ ఎన్నికల్లో కాంగ్రెస్, బిజెపిలను మట్టికరిపించిన టిఆర్ ఎస్ తిరిగి పార్లమెంట్ ఎన్నికల్లో సంపూర్ణవిజయం సాధించేందుకు సిద్ధమైంది. ఫిబ్రవరిలో టిఆర్‌ఎస్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించి సుమారు 80 లక్షల మంది సభ్యులను చేర్చుకునే దిశలో రాజకీయ వ్యూహాలకు పదును పెడుతుంది. ఉద్యమపార్టీగా అవతరించి రెండవసారి అధికారం చేపట్టడంతో టిఆర్‌ఎస్ సభ్యత్వానికి రాష్ట్రవ్యాప్తంగా డిమాండ్ ఏర్పడిన నేపథ్యంలో పటిష్టంగా సభ్యత్వ నమోదు చేపట్టేందుకు కార్యాచరణ ప్రణాళికలను రూపొందిస్తుంది. గ్రామపంచాయితీ ఎన్నికల్లో గెలిచిన వారితో పాటు ఓడిపోయిన వారుకూడా టిఆర్‌ఎస్ సభ్యులు, అభిమానులు ఉన్నారు. పార్టీ గుర్తులతో సంబంధంలేకుండా దా జరిగే పంచాయితీ ఎన్నికల్లో టిఆర్‌ఎస్ సభ్యులు, అభిమానులు ఒకే స్థానానికి పోటీచేసిన సందర్భాలు అనేకం ఉన్నాయి. పోటీ చేసినవారందరినీ ఒకే గొడుగు కిందకు తీసుకువచ్చి గ్రామాల్లో పార్టీభేదాలు లేకుండా సంఘటిత శక్తిగా మలిచే ఆలోచనలో టిఆర్‌ఎస్ ఉంది. ఈనేపథ్యంలో ఫిబ్రవరిలో ఎట్టిపరిస్థితుల్లోనైనా సభ్యత్వ నమోదు ప్రారంభించి నాయకుల పర్యటనలను ఖరారు చేయాలని టిఆర్‌ఎస్ అధిష్ఠానం యోచిస్తుంది.

జిల్లాపర్యటనలకు సిద్ధమవుతున్న టిఆర్‌ఎస్ అధిష్ఠానం

టిఆర్‌ఎస్ సభ్యత్వ నమోదును ప్రారంభించి జిల్లాపర్యటనలు చేపట్టే ఆలోచనలో టిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ ఉన్నట్లు నాయకులు చెపుతున్నారు. వర్కింగ్ ప్రెసిడెంట్ హోదాలో కెటిఆర్ జిల్లా పర్యటనల్లో పాల్గొంటే పార్టీ శ్రేణుల్లో మరింత ఉత్సాహం వస్తుందని నాయకులు భావిస్తున్నారు. ఇంతే పార్లమెంట్ ఎన్నికలు కూడా పొంచి ఉన్న నేపథ్యంలో సభ్యత్వ నమోదు తేదీలను ఖరారు చేసి పర్యటనలు ప్రారంభించే అవకాశాలు అధికంగా ఉన్నాయి. మార్చిలోగా సభ్యత్వం, జిల్లా పర్యటనలు పూర్తి చేసి పార్లమెంట్ ఎన్నికలకు సిద్ధంకావాలని పార్టీ యోచిస్తుంది. ఈ నేపథ్యంలో త్వరలో ముఖ్యనేతల సమావేశం నిర్వహించి సభ్యత్వం. నాయకుల పర్యటనల తేదీలను ప్రకటించే అవకాశాలు అత్యధికంగా ఉన్నాయి. పార్లమెంట్ ఎన్నికలున్న నేపథ్యంలో జిల్లాల పర్యటనలకు, సభ్యత్వ నమోదుకు అత్యంత ప్రాధాన్యత ఏర్పడుతుందని, టిఆర్‌ఎస్ సభ్యత్వం లక్ష్యాన్ని మించి నమోదు అయ్యే అవకాశాలు ఉన్నాయని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి.


యజమానిని మోసంచేసి చోరీ

కోటి రూపాయల సొత్తు స్వాధీనం, సేల్స్ ఎగ్జిక్యూటివ్ అరెస్టు



మన తెలంగాణ/సిటీబ్యూరో : నకిలీ బిల్లులు పెట్టి బంగారు ఆభరణాలు, వజ్రాలను చోరీ చేసిన సేల్స్ ఎగ్జిక్యూటివ్‌ను బంజారాహిల్స్ పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. నిందితుడి వద్ద నుంచి 3కిలోల బంగారు ఆభరణాలు, 20క్యారెట్ల డైమండ్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న వాటి విలువ కోటి రూపాయలు ఉంటుంది. వెస్ట్‌జోన్ డిసిపి ఎఆర్ శ్రీనివాస్ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. కామారెడ్డికి చెందిన గోసావత్ వివేక్ నగరంలోని రేయిన్ జ్యువెల్లర్స్‌లో సేల్స్ ఎగ్జిక్యూటివ్‌గా పనిచేస్తూ మలక్‌పేటలో ఉంటున్నాడు. గత నెల 26న జువెల్లర్స్ యజమాని అనూప్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు విచారణ చేశారు. బంజారాహిల్స్, రోడ్ నంబర్12లోని రేయిన్ జువెల్లర్స్‌లో వివేక్ సేల్స్ ఎగ్జిక్యూటివ్‌గా పనిచేస్తున్నాడు. యజమాని నమ్మి బాధ్యతలు అప్పగించడంతో మోసం చేసి 4కిలోల విలువైన బంగారు, వజ్రాలు దొంగిలించాడు. నకిలీ బిల్లులు సృష్టించి వివిధ షాపులకు ఉద్దెరకు సరఫరా చేసినట్లు చూపాడు. కిలో బంగారు ఆభరణాలను మనప్పురం ఫైనాన్స్‌లో పెట్టి గతంలో మోసం చేసి తీసుకున్న రూ.16లక్షలు అప్పును తీర్చాడు. మిగతా డబ్బులు జల్సాలు చేశాడు. 130క్యారెట్ల వజ్రాలను తండ్రికి, కిలో బంగారు ఆభరణాలను విజయవాడలోని సోదరుడికి ఇచ్చాడు. నిందితుడిపై నగరంలోని అబిడ్స్, జూబ్లీహిల్స్, నారాయణగూడ పోలీస్‌స్టేషన్లలో కేసులు నమోదయ్యాయి. బంజారాహిల్స్ ఎసిపి కెఎస్ రావు, ఇన్‌స్పెక్టర్ గోవింద్ రెడ్డి, డిఐ రవికుమార్, ఎస్సై శ్రీనివాస్, సిబ్బంది కేసు దర్యాప్తు చేశారు.

అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్టు



మన తెలంగాణ/హైదరాబాద్ సిటీబ్యూరో: తాళం వేసిన ఇళ్లలో పగటిపూట దొంగతనాలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర ముఠాను స్పెషల్ ఆపరేషన్ టీం, శంషాబాద్ పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి 500 గ్రాముల బంగారు ఆభరణాలు, 500 గ్రాముల వెండి ఆభరణాలు, కారు, ఐదు సెల్ ఫోన్లు, రూ.20,000 నగదు స్వాధీనం చేసుకున్నారు. సైబరాబాద్ పోలీస్ కమిషనర్ విసి సజ్జనార్ సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఉత్తరప్రదేశ్, హాపూర్ జిల్లాకు చెందిన ఎండి సబేదార్, షహనవాజ్, నదీం, ఎండి నయీ మ్, ఎండి రషీద్, ముస్తఫా, ఆసిఫ్, ఇమ్రాన్ ముఠాగా ఏర్పడి దొంగతనాలకు పాల్పడుతున్నారు. ఢిల్లీ, భోపాల్, గ్వాలియర్, చంద్రాపూర్, అమరావతి, జెరంపూర్, నాగపూర్, అలీపూర్, ఘజియాబాద్, భులంద్ షెహర్, విజయవాడ, హైదరాబాద్, సైబరాబాద్ ప్రాంతాల్లో పగటి పూట దొంగతనాలకు పాల్పడ్డారు.

సిసిటివిలు పట్టించాయి... సిసిటివి ఆధారంగా దొంగలను గుర్తించిన పోలీసులు ఆధారాలను సేకరించి పట్టుకునే ప్రయత్నం మొదలుపెట్టారు. శంషాబాద్ ఎస్‌ఓటి, రాజేంద్రనగర్ డిఐ అశోక్ టీం రెండు బృందాలు కలిసి వీరిని పట్టుకున్నాయి.

రాక

(మొదటిపేజీ తరువాయి)

తెల్లవారుజామున విమానంలో శంషాబాద్ విమానాశ్రయానిక సురక్షితంగా చేరుకున్నారు. నాలుగైదు రోజుల పాటు ఉత్కంఠకు గురైన తల్లిదండ్రులు విమానాశ్రయానికి వచ్చి వారిని ఇండ్లకు తీసుకుని వెళ్ళారు. అమెరికాలోని తెలుగు సంఘాల చొరవతో భారత రాయబార కార్యాలయం అధికారులు తీసుకున్న చర్యలతో వీరు క్షేమంగా హైదరాబాద్‌కు చేరుకున్నారు. మరికొంత మంది విద్యార్థులు మంగళవారం తెల్లవారుజామున చేరుకున్నారు. పోలీసులు తమను అరెస్టు చేసినప్పుడు తుపాకీతో కాలుస్తామన్నంతగా బెదిరించారని, వాస్తవాన్ని చెప్పడానికి కూడా తమకు ధైర్యం చాలలేదని ఒక విద్యార్థి శంషాబాద్ విమానాశ్రయ ఆవరణలో మీడియాకు వివరించారు. అదుపులోకి తీసుకున్న తమనందరినీ ఒక గదిలో నిర్బంధించారని, మైనస్ నాలుగు డిగ్రీల చలిలో సైతం ఫ్యాన్‌ను వేసి తీవ్రంగా ఇబ్బంది పెట్టారని, ఫ్యాన్‌ను ఆపాల్సిందిగా పదేపదే వేడుకున్నా కనికరించలేదని, పగవాడికి కూడా ఆ కష్టాలు రావద్దని మరో విద్యార్థి ఆ చేదు జ్ఞాపకాలను వివరించాడు. లక్షలాది రూపాయలు అప్పుచేసి ఉన్నత చదువులపై ఎన్నో ఆశలతో అమెరికాకు వెళ్ళి ఇప్పుడు మానసిక క్షోభకు గురయ్యామని, డబ్బు, సమయం వృథా అయిందని ఆవేదన వ్యక్తం చేశారు. భారత విదేశాంగ శాఖ అధికారులు, అమెరికాలోని పలు తెలుగు సంఘాల ప్రతినిధులు నాలుగైదు రోజుల పాటు ఆ దేశ అధికారులతో సంప్రదింపులు జరిపి విద్యార్థుల తప్పేమీ లేదని వివరించి క్షేమంగా విడుదలయ్యేలా చొరవ తీసుకున్నారు. కోర్టు వరకూ వెళ్ళిన ఈ కేసులో తెలుగు విద్యార్థుల తరఫునా, భారత విద్యార్థులందరి తరఫున వాదించడానికి ఇమ్మిగ్రేషన్ వ్యవహారాల్లో నిష్ణాతులైన లాయర్లను కూడా తెలుగు సంఘాల ప్రతినిధులు నియమించారు. నకిలీ విశ్వవిద్యాలయం కారణంగా రెండేళ్ళ కాలాన్ని కోల్పోయిన విద్యార్థులు వెంటనే భారత్‌కు తిరిగి రావాల్సిందిగా మన విదేశాంగ చేసిన విజ్ఞప్తులకు సానుకూలంగా స్పందించి ఒక్కొక్కరు స్వస్థలాలకు తిరుగు ప్రయాణమవుతున్నారు. వారికి జారీ అయిన ఎఫ్ వన్ వీసా గడువు ముగిసిపోయినందున వెంటనే స్వదేశానికి వచ్చేయాలని కోరింది. ఎట్టకేలకు తొలి విడతలో ముప్పై మంది విద్యార్థులు, ఆ తర్వాతి రోజున మంగళవారం తెల్లవారుజామున మరికొద్దిమంది విద్యార్థులు హైదరాబాద్ చేరుకున్నారు. మిగిలినవారు కూడా వచ్చేస్తారని ఈ విద్యార్థులు తెలిపారు.

వచ్చే ఏడాదిలో ధాన్యం కొనుగోలుకు కార్యాచరణ ప్రణాళిక

● పౌరసరఫరాలశాఖ పునరుత్తేజానికి అవసరమైన చర్యలు ● ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించిన కమిషనర్



మన తెలంగాణ / హైదరాబాద్ : ధాన్యం కొనుగోలుకు సంబంధించి కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని పౌరసరఫరాలశాఖ కమిషనర్ అకున్ సబర్వాల్ తెలిపారు. అమలుకు అనువుగా ఉండేలా ప్రణాళిక ఉండాలని సూచించారు. ఈ నేపథ్యంలో నిర్ణీత కాలంలో నిర్దేశిత లక్ష్యాలను సాధించాలంటే పౌరసరఫరాలశాఖను పునరుత్తేజం చేయాల్సిన అవసరముందన్నారు. దానికి అధికారులను పునశ్చరణ చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఇందుకోసం ప్రత్యేకంగా శిక్షణా తరగతులను కూడా నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఇందులో భాగంగానే సోమవారం మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థలో శిక్షణ తరగతులను నిర్వహించారు. కేంద్ర కార్యాలయంలో పనిచేసే అధికారులతో పాటు డిసిఎస్‌ఓ, ఎసిఎస్‌ఓ, జజిల్లా మేనేజర్లు, అసిస్టెంట్ మేనేజర్లు శిక్షణలో పాల్గొన్నారు. హాజరయ్యారు. వచ్చే ఏడాది ధాన్యం కొనుగోలుకు అవసరమైన కార్యాచరణతో పాటు పౌరసరఫరాలశాఖ మరింత పటిష్టంగా పని చేసేందుకు అధికారుల వ్యవహరించాల్సిన తీరుపై ఈ సందర్భంగా అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. శిక్షణ తరగతులను ప్రారంభించిన అనంతరం ఉద్యోగులనుద్దేశించి కమిషనర్ అకున్ సబర్వాల్ మాట్లాడుతూ రాష్ట్రంలో కొత్తగా చేపడుతున్న సాగునీటి ప్రాజెక్టులతో పాటు రైతుబంధు, రైతుభీమా, 24 గంటల కరెంటు వంటి రైతు సంక్షేమ చర్యలతో రాష్ట్రంలో సాగు విస్తీర్ణం భారీగా పెరుగుతుందన్నారు. దీనికనుగుణంగా ధాన్యం దిగుబడి కూడా విపరీతంగా వస్తుందన్నారు. వచ్చే రబీ, ఖరీఫ్ సీజన్లలో పౌరసరఫరాలశాఖ రైతుల నుంచి భారీగా ధాన్యం కొనుగోలు చేయాల్సిన అవసరముందన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని క్షేత్రస్థాయిలో చేపట్టాల్సిన చర్యలపై అధికారులు ఇప్పటి నుంచే దృష్టి సారించి అవసరమైన కార్యాచరణ ప్రణాళికలను రూపొందించుకోవాలని సూచించారు. గత ఏడాది ఖరీఫ్, రబీ సీజన్లలో 54 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని పౌరసరఫరాల సంస్థ కొనుగోలు చేయగా, ఈ ఏడాది ఒక ఖరీఫ్ లోనే 40 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసి రికార్డు సృష్టించిందని తెలిపారు. పెరుగుతున్న ధాన్యం దిగుబడికి అనుగుణంగా కొనుగోలుకు సంబంధించిన ప్రణాళికలను రూపొందించుకోవాలన్నారు. రైతులకు కనీస మద్దతు ధర అందించడానికి ముందుస్తు ప్రణాళికలు రూపొందించే పనిలో పౌరసరఫరాలశాఖ నిమగ్నమైందని తెలిపారు. ఇందులో భాగంగానే బిజినెస్ విభాగాన్ని ఏర్పాటు చేసి దాని ద్వారా రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యాన్ని మిల్లింగ్ చేసి ఇతర రాష్ట్రాలకు, దేశాలకు ఎగుమతి చేయడానికి ఉన్న అవకాశాలను పరిశీలిస్తున్నట్లు చెప్పారు. అలాగే ప్రజాపంపిణీలో అక్రమాలను నిరోధించి అర్హులకే నిత్యావసరకుల సరుకులు అందేలా ఇప్పటికే సాంకేతిక పరిజ్ఞానంతో అనేక చర్యలు చేపట్టామన్నారు. వీటిని మరింత పటిష్టంగా, విస్తృత పరిచే దిశగా ముందుకు సాగుతున్నట్లు చెప్పారు. ధ్యాన సేకరణ, కస్టమ్ మిల్లింగ్ రైస్, గోదాముల్లో బియ్యం నాణ్యత, ధ్యాన సేకరణలో గన్నీ సంచుల వినియోగం, ఆర్థికంగా రాష్ట్రంపై పడకుండా నిర్దేశిత సమయంలో రేషన్ బియ్యం రవాణా, పంపిణీ, ఇతర ఆర్థిక పరమైన అంశాలు, ఎన్‌ఫోర్స్‌మెంట్ విజిలెన్స్ విభాగం నిఘా, సాంకేతిక పరిజ్ఞానంతో కొత్తగా ప్రవేశపెట్టిన విధానాలు, ధాన్యం చెల్లింపులకు సంబంధించి ఓపిఎంఎస్ సాఫ్ట్‌వేర్ వంటి అంశాలపై ఈ ఒకరోజు శిక్షణ కార్యక్రమం జరుగుతుందన్నారు.

సుదర్శన భాగ్యంగా యాదాద్రి

(మొదటిపేజీ తరువాయి)

చేశారు. అత్యాధునికంగా, ఆధ్యాత్మిక శోభ కనిపించేలా నిర్మించిన వెల్లూరు, తంజావూరు, అక్షరధామ్ లాంటి ప్రసిద్ధ దేవాలయాలను సందర్శించి నిర్మాణాలను అధ్యయనం చేయాలని అధికారులను ముఖ్యమంత్రి కోరారు. దేశంలోని ప్రతీ ఒక్కరు ఒక్కసారైనా యాదాద్రిని సందర్శించాలనే ఉత్సుకత కలిగేలా, ఆసక్తి పుట్టేలా దేవాలయ ప్రాంగణాన్ని తీర్చిదిద్దాలని చెప్పారు. పునరుద్ధరణ తర్వాత యాదాద్రికి భక్తుల సంఖ్య ఎన్నో రెట్లు పెరుగుతుందని, దానికి అనుగుణంగా ఏర్పాట్లు ఉండాలని సిఎం ఆదేశించారు. శివరాత్రి ఉత్సవాలు, తెప్పోత్సవం నిర్వహించడానికి, నిరంతరం వ్రతాలు చేసుకోవడానికి, తలనీలాల సమర్పణకు, మండల దీక్ష భక్తులు ప్రత్యేక పూజలు చేసుకోవడానికి కావాల్సిన ఏర్పాట్లను శాశ్వత ప్రాతిపదికన చేయాలని ఆదేశించారు. ఒకదాని తర్వాత ఒకటి కాకుండా నిర్మాణ పనులన్నీ సమాంతరంగా సాగాలని, దీనికోసం ప్రతీ పనికి ప్రణాళిక ఉండాలని, ఆ ప్రకారమే పనులు జరగాలని అన్నారు.

నాలుగున్నర ఎకరాల్లో ప్రధాన దేవాలయం

ప్రధాన ఆలయముండే గుట్ట పైభాగంలో ఎలాంటి నిర్మాణాలు రావాలి, గుట్ట కింద భాగంలో ఎలాంటి నిర్మాణాలు ఉండాలి, టెంపుల్ సిటీపై ఎలాంటి నిర్మాణాలు అవసరం, మొత్తంగా యాదాద్రి స్వరూపం ఎలా ఉండాలి తదితర విషయాలపై అధికారులతో చర్చించిన ముఖ్యమంత్రి మాడ వీధులు, అన్ని ప్రాకారాలు కలుపుకుని నాలుగున్నర ఎకరాల విస్తీర్ణంలో ప్రధాన దేవాలయం నిర్మించాలని, మొత్తం 302 ఎకరాల విస్తీర్ణంలో దేవాలయ ప్రాంగణం ఉంటుందని వెల్లడించారు. లక్ష్మీ నర్సింహస్వామి కొలువై ఉండే గుట్ట పైభాగంలో ప్రధాన దేవాలయంతో పాటు గోపురాలు, ప్రాకారాలు, మాడ వీధులు, శివాలయం, ఆంజనేయ స్వామి విగ్రహం, ఆలయ కార్యనిర్వహణాధికారి కార్యాలయం, వివిఐపి గెస్ట్ హౌజ్ (ప్రెసిడెన్షియల్ సూట్), అర్చక నిలయం, నైవేద్యం వంటశాల, ప్రసాద మంటపం, రథశాల, వ్రత మంటపం, స్వామి పుష్కరిణి, క్యూ కాంప్లెక్స్, మెట్ల దారి, బస్ స్టేషన్, పోలీస్ ఔట్ పోస్టు, హెల్త్ సెంటర్లు ఉండాలని నిర్ణయించారు. ఏ నిర్మాణం ఎక్కడ రావాలనే దానిపై ఈ సమావేశంలో స్పష్టమైన నిర్ణయం జరిగింది. ఈ నిర్ణయం ప్రకారమే నిర్మాణాలు ప్రారంభం కావాలని అధికారులను ఆదేశించారు. గుట్ట కింది భాగంలో తెప్పోత్సవం నిర్వహించడానికి అనువుగా గండి చెరువును సుందరంగా తీర్చిదిద్దాలని చెప్పారు. బస్వాపూర్ రిజర్వాయర్ నుంచి నిత్యం ఈ చెరువుకు నీటి సరఫరా అవుతుందని వెల్లడించారు. గండి చెరువుకు అనుబంధంగా కోనేరు, కళ్యాణకట్ట నిర్మించాలని చెప్పారు. గుట్ట కింద భాగంలోనే ఆలయ బస్టాండ్ నిర్మించాలని, అక్కడి నుంచి భక్తులను దేవాలయానికి చెందిన వాహనాల ద్వారా భక్తులను, యాత్రికులను గుట్టపైకి తీసుకురావాలని చెప్పారు. గుట్టపైకి వెళ్లి, రావడానికి ఈ వాహనాలు వేర్వేరు దారులను ఉపయోగించాలని చెప్పారు. మండల దీక్ష చేపట్టిన భక్తుల కోసం గుట్ట కింద ఆశ్రమాన్ని నిర్మించాలని నిర్ణయించారు. యాదాద్రి ఆలయం చుట్టూ రింగు రోడ్డును నిర్మించాలని, దానికి అనుబంధంగా రేడియల్ రోడ్ల నిర్మాణాన్ని చేపట్టాలని సూచించారు. యాదాద్రి నుంచి తుర్కపల్లికి నాలుగు లైన్ల రోడ్లు వేయాలని ఆదేశించారు.

ప్రణాళికాబద్ధంగా నిర్మాణపు పనులు

ఆలయ పునరుద్ధరణ నిర్మాణ పనులన్నీ అత్యంత పటిష్టంగా జరగాలని, నాణ్యత విషయంలో రాజీపడవద్దని అధికారులకు ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. పునరుద్ధరణ పనులన్నీ పూర్తయిన తర్వాత పరిపూర్ణ ఉపాసకులతో అతిపెద్ద యాగం నిర్వహిస్తామని, దీనికి దేశ విదేశాల నుంచి ప్రముఖులను ఆహ్వానిస్తామని వెల్లడించారు. లక్షలాది మంది భక్తులు పాల్గొనే ఈ యాగం కోసం ఇప్పటి నుంచే ఏర్పాట్లు చేయడానికి ఓ కమిటీని నియమించనున్నట్లు చెప్పారు. భక్తులు బస చేయడానికి వీలుగా టెంపుల్ సిటీలో 340 క్వార్టర్ల నిర్మాణ పనులు వేగంగా జరగాలని సూచించారు. టెంపుల్ సిటీలో రోడ్లు, మంచినీరు, విద్యుత్, డ్రైనేజి లాంటి కనీస వసతులు కల్పించాలని సూచించారు. యాదాద్రిలోని ప్రతీ బ్లాకుకు దేవుళ్లు, దేవతల పేర్లు పెడతామని తెలిపారు. యాదాద్రి టెంపుల్ సిటీ అంతా ప్రకృతి రమణీయత గోచరించేలా, ఆహ్లాదం వెల్లివిరిసేలా ఉద్యానవనాలు, ఫౌంటేన్లు నిర్మించాలని చెప్పారు. యాదాద్రి పునరుద్ధరణ పనులను ఆదివారం సందర్శించి వచ్చిన ముఖ్యమంత్రి కెసిఆర్ సోమవారం ప్రగతి భవన్‌లో విస్తృతస్థాయి సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వ ముఖ్య సలహాదారు రాజీవ్ శర్మ, ఆర్ అండ్ బి ఇంజనీర్ ఇన్ చీఫ్ గణపతి రెడ్డి, రవీందర్ రావు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వసంత్ నాయక్, సూపరింటెండింగ్ ఇంజనీర్ లింగారెడ్డి, యాదగిరిగుట్ట టెంపుల్ డెవలప్‌మెంట్ అథారిటీ స్పెషల్ ఆఫీసర్ కిషన్ రావు, ఆలయ ఎగ్జిక్యూటివ్ అధికారి గీత, ఆలయ నిర్మాణ నిపుణుడు ఆనంద్ సాయి, స్ట్రక్చరల్ ఇంజనీర్ వెంకటేశ్వర్లు, ఆర్కిటెక్ట్ మధుసూదన్, వాసుకి, సిఎంఓ ప్రత్యేక కార్యదర్శి భూపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వేగంగా పనులు

(మొదటిపేజీ తరువాయి)

పనులను పరిశీలించారు. పనులు త్వరితగతిన పూర్తి చేయాలని గుత్తేదారులను, అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా టన్నెల్‌లో పనులు శరవేగంగా సాగుతున్నాయని, త్వరలోనే పని పూర్తవుతుందని, సెప్టెంబర్‌కల్లా టన్నెల్ పనులు పూర్తయి అక్టోబర్ నాటికి నీటిని తరలించేందుకు సిద్ధంగా ఉంటుందని అధికారులు వివరించారు. అనంతరం మల్కపేట రిజర్వాయర్ పనులను పరిశీలించారు. రిజర్వాయర్ పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించి, యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని ఆదేశించారు. మండలంలోని ఈ రిజర్వాయర్‌లో 3టియంసిల నీరు నిలువ ఉంటుందని తెలిపారు. ఈ నీటితో కోనరావుపేట మండలం సస్యశ్యామలం అవుతుందని, ఒక గుంటెడు స్థలం ఖాళీ లేకుండా మొత్తం సాగులోకి వస్తుందని పేర్కొన్నారు. ప్రతి యేటా వ్యవసాయ రంగానికి 25 వేల కోట్లు వెచ్చిస్తున్నామన్నారు. రాజన్న సిరిసిల్లా జిల్లాలో మొత్తం 2 లక్షల ఎకరాలకు నీటిని అందిస్తామని, 9వ ప్యాకేజీ పనులు 90శాతం పూర్తయ్యాయని తెలిపారు. రైతులు వలసల బాట మాని తమ కుటుంబాలతో సంతోషంగా ఉంటారని, రైతుల కళ్లల్లో ఆనందం చూడడమే తెలంగాణ ప్రభుత్వ ధ్యేయమని తెలిపారు.

గ్రామాల్లో ఉండండి.. అభివృద్ధిపనులు చేయండి : కెటిఆర్

నూతనంగా ఎన్నికైన సర్పంచులు, ఉప సర్పంచులు గ్రామాల్లోనే ఉండి గ్రామాభివృద్ధికి చర్యలు తీసుకోవాలని కెటిఆర్ అన్నారు. సోమవారం సిరిసిల్లలో ఆయన పర్యటన సందర్భంగా నియోజకవర్గంలో కొత్తగా ఎన్నికైన సర్పంచులు, ఉపసర్పంచులు ఆయన్ను కలుసుకుని కృతజ్ఞతలు తెలుపగా కెటిఆర్ వారిని అభినందించారు. ఈ సందర్భంగా కెటిఆర్ మాట్లాడుతూ గ్రామాల్లో సర్పంచులు, ఉపసర్పంచులపై ప్రజలు పెట్టుకున్న నమ్మకాన్ని నిలుపుకునేలా పనులు చేయాలన్నారు. అభివృద్ధి పనులకు ప్రభుత్వ పరమైన సహకారం ఉంటుందన్నారు. గ్రామాల్లో ప్రజాప్రతినిధులు నివాసం ఉండి ప్రజా సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందించాలని సూచించారు. ఈ సందర్భంగా ఎన్నికలు జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. ఎన్ని ఓట్లతో గెలుపొందారని ఆరా తీశారు. విద్యావంతులు రాజకీయాల్లోకి రావడం హర్షణీయమని చెపుతూ విద్యావంతురాలైన మండెపల్లి సర్పంచ్ శివజ్యోతిని అభినందించారు. ఐదేళ్ల గ్రామ అభివృద్ధి కోసం పక్కా ప్రణాళికతో ముందు కెళ్లాలని సూచించారు. రాబోయే రోజుల్లో ప్రభుత్వం చేపట్టే సంక్షేమ పథకాలు పేదలకు అందేలా సర్పంచ్‌లు వారధిలా పనిచేయాలన్నారు. ఓడిన అభ్యర్థులు నిరుత్సాహ పడకుండా గ్రామాల్లో సర్పంచ్‌లతో కలసి పనిచేయాలన్నారు. త్వరలో మళ్లీ అందరిని కలిసి గ్రామాల అభివృద్ధిపై చర్చిస్తామన్నారు. అందరిని ఆప్యాయంగా పలకరించారు.

ఎమ్మెల్యే కోసం బారులు తీరిన నాయకులు

సిరిసిల్లలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి మండల నాయకులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఎన్నికలలో గెలుపొందిన తర్వాత సర్పంచ్‌లు కెటిఆర్‌ను కలిసేందుకు హైదరాబాద్ వెళ్లేందుకు సిద్ధమవగా ఎవరూ రావద్దని తానే స్వయంగా నియోజకవర్గానికి వచ్చి కలుస్తానని తెలపడంతో వేచి చూసిన ప్రజాప్రతినిధులు పెద్ద ఎత్తున కెటిఆర్‌ను కలిసేందుకు తరలివచ్చారు. దీంతో కార్యాలయం సందడిగా మారింది. ఒక్కొక్కరిని కార్యాలయంలోకి అనుమతించగా భారీగా తరలివచ్చిన నాయకులతో కార్యాలయం గందరగోళంగా మారింది. కెటిఆర్‌ను కలవాలన్న ఆత్రుతతో ఉన్న నాయకులకు పోలీసుల ఆంక్షలతో కొంతసేపు నిరీక్షణ తప్పలేదు. అందరిని కలుస్తానని తెలపడంతో విడతల వారీగా పోలీసులు లోపలికి పంపారు.

సిరిసిల్ల జాతరల్లో పాల్గొన్న కెటిఆర్

రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో సోమవారం పుష్య బహుళ అమావాస్య సందర్భంగా నిర్వహించిన వివిధ జాతరల్లో కెటిఆర్ పాల్గొన్నారు. సిరిసిల్లలోని మానేరు నదిలోఉన్న గంగాభవాని జాతర సందర్భంగా గంగమ్మ ఆలయాన్ని సందర్శించి పూజలో పాల్గొన్నారు. మానేరు నది ఒడ్డున ఉన్న మడేలేశ్వర స్వామి దేవాలయంలో నిర్వహించిన పూజా కార్యక్రమానికి హాజరయ్యారు. అక్కడినుండి మానేరు తీరంలోని రామప్పలో గల రామలింగేశ్వర స్వామి ఆలయంలో నిర్వహించిన జాతర పూజలో పాల్గొన్నారు. అనంతరం సిరిసిల్ల ప్రాంతంలో జరుగుతున్న జాతరల గురించి వివరాలు తెలుసుకుని శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జెసి యాస్మీన్ భాషా, టెస్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్ రావు, మండల అధ్యక్షులు న్యాలకొండ రాఘవ రెడ్డి, దేవరకొండ తిరుపతి, గున్నల అరుణ లక్ష్మ ణ్, సంతోష్ రెడ్డి, మల్యాల దేవయ్య, కె.గంగాధర్, ఉప్పుల శంకర్, బాపురెడ్డి తదితరులు ఉన్నారు.

రాకేషే

(మొదటిపేజీ తరువాయి)

యువతులతో హైటెక్ వ్యభిచారం చేయించి ముఠాను నడిపినట్లు తేలింది. నగర శివారు ప్రాంతానికి చెందిన ఒక శాసనసభ్యుడి పేరుతో బెదిరించి ఓ వ్యక్తి నుంచి రూ. 80 లక్షలు వసూలు చేసిన కేసులో పోలీసులు అప్పట్లో అరెస్టు కూడా చేసినట్లు వెలుగులోకి వచ్చింది. ఒక రాజకీయ పార్టీతో సన్నిహితంగా ఉంటూ ఎన్నికల్లో పోటీ చేయడానికి టికెట్లు ఇప్పిస్తానని పలువురిని మోసం చేసి డబ్బు పోగేసుకున్నట్లు తెలిసింది. జూబ్లీహిల్స్‌లో అద్దెకుంటున్న విలాసవంతమైన ఇంట్లోనే జయరాంను నిర్బంధించినట్లు పోలీసులు తెలిపారు. జయరాం కేసు దర్యాప్తులో భాగంగా పోలీసులు రాకేష్‌రెడ్డి ఇంట్లో సోదాలను కూడా నిర్వహించారు. రాకేష్‌రెడ్డి విలాసవంతమైన జీవితం చూసి శిఖా చౌదరి అతనితో పరిచయం పెంచుకున్నట్లు పోలీసులు భావిస్తున్నారు. జయరాంకు రాకేష్ రెడ్డి ఇచ్చిన నాలుగున్నర కోట్ల రూపాయలు ఎక్కడి నుంచి వచ్చాయన్న కోణంలో పోలీసులు దర్యాప్తు సాగిస్తున్నారు. టెట్రా పాలిమర్స్ కంపెనీలో యూనియన్‌లో సభ్యుడిగా ఉన్న రాకేష్‌రెడ్డికి శిఖా చౌదరి పరిచయం కావడంతో కుత్బుల్లాపూర్ నియోజక వర్గం పరిధిలోని సంజయ్‌గాంధీ నగర్‌లో నివాసమున్నాడని, ఆ కారణంగానే ఆ నియోజకవర్గంలోని ఒక పార్టీ తరఫున పోటీ చేస్తున్న అభ్యర్థితో పాటు మరో నియోజకవర్గంలోని అభ్యర్థికి కూడా మద్దతు పలికి ఎన్నికల ప్రచారంలో పాలుపంచుకున్నాడని పోలీసులు దర్యాప్తులో తేలింది. టెట్రా పాలిమర్స్ కంపెనీలో యూనియన్ తరపు ప్రతినిధిగా ఉంటూ కంపెనీ యాజమాన్యం శిఖా చౌదరితో పరిచయం పెంచుకుని చివరకు కంపెనీ మూసివేసేందుకు కారణం కావడంతో అందులో పనిచేసే కార్మికులకు రాకేష్ అన్యాయం చేశాడనే ఆరోపణలో అప్పట్లో వచ్చాయి. రాజకీయ నాయకుల తనయులతో సన్నిహితంగా ఉంటూ వారికి కావాల్సినవి సమకూరుస్తూ తాజాగా ముగిసిన రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలలో చంద్రబాబుతో కలిసి ప్రచారంలో పాల్గొన్నట్లు తేలింది. ప్రజా కూటమి స్టార్ కాంపెయినర్ విజయశాంతితోనూ ప్రచారంలో పాల్గొన్న ఛాయాచిత్రాలు వెలుగులోకి వచ్చాయి. రాకేష్ రెడ్డిపై 2015లో కూకట్‌పల్లిలో బెదిరింపుల కేసు నమోదైనట్లు పోలీసులు తెలిపారు. రాకేష్‌రెడ్డి బాధితుల్లో అరబిందో ఫార్మా ఎండి నిత్యానందరెడ్డి కూడా ఉన్నట్లు పోలీసులు సూచనప్రాయంగా తెలిపారు. అప్పట్లో నిత్యానందరెడ్డికి ఫోన్ చేసి రూ. 8 లక్షలు రాకేష్‌రెడ్డి డిమాండ్ చేసినట్లు ఆరోపణలున్నాయి. దీపక్ నైట్రేట్, సరస్వతి కెమికల్, పర్చివ్ ల్యాబ్స్, కళానికేతన్ ఎండి లీలాకుమార్, గ్రీన్ బావర్చి తదితరులు నుంచి పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేసినట్లు పోలీసుల విచారణలో తేలింది.

మోసం చేసినందుకే చంపేశాను : రాకేష్‌రెడ్డి

జయరాం స్థాపించిన టెట్రా పాలిమర్స్ కంపెనీ నష్టాల్లో కూరుకుపోయి కనీసం సిబ్బందికి జీతాలు కూడా చెల్లించలేని స్థితిలో ఉద్యోగులు ఆందోళన చేస్తున్నప్పుడు శిఖాచౌదరి ద్వారా ఏర్పడిన పరిచయంతో నాలుగున్నర కోట్ల రూపాయలను అప్పుగా ఇప్పించానని, ఆ పరిచయమే చివరకు శిఖా చౌదరితో ప్రేమగా మారిందని, ఇద్దరం పెళ్లి చేసుకోవాలనే నిర్ణయానికి వచ్చినట్లు స్వయంగా రాకేశ్ అంగీకరించినట్లు పోలీసులు తెలిపారు. శిఖా చౌదరికి ఉన్న పరిచయాలను చూసి ఆమె పట్ల ఆకర్షితుడినయ్యానని, ఆమె జల్సాల కోసం దాదాపు కోటి రూపాయలను కూడా ఖర్చు పెట్టినట్లు విచారణలో పోలీసులకు వివరించినటు తెలిసింది. శిఖా చౌదరితో శారీరక సంబంధం ఉన్న తన మేనమామ జయరాం తమ పెళ్లికి అంగీకరించలేదని, శిఖాను వదిలేస్తే కోటి రూపాయలను ఇస్తానంటూ జయరాం హామీ ఇచ్చాడని, గతంలో తనకు రావాల్సిన రూ.4.50 కోట్లతో కలిపి మొత్తం రూ. 5.50 కోట్లు చెల్లిస్తానని జయరాం తనను నమ్మించాడని కూడా వివరించినట్లు తెలిసింది. జయరాంను ఎప్పుడు డబ్బులు అడిగినా దాటవేశారని, ఒక్క రూపాయి కూడా ఇవ్వకపోవడంతో పలు మార్లు శిఖా చౌదరిని బెదిరించానని, డబ్బులు ఇవ్వకపోతే చంపేస్తానని కూడా హెచ్చరించానని, అయినా ఏలాంటి మార్పూ రాలేదని, అమెరికా నుంచి జయరాం వచ్చినట్లు తెలిసి ఎలాగైనా జయరాంను కిడ్నాప్ చేసి తనకు రావాల్సిన మొత్తాన్ని రాబట్టుకోవాలని నిర్ణయించుకుని తాను పిలిస్తే రాడని ఓ యాంకర్‌ను రంగంలోకి దింపానని పోలీసులకు మొత్తం వ్యవహారాన్ని వివరించినట్లు తెలిసింది. తాను ఊహించినట్లుగానే జయరాంను నగరంలోని దస్పల్లా హోటల్‌కు పిలిపించానని, జనవరి 31వ తేదీ రాత్రి జయరాంకు తనకు మధ్య గొడవ జరిగడం, కోపాన్ని తట్టుకోలేక ఆయన ఛాతీపై పిడిగుద్దులు గుద్దడం, ఆ దెబ్బలకు జయరాం అక్కడికక్కడే చనిపోయాడని పోలీసులకు తెలిపినట్లు సమాచారం. జయరాం హార్ట్ పేషెంట్ అనే సంగతి ఆ సమయంలో తనకు తెలియదని కూడా పోలీసులకు చెప్పినట్లు తెలిసింది. మృతదేహాన్ని ఏం చేయాలో తెలియక కారులో నందిగామ శివారు ప్రాంతానికి తీసుకెళ్లి వదిలేసి తిరిగి తాను హైదరాబాద్‌కు వచ్చేసినట్లు మొత్తం విషయాన్ని పోలీసులకు పూసగుచ్చినట్లు చెప్పినట్లు తెలిసింది.

తెలుగుదేశం నేతలతో పరిచయాలు : రాకేష్‌రెడ్డి తండ్రి

టిడిపికి చెందిన రాజకీయ నాయకులతో తన కుమారుడికి సంబంధాలున్నట్లు రాకేష్‌రెడ్డి తండ్రి మీడియాకు తెలిపారు. తమ కుమారుడు ఎపి సిఎం చంద్రబాబుతో కూడా ఫోటోలు దిగాడని, పెద్దపెద్ద రాజకీయ నాయకులు అప్పుడప్పుడూ తమ కుమారునికి ఫోన్లు కూడా చేసేవారని తెలిపారు. అయితే శిఖాచౌదరి పరిచయం కాకముందు మంచిగా ఉండేవాడని, తరచూ ఇంటికి వచ్చేవాడని, ఆ పరిచయం తర్వాత ఇంటికి రావడం తగ్గించేశాడన్నారు. జయరాం ఎవరో తమకు తెలియదని, తమ కుమారుడిని పోలీసులు అన్యాయంగా ఇరికించారని ఆవేదన వ్యక్తంచేశాడు. తమకు ఆర్థిక ఇబ్బందులు లేవని, ఒకరని చంపి లబ్ది పడే కుటుంబం కాదని తెలిపారు.

జయరాం బంధువుల హస్తం ఉంది : పద్మశ్రీ

తన భర్తను అతని తరపు బంధువులే చంపించారని మృతుడు జయరాం భార్య పద్మశ్రీ సంచలన ఆరోపణలు చేశారు. జయరాం మేనకోడలు శిఖా చౌదరి కిలాడీ అని, డబ్బు కోసం ఎంతటికైనా తెగిస్తుందని ఆరోపించారు. గతంలో రెండు పెళ్లిళ్లు చేసుకుని వారిని అవమానించడంతోపాటు వేధించిందని అన్నారు. అమెరికాలో ఉన్న కాలంలో జయరాం తన సోదరి, ఆమె కుమార్తె శిఖాతో తనకు ప్రాణహాని ఉందంటూ తరచూ చెప్పేవాడని గుర్తుచేసింది. వ్యాపార లావాదేవీల కోసమే జయరాం ఇండియా వచ్చారని, ఇంత ఘోరం జరుగుతుందని తాను ఊహించలేదన్నారు. శిఖా చౌదరి తన భర్తను లోబరుచుకుని ఆస్తిని కాజేయాలని చూసిందని ఆరోపించారు.

ఎంపి కవితకు

(మొదటిపేజీ తరువాయి)

శ్రీరామకృష్ణన్ పేర్కొన్నారు. కేరళ వజ్రోత్సవ వేడుకలు గతేడాది ఆగస్టులో రాష్ట్రపతి రాంనాథ్ కోవింద్ ప్రారంభించారు. ఉత్సవాల్లో భాగంగా మొదటి సెమినార్‌ను గత ఏడాది ఆగస్టు 6 నుంచి 8వరకు 'ఎస్‌సి, ఎస్‌టిల సాధికారత సవాళ్ళు' అంశంపై సదస్సు జరిగింది. ఇపుడు రెండో సెమినార్‌ను ఈనెల 23 నుంచి 25 వరకు జరగనుంది. ఇందులో యువతలో ప్రజాస్వామిక విలువలు, జీవన విధానం, ప్రజాస్వామిక ఆలోచనా దృక్పథాన్ని పెంపొందించే లక్ష్యంతో సదస్సును నిర్వహిస్తున్నారు. కేరళ అసెంబ్లీ, కేరళ ప్రభుత్వ పార్లమెంటరీ వ్యవహారాల శాఖలు సంయుక్తంగా ఎంఐటి వరల్డ్ పీస్ యూనివర్సిటీ, పూణే సాంకేతిక సహకారంతో ప్రజాస్వామ్యంపై ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు ఈ లేఖలో కేరళ అసెంబ్లీ స్పీకర్ వివరించారు.

నేడు ఆరు రాష్ట్రాల డిజిపిల సమావేశం

మన తెలంగాణ/తిరుమల ప్రతినిధి : మంగళవారం తిరుపతిలో ఆరు రాష్ట్రాల సంబంధించిన డిజిపిలతో కీలకమైన సమావేశం జరగనుంది. తిరుపతిలోని మారస సరోవర్ హోటల్ లో మంగళవారం ఉదయం 10 .45 గంటలకు పోలీసుల ఉన్నత స్థాయి సమావేశం జరుగుతుంది. రానున్న సాధారణ ఎన్నికల భద్రతా ఏర్పాట్లు, వాటి నిర్వహణ, తదితర ముఖ్యమైన అంశాలపై ఉన్నత స్థాయి పోలీసు అధికారుల సమావేశం నిర్వహిస్తున్నారు. ముఖ్యమైన సమావేశానికి ఆంధ్ర ప్రదేశ్ డిజిపి ఆర్పీ ఠాకూర్, తెలంగాణ డిజిపి మహేంద్ర రెడ్డి, చత్తీస్ గడ్ డి.జి.పి అవస్థి, కేరళ డి జె పి ఆర్ పి శర్మ , తమిళనాడు డిజిపి పీకే రాజేంద్రన్, కర్ణాటక డిజిపి నీలమణి రాజు, లతోపాటు పలువురు ఐపీఎస్ అధికారులు పాల్గొంటున్నారు.

పార్లమెంట్ ఎన్నికలపై బిజెపి నజర్

పార్టీ కార్యాలయంలో కోర్ కమిటీ సభ్యుల సమావేశం

మన తెలంగాణ/హైదరాబాద్ : పార్లమెంట్ ఎన్నికలపై బిజెపి రాష్ట్ర శాఖ దృష్టి సారిం చింది. ఈ ఎన్నికలను పార్టీ జాతీయ నాయకత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న నేపథ్యంలో గెలుపే లక్ష్యంగా అడుగులు వేసేందుకు ప్రణాళికలకు పదనుపెడుతోంది. రాష్ట్రంలో మొత్తం పదిహేడు లోక్‌సభ నియోజకవర్గాలు ఉండగా కనీసం ఐదు స్థానాల్లోనైనా విజయకేతనం ఎగురవేయాలని ఉవ్విలూరుతోంది. ఇందులో భాగంగా పార్టీ రాష్ట్ర ఎన్నికల ఇన్‌ఛార్జీ అర్వింద్ లింబావళి ఆధ్వర్యంలో ఆదివారం నాంపల్లిలోని బిజెపి రాష్ట్ర కార్యాలయంలో కోర్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పార్టీ చాలా సునాయాసంగా గెలిచే అవకాశాలు ఉన్న నియోజకవర్గాలు ఎన్ని? మరి కొంచెం కష్టపడితే విజయం సాధించడానికి దగ్గరగా ఉన్న నియోజకవర్గాలు ఎన్ని? పార్టీ పూర్తిగా బలహీనంగా ఉన్న నియోజకవర్గాల వివరాలపై అర్వింద్ లింబావళి ఆరా తీసినట్లుగా సమాచారం. తెలంగాణలో ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ ఘోర పరాజయం పాలైనప్పటికీ దాని ప్రభావం పార్లమెంట్ ఎన్నికలపై పెద్దగా ప్రభా వం ఉండబోదని ఆయన వ్యాఖ్యానించినట్లుగా సమాచారం. పార్లమెంట్ ఎన్నికల్లో ప్రధాని నరేంద్రమోడీకున్న ఆదరణతోనే బిజెపి మరోసారి కేంద్రంలోకి అధికారంలోకి వస్తుందన్నారు. ఐదు సంవత్సరాల మోడీ పాలనలో ఎలాంటి కుంభకోణాలు జరగకపోవడం, అదే సమయంలో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలును పరుగులు తీస్తుండడంతో ప్రజలంతా సంతోషంగా ఉన్నారన్నారు. బిజెపి జాతీయ అధ్యక్షుడు అమిత్ షా ఈనెల రెండవ వారంలో తెలంగాణలో పర్యటించే అవకాశముందన్నారు. అప్పటిలోగా పూర్తి స్థాయిలో కార్యచరణ ప్రణాళికలను తయారు చేయాల్సిందిగా కోర్ కమిటీ సభ్యులను ఆయన ఆదేశించారు. అసెంబ్లీ ఎన్నికల్లో జరిగిన తప్పులను దృష్టిలో పెట్టుకుని దాని ప్రభావం పార్లమెంట్ ఎన్నికలపై పడగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాల్సిందిగా అర్వింద్ సూచించినట్లుగా సమాచారం. కాగా ప్రస్తుతం పార్టీ గెలిచేందుకు అవకాశమున్న నియోజకవర్గాల్లో సికింద్రాబాద్, మల్కాజ్‌గిరి, కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్ స్థానాలు ఉన్నట్లుగా కోర్ కమిటీ సభ్యులు లింబావళికి వివరించారు. ఈ సమావేశంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కె. లక్ష్మ ణ్, మాజీ ఎమ్మెల్యే జి. కిషన్‌రెడ్డి, కేంద్రమాజీ మంత్రి బండారు దత్తాత్రేయ, ఎమ్మెల్సీ రాంచందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

పసుపు రైతులకు మహర్దశ

- పసుపు బోర్డు ఏర్పాటుకు ఎంపి కవిత కృషి
- ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ కోసం సర్కార్‌కు వేముల విన్నపం



మనతెలంగాణ/నిజామాబాద్ ప్రతినిధి : జిల్లాలో అత్యధికంగా పసుపు పండించే రైతులకు మరింత మేలు జరగాలంటే నిజామాబాద్ జిల్లాలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటే సరైన మార్గమని ప్రభుత్వం భావిస్తోంది. దీని మూలంగా పసుపు పండించే రైతులకు గిట్టుబాటు ధర,నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు కల్పించే అవకాశం ఏర్పడుతుంది. జిల్లాలో 32వేల ఎకరాల్లో పసుపు పంటను సాగుచేస్తున్నారు. యేటా సగటున 78,300 మెట్రిక్ టన్నుల ఉత్పత్తి జరుగుతోంది. ఈ యేడాది బాల్కొండ నియోజకవర్గంలో 19వేల ఎకరాలు, ఆర్మూర్‌లో 9,800 ఎకరాలు, నిజామాబాద్ రూరల్‌లో 6000 ఎకరాలలో పసుపు సాగవుతోంది. ఇప్పటికే పసుపు పార్కు జిల్లాలోని వేల్పూర్‌లో ఉండగా దీనికి అనుసంధానంగా ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేయాలని రైతులు ఎప్పటినుంచో కోరుతున్నారు. దీనితో పాటు ఎంపి కవిత ఎంతో కాలంగా పసుపు బోర్డు ఏర్పాటు చేయాలని కోరుతూ వస్తున్నారు. ఔషధ గుణాలున్న పసుపు పంటకు మద్దతు పెరగాలని భావించిన ఎంపి కేంద్ర ప్రభుత్వంతో పాటు పతంజలి వ్యవస్థాపకుడు రాందేవ్ బాబాతోనూ చర్చించారు. ఎంపి కవిత ఆహ్వానం మేరకు నిజామాబాద్ జిల్లాలో పర్యటించిన పతంజలి సిఇఒ అప్పట్లోనే ఔషధ గుణాలున్న పసుపు పంటకు ప్రత్యేక ఆదరణ దక్కేలా కృషి చేస్తామని ప్రకటించారు. జిల్లాలోని నందిపేటలో పతంజలి ఆధ్వర్యంలో పసుపు శుద్ధి కర్మాగారం ఏర్పాటు చేసి రైతులకు లబ్ది చేకూర్చుతామని వెల్లడించిప్పటికీ దీనిలో పురోగతి కనిపించడంలేదు. ఆర్మూర్‌లో పసుపు బోర్డు ఏర్పాటు కోసం పట్టుదలతో ఉన్న ఎంపి కవిత ఇప్పటికే ప్రధాని నరేంద్ర మోడీతోపాటు కేంద్ర మంత్రులకు సైతం పలుమార్లు విన్నవించారు. పార్లమెంటులో పసుపు బోర్డుకోసం ఆమె చేసిన డిమాండుకు కేంద్ర ప్రభుత్వం నుంచి సానుకూల హామీ కూడా లభించింది. సిఎం కెసిఆర్ సహకారంతో జిల్లాలోని పసుపు రైతులకు శాశ్వత ప్రయోజనం కలిగేలా జిల్లాలోని రెండు మూడు ప్రాంతాలలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేయడం ద్వారా పసుపు రైతులను ఆదుకోవడానికి అవకాశం కలుగుతుంది. బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి కూడా వేల్పూర్‌లో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వానికి విన్నవించారు. 2009–10 సంవత్సరంలో పసుపు పంటకు క్వింటాలుకు రూ.13,500 నుండి 18వేల వరకు ధర లభించడంతో పంటకు ఉన్న ప్రాధాన్యత మరింతగా పెరిగింది. దీంతో ఎక్కువ మంది రైతులు పసుపు సాగు వైపు ఆసక్తి చూపుతున్నారు. పసుపు పంట సాగుకు తేమతో కూడిన వేడి అవసరం కాగా నీరు ఇంకిపోయే గులక, తువ్వ, గరప, నల్ల నేలలు ఆర్మూర్, బాల్కొండ ప్రాంతాల్లో ఉండడంతో పసుపుకు అనుకూలంగా మారింది. జూలై మాసానికి ముందు సాగైన పసుపు పంట ప్రస్తుతం చేతికి వస్తుండగా రైతులు మరోసారి మద్దతు ధర పట్ల గంపెడాశలో ఉన్నారు. జగిత్యాల, పెద్దపల్లి, మెట్‌పల్లి, నిర్మల్ తదితర ప్రాంతాల నుండి రైతులు పసుపును నిజామాబాద్ మార్కెట్‌కు తరలిస్తుంటారు. నిజామాబాద్, వరంగల్ మార్కెట్‌లపై ఆశలు పెట్టుకున్న రైతులు చివరి వరకు యత్నించి వీలైనంత ఎక్కువ ధర రాగానే పసుపును విక్రయిస్తున్నారు. పసుపు శుద్ధి కర్మాగారం ఏర్పాటుతో పాటు పసుపు బోర్డును ఏర్పాటు చేయాలని స్థానిక రైతులు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తెస్తూనే ఉన్నారు. పసుపు బోర్డు ఏర్పాటు ద్వారా పసుపు పంటను మూడు, నాలుగు రకాలుగా వినియోగించడంతో పాటు అవసరమైన మార్కెటింగ్ సౌకర్యాలను కల్పించుకోవచ్చని, ఆధునిక గిడ్డంగులను ఏర్పాటు చేసుకొని గిట్టుబాటు ధర వచ్చే వరకు కోల్డ్ స్టోరేజీల్లో నిల్వ ఉంచుకోవచ్చని భావిస్తున్నారు.

ఆదర్శ స్టేషన్‌గా మౌలాలి అభివృద్ధి

- అత్యాధునిక హంగులతో పాటు పూర్తిస్థాయిలో మౌలిక వసతుల కల్పన



మన తెలంగాణ / హైదరాబాద్ : నగర శివారుల్లోని మౌలాలి స్టేషన్‌ను ఆదర్శవంతంగా అభివృద్ధి చేసినట్లు దక్షిణ మధ్య రైల్వే ఉన్నతాధికారులు తెలిపారు. అత్యాధునిక హంగులతో పూర్తిస్థాయిలో మౌలిక సదుపాయాలను కల్పించినట్లు తెలిపారు. ప్రయాణికులు ఎలాంటి ఇబ్బందులకు గురికాకుండా సకల సౌకర్యాలను ఏర్పాటు చే సినట్లు అధికారులు వెల్లడించారు. నాన్ సబర్బన్ గ్రేడ్ – 5 కేటగిరికి చెందిన వాటిలో మౌలాలి ముఖ్యమైన స్టేషనన్నారు. సికింద్రాబాద్ డివిజన్‌కు చెందిన ఈ స్టేషన్ సికింద్రాబాద్ – కాజీపేట సెక్షన్ పరిధిలో నెలకొని ఉందన్నారు. మౌలాలిని ఆదర్శవంత స్టేషన్‌గా అభివృద్ధి చేయడంతో దక్షిణ మధ్య రైల్వేలో ఆదర్శ స్టేషన్ల సంఖ్య 67కు చేరిందని అధికార యంత్రాంగం వెల్లడించింది. స్టేషన్ పరిసరాలు విసృత్తంగా అభివృద్ధి చెందడంతో పాటు భారీగా కొత్త కాలనీలు ఏర్పడడం వల్ల ప్రయాణికుల రద్దీ కూడా పెరుగుతుందన్నారు. ఈ నేపథ్యంలో స్టేషన్ నుంచి రోజుకు పది ఎక్స్‌ప్రెస్ రైళ్లతో పాటు పలు ప్యాసింజర్ రైళ్లు రాకపోకలు సాగిస్తున్నాయని, వీటి ద్వారా సుమారు రెండున్నర వేల మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నారని తెలిపారు. పెరుగుతున్న ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకొని రూ.3.5 కోట్ల వ్యయంతో ఆధునిక వసతులు, మౌలిక సదుపాయాలు కల్పించినట్లు తెలిపారు. 2016 –17వ ఆర్థిక సంవత్సరంలో మౌలాలిని ఆదర్శవంతమైన స్టేషన్‌గా అభివృద్ధి చేసేందుకు రైల్వేశాఖ అవసరమైన నిధులను కేటాయించిందన్నారు. అభివృద్ధి పనుల్లో ప్రధానంగా స్టేషన్ భవనాన్ని సుందరీకరించడం, ప్రయాణికులు వేచి ఉండేందుకు గదిని ఏర్పా టు చేయడం, దివ్యాంగులతో పాటు సాధారణ ప్రయాణికులకు ప్రత్యేక పార్కింగ్ సదుపాయం, పార్కింగ్ నుంచి స్టేషన్ వరకు నూతన రోడ్డు నిర్మాణం, వృద్ధులు, దివ్యాంగుల కోసం ర్యాంపుల ఏర్పాటు, ఆధునిక పద్ధతిలో అందమైన సూచికల బోర్డుల ఏర్పాటు, పే అండ్ యూజ్ టాయిలెట్లు, ప్లాట్‌ఫారం గోడలపై అందమైన పకృతి దృశ్యాలు, సరిపడే విధంగా తాగునీటి వసతితో పాటు బుకింగ్, విచారణ కార్యాలయాలను అభివృద్ధి చేసినట్లు అధికారులు తెలిపారు. దీంతో పాటు ప్రయాణికుల అవసరాల రీత్యా రూ.1.6 కోట్ల నిర్మిస్తున్న వంతెన త్వరలోనే వినియోగంలోకి రానుందని అధికారులు తెలిపారు.

కొత్త సర్పంచ్‌లకు సరికొత్త సవాళ్ళు

- కీలకంగా మారిన పన్నుల వసూళ్ళు
- పచ్చదనం, పారిశుద్ధ్యం, అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

మన తెలంగాణ/హైదరాబాద్ : రాష్ట్రంలో రెండు రోజుల క్రితం సర్పంచ్‌లుగా బాధ్యతలు స్వీకరించిన గ్రామ ప్రజా ప్రతినిధులకు పన్నుల వసూళ్ళ ప్రక్రియ కీలకంగా మారింది. పంచాయతీల్లో పన్నులు వసూళ్ళలో ఎంత వేగం పెరిగితే అంతగా అభివృద్ధి పనులు జరుగుతాయని ఇప్పటికే వారికి ఒక స్పష్టత వచ్చింది. అందుకే బాధ్యతలు స్వీకరించిన సర్పంచ్‌లు తొలుత ఈ అంశంపైనే దృష్టి సారిస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికలు, ఆ వెంటనే పంచాయతీ ఎన్నికలు జరగడంతో చాలా చోట్ల ఆస్తిపన్ను వసూలు పూర్తిస్థాయిలో జరగలేదు. చిన్న పంచాయతీల్లో ఈ ప్రక్రియ నత్తనడకన సాగుతోంది. అందుకే ఆస్తిపన్నును వంద శాతం వసూలు చేయడంపై దృష్టి పెట్టారు. పంచాయతీల్లో ఇంకా వసూలు కావాల్సిన ఆస్తిపన్ను ఎంత, రానున్న ఆర్థిక సంవత్సరంలో ఎంత వసూలు చేయడానికి అవకాశముంది, పంచాయతీల్లో భవన నిర్మాణ అనుమతుల్లో వస్తున్న ఆదాయం ఎంత, అనుమతుల ప్రకారమే నిర్మాణాలు జరుగుతున్నాయా, ఆస్తిపన్ను కట్టకుండా తప్పించుకుంటున్నవారు ఎంత మంది, విలువను తక్కువగా చూపించి పన్ను చెల్లిస్తున్న వారు ఎంత మంది తదితర అంశాలపై సర్పంచ్‌లు ఆరా తీస్తున్నారు. బకాయిలు లేకుండా పన్నుల్ని సకాలంలో, క్రమం తప్పకుండా చెల్లించేవారికి అవసరమైతే చిరు ప్రోత్సహకాలను అందించాలని కూడా ఆలోచన చేస్తున్నట్లు సమాచారం. ఇప్పటికే జిహెచ్‌ఎంసి పరిధిలో ఈ విధానం విజయవంతంగా అమలవుతోంది. ఆర్థిక సంవత్సరం మొదలైన తొలి మాసంలోనే ఆస్తిపన్నును మొత్తం చెల్లించేవారికి ఐదు శాతం రిబేటు కల్పిస్తోంది. దీని వల్ల ఆర్థిక సంవత్సరం ప్రారంభమైన మొదటి నెలలోనే గ్రేటర్ బల్దియాకు పెద్దఎత్తున ఆదాయం లభిస్తోంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మరో రెండు నెలల్లో ముగియనున్నందున వసూలు కావాల్సిన మొత్తం ఆస్తి పన్నుపై కొత్త సర్పంచ్‌లు వివరాలు తీసుకుంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వం 300 జనాభా ఉన్న గ్రామాలతో పాటు గిరిజన గూడేలు, తండాల్లో వెలుగులు నింపాలన్న లక్ష్యంలో అతి తక్కువ జనాభా ఉన్న గ్రామాలను సైతం పంచాయతీలుగా రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసి నిధులను కూడా విడుదల చేయనున్నట్లు హామీ ఇచ్చింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం బడ్జెట్‌లో రూ.12 వేల కోట్లను కేటాయించింది. ఒక్కో పంచాయితీ ఐదు లక్షల రూపాయల మొదలు పది లక్షల వరకు ఆర్థిక కేటాయింపులు చేయనున్నట్లు ప్రభుత్వం స్పష్టం చేసినందున రానున్న ఆర్థిక సంవత్సరంలో ఆ నిధులు విడుదలయ్యే అవకాశం ఉంది.

తీరనున్న నీటి కష్టాలు

- మార్చి నెలాఖరులోగా ఇంటింటికీ తాగునీరు
- చివరి దశలో మిషన్ భగీరథ పనులు
- 90 శాతం గ్రామాల్లో నీటి సరఫరా



నీటి కోసం తంటాలు పడుతున్న గ్రామీణ ప్రాంతవాసులు (ఫైల్ ఫోటో)

మనతెలంగాణ/ఆదిలాబాద్ ప్రతినిధి : వేసవికాలం వస్తుందంటే చాలు ఉమ్మడి ఆదిలాబాద్‌జిల్లావ్యాప్తంగా నీటి కోసం ప్రజలంతా నానాఇబ్బందులు పడాల్సిన పరిస్థితులు నెలకొనేవి. పట్టణం, పల్లెలు అనే తేడా లేకుండా నీటి కోసం ఇబ్బందులు పడుతూ వర్షాలు ఎప్పుడు కురుస్తాయా అనే ఎదురు చూసే పరిస్థితి నుంచి మరికొద్ది రోజుల్లో ఉపశమనం లభించనుంది. ఇంటింటికీ సురక్షిత తాగునీటిని అందించాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన మిషన్ భగీరథ పనులు మరో రెండు నెలల్లో పూర్తి కానున్నాయి. ఇప్పటికే గ్రామాలకు చేరుకున్న పైప్‌లైన్ల ద్వారా ట్యాంకులకు నీటిని విడుదల చేస్తున్న అధికారులు ఇంటింటికీ నల్లాలు బిగించే పనిలో నిమగ్నమయ్యారు. ఈ పనులు సకాలంలో పూర్తి చేసి వేసవిలో ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూసేందుకు అధికారులు పటిష్ట చర్యలు తీసుకుంటున్నారు. తెలంగాణ తాగు నీటి సరఫరా పథకంలో భాగంగా ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల్లోని 1202 గ్రామాలకు ఒక్కో వ్యక్తికి రోజుకు వంద లీటర్ల చొప్పున, ఆదిలాబాద్, నిర్మల్, భైంసా మున్సిపాలిటీల పరిధిలో ఒక్కో వ్యక్తికి రోజుకు 135 లీటర్ల చొప్పున సురక్షిత నీటిని అందించాలనే లక్ష్యంతో 1778 కోట్ల రూపాయల అంచనా వ్యయంతో చేపట్టిన పనులు తుది దశకు చేరుకున్నాయి. ఎస్‌ఆర్‌ఎస్‌పి నుంచి ఆదిలాబాద్, నిర్మల్, ఖానాపూర్ నియోజకవర్గాల్లోని 954 గ్రామాలకు నీటిని అందించనుండగా, గడ్డెన్నవాగు ప్రాజెక్టు ద్వారా ముథోల్ నియోజకవర్గంలోని 248 గ్రామాలకు నీటిని అందించేందుకు చర్యలు చేపట్టారు. ఇప్పటికే 90 శాతం గ్రామాలకు నీటిని సరఫరా చేస్తుండగా, మిగిలిన గ్రామాలకు సైతం త్వరితగతిన నీటిని అందించే దిశగా పనులను వేగవంతం చేస్తున్నారు. నిర్మల్ నియోజకవర్గంలో 209 గ్రామాలకు గాను 200 గ్రామాలకు, ముథోల్ నియోజకవర్గంలో 248 గ్రామాలకు గాను 242 గ్రామాలకు, బోథ్ నియోజకవర్గంలో 480 గ్రామాలకుగాను 443 గ్రామాలకు, ఆదిలాబాద్ నియోజకవర్గంలో 254 గ్రామాలకు గాను 220 గ్రామాలకు, ఖానాపూర్ నియోజకవర్గంలో 11 గ్రామాలకు గాను 11 గ్రామాలకు నీటిని అందిస్తున్నట్లు సంబంధిత అధికారులు వెల్లడించారు. మిగిలిన గ్రామాల్లోనూ నీటిని అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని స్పష్టం చేశారు. ఇదిలాఉంటే మిషన్ భగీరథ పథకం కింద ఇంటింటికీ నీటిని అందిస్తుండడంతో గ్రామీణ ప్రాంత ప్రజలు తమ కష్టాలు దూరమయ్యాయని పేర్కొంటున్నారు. ప్రధానంగా నార్నూర్, సిరికొండ, ఇచ్చోడ, నేరడిగొండ మండలాల్లోని మారుమూల గ్రామాలలో ప్రతి ఏటా తీవ్ర నీటి ఎద్దడి ఏర్పడి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వచ్చేది. మంచి నీటితో పాటు ఇతరత్రా అవసరాల కోసం వాగులు, వ్యవసాయ బావులు, చెలిమెలను ఆశ్రయించాల్సిన పరిస్థితులు నెలకొనేవి. కలుషిత నీటిని తాగడంతో వ్యాధుల బారిన పడి తీవ్ర ఇబ్బందులు పడాల్సిన పరిస్థితులు నెలకొనేవి. ఇలాంటి పరిస్థితుల్లో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేసినప్పటికీ అవసరం మేరకు నీరు లభించక అవస్థలు పడేవారు. దీంతోపాటు వర్షాకాలం ప్రారంభంలో కలుషితమైన నీటిని సేవించడంతో డయేరియా, అతిసార లాంటి వ్యాధుల బారిన పడి ఆసుపత్రుల పాలయ్యేవారు. ఈ విషయాలన్నింటిని పరిగణలోకి తీసుకున్న ప్రభుత్వం సురక్షిత నీటిని అందించేందుకు చర్యలు తీసుకోవడంతో ప్రజల కష్టాలు దూరం కానున్నాయని అంటున్నారు.

మద్యం సీసాతో దాడిచేసి హతమార్చిన స్నేహితులు



మన తెలంగాణ/బాలాపూర్ : నేరచరిత్ర కలిగిన స్నేహితుడి బెదిరింపులు, అసభ్య పదజాలంతో కూడిన దూషణలను భరించలేక మద్యం సేవించిన అనంతరం అదే సీసాతో అతనిపై దాడిచేసి స్నేహితులే ఓ యువకుడిని హతమార్చిన సంఘటన ఆదివారం రాత్రి నగర శివార్లలోని బాలాపూర్ పోలీస్‌స్టేసన్ పరిధిలో జరిగింది. వివరాల ప్రకారం.. బాలాపూర్ అలీనగర్‌లో నివసించే ఇఫ్తకార్ మోబిన్ భార్య పుట్టింటికి వెళ్లడంతో అతని ఇంట్లో పార్టి చేసుకోవడానికి స్నేహితులు హస్సేన్‌బిన్ అమ్మద్‌సాది, చాంద్‌వహలాన్, అజీజ్‌లు వచ్చారు. నలుగురు కలిసి మద్యం సేవించిన అనంతరం ఎప్పటినుంచో నిన్ను చంపుతానంటూ అజీజ్‌ను బెదిరిస్తున్న అహ్మద్‌సాది మద్యం మత్తులో పరుష పదజాలంతో అజీజ్‌ను దూషించసాగాడు. ఇది భరించలేని అజీజ్ ఆగ్రహావేశాలకులోనై అక్కడే ఉన్న మద్యం సీసాతో అహ్మద్‌సాదిపై బలంగా దాడి చేశాడు. అనంతరం ఇఫ్తకార్‌మోబిన్ సైతం అహ్మద్‌సాది తలపై బండరాయితో మోదగా అతను అక్కడికక్కడే ప్రాణాలు విడిచాడు. కాగా సాది మృతదేహానికి దుప్పటి చుట్టి అక్కడి నుండి తరలించాలని ప్రయత్నించిన స్నేహితులు పోలీసులకు హత్యకు సంబంధించిన సమాచారం అప్పటికే అందిందని తెలుసుకొని సాది మృతదేహాన్ని మోబిన్ ఇంట్లోనే విడిచి పరారయ్యారు. సంఘటనా స్థలాన్ని పరిశీలించి ప్రాథమిక ఆధారాలు సేకరించిన బాలాపూర్ ఇన్‌స్పెక్టర్ వి.సైదులు కేసు దర్యాప్తులో ఉన్నట్లు తెలిపారు.

> ఇళయరాజా నా హెడ్‌మాస్టర్. ఆయన నుంచి చాలా నేర్చుకున్నా. మా ఇద్దరికీ ఓ చెడ్డ అలవాటు ఉంది. అదే సంగీతం. నాకు అవార్డు ప్రకటించినప్పటి కన్నా ఇళయరాజా ప్రశంసించినప్పుడే చాలా సంతోషపడుతుంటా. ఎందుకంటే ఆయన అంత తేలిగ్గా ఎవరినీ మెచ్చుకోరు.
> – స్టార్ మ్యూజిక్ డైరెక్టర్ ఏ.ఆర్.రెహమాన్

సినిమా


మహేష్‌బాబు, అనిల్ రావిపూడి

క్రేజీ కాంబినేషన్‌లో..?



మొన్నటి దాకా ఓ గ్యారెంటీ హిట్ మాస్ డైరెక్టర్‌గా పేరున్న అనిల్ రావిపూడికి 'ఎఫ్ 2' చిత్ర విజయం తర్వాత రేంజ్ అమాంతం పెరిగిపోయింది. ఇండస్ట్రీ టాప్ 10 హిట్స్‌లోకి వెంకటేష్, వరుణ్‌తేజ్‌ను తీసుకెళ్లిన ఘనతతో పాటు నిర్మాత దిల్‌రాజు బ్యానర్‌లోనే అతి పెద్ద బ్లాక్‌బస్టర్ హిట్ ఇచ్చిన దర్శకుడిగా ఆయన పేరు తెచ్చుకున్నారు. 'ఎఫ్ 2' విడుదలై పాతిక రోజులకు దగ్గరవుతున్నా ఇంకా మంచి కలెక్షన్లతో ఈ చిత్రం దూసుకుపోతోంది. ఇకపోతే ఇలాంటి సక్సెస్ వచ్చినప్పుడు ఎవరికైనా ఆఫర్ల తాకిడి ఎక్కువగా ఉంటుంది. అందులోనూ స్టార్స్‌ను డీల్ చేసిన అనిల్ రావిపూడి లాంటి వాళ్లకు మరీ ఎక్కువ. అయితే అనిల్ తన నెక్స్ట్ సినిమాను ఎవరితో చేయబోతున్నారనేది తెగ ఆసక్తిని రేపుతోంది. త్వరలోనే మహేష్‌బాబుతో అనిల్ రావిపూడి జత కట్టవచ్చు అనే టాక్ ఫిలింనగర్‌లో మొదలైంది. నిర్మాత అనిల్ సుంకరతో ఏఎంబి జాయింట్ వెంచర్‌గా ఈ ప్రాజెక్ట్‌ను ప్లాన్ చేస్తున్నారట. అయితే మైత్రీ సంస్థలో సుకుమార్ దర్శకత్వంలో మహేష్ చేయాల్సిన సినిమా స్క్రిప్ట్ వర్క్ జరుగుతోంది. అది పూర్తయితే కానీ ఈ సూపర్‌స్టార్ మరో సినిమా చేయరు. కాబట్టి ఎంత లేదన్నా అనిల్ రావిపూడి చిత్రానికి ఏడాదికి పైగానే సమయం పడుతుంది. మరి ఈ దర్శకుడు అప్పటిదాకా ఎదురు చూస్తారా? ఈలోపు 'ఎఫ్ 3' సబ్జెక్ట్‌ను సిద్ధం చేయాల్సిన బాధ్యత కూడా అనిల్ మీద ఉంది. ఇక నిర్మాత సాహుకు ఈ దర్శకుడు ఓ కమిట్‌మెంట్ ఇచ్చారని చెప్పుకుంటున్నారు. ఈ నేపథ్యంలో మహేష్‌తో మూవీ చేయాలంటే అనిల్ రావిపూడి కొంత కాలం ఎదురు చూడాల్సి ఉంటుంది.

అనేక ట్విస్ట్‌లతో భారీ మల్టీస్టారర్



హైదరాబాద్ శివార్లలోనే షూటింగ్ జరుపుకుంటున్న 'ఆర్ఆర్ఆర్' గురించి ఏ చిన్న లీక్ కూడా బయటకు రాకుండా చాలా జాగ్రత్తలు తీసుకుంటున్నారు దర్శకుడు రాజమౌళి. ప్రస్తుతం ఈ చిత్రం రెండో షెడ్యూల్ నిరాటంకంగా కొనసాగుతోంది. ఎన్టీఆర్, రామ్‌చరణ్ కాంబినేషన్‌లో రూపొందుతున్న ఈ చిత్రం షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. అయితే 'ఆర్ఆర్ఆర్' థీమ్ గురించి చాలా రోజుల నుంచి పలు కథనాలు ప్రచారంలో ఉన్న సంగతి తెలిసిందే. 1940 బ్యాక్‌డ్రాప్‌లో ఒక హీరో జమీందార్‌గా మరొక హీరో పేదవాడిగా కనిపిస్తే... వర్తమానంలో అవే పాత్రలు రివర్స్‌లో ఉంటాయని చాలా కథనాలు వచ్చాయి. అయితే మరికొన్ని ఆసక్తికరమైన విషయాలు ఇప్పుడు బయటకు వస్తున్నాయి. వాటి ప్రకారం ఇందులో తారక్, చరణ్ పాత్రలు ఒక జన్మలో స్నేహితులుగా ఉంటే ... మరో జన్మలో అన్నదమ్ములుగా కనిపిస్తారట. అయితే వాళ్లు విడిపోయే కారణాలు మాత్రం చాలా బలంగా ఉంటాయట. మాస్‌ను అలరించే విధంగా హీరోయిజాన్ని రాసుకోవడంలో తల పండిపోయిన రాజమౌళికి ఒకేసారి ఇద్దరు స్టార్లు దొరికితే ఇంకేముంది ఆయన తన విశ్వరూపం చూపిస్తారు. మొత్తానికి 'ఆర్ఆర్ఆర్' చిత్రం షూటింగ్ సమయంలోనే ఇంత హంగామా చేస్తోందంటే ఇక చిత్రీకరణ పూర్తయి రిలీజ్ డేట్ దగ్గర పడేకొద్ది ఏమేరకు హల్‌చల్ చేస్తుందో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఇక ఈ చిత్రానికి సంగీతాన్ని అందించే పనిలో కీరవాణి బిజీగా ఉన్నారు.

అవన్నీ పక్కన పెట్టేసి...


శృతిహాసన్

ప్రయోగాత్మక సినిమాల్లో నటించే కొంత మంది నటీనటులు కథకు అవసరమైన విధంగా తమ శరీరాకృతిని మార్చుకుంటున్నారు. హీరోలతో పాటు హీరోయిన్లు కూడా కొందరు తమ శరీరాకృతిని మార్చుకోవడానికి కష్టపడుతున్నారు. అందంగా కనిపిస్తూనే పాత్రకు తగినట్లుగా కొత్త లుక్‌లో కనపడేందుకు హీరోయిన్‌లు ప్రయత్నిస్తున్నారు. అయితే పాత్రకు తగ్గట్లుగా బాడీని మెయింటేన్ చేయడం చాలా కష్టమని అంటోంది అందాల తార శృతిహాసన్. తండ్రి కమల్‌హాసన్‌కు తగ్గ తనయురాలిగా సౌత్‌లో తనకంటూ ఓ క్రేజ్‌ను ఏర్పరచుకున్న ఈ భామ తెలుగు, తమిళ్‌లో పలువురు స్టార్ హీరోలతో కలిసి నటించింది. అయితే ఈమధ్యన శృతిహాసన్ పెద్దగా సినిమాలు చేయడం లేదు. ఇక ఈ అమ్మడు సినిమాల్లోకి రాకముందు చాలా బొద్దుగా ఉండేది. కానీ సినీ ప్రపంచంలోకి అడుగుపెట్టిన తర్వాత స్లిమ్‌గా మారింది. "సినిమాల్లోకి వచ్చిన కొత్తలో సిల్వర్ స్క్రీన్‌పై అందంగా కనిపించేందుకు చాలా కష్టపడ్డాను. పాత్రకు తగ్గట్లుగా శరీరాకృతిని మార్చుకునేదాన్ని. ఇప్పుడు అవన్నీ పక్కన పెట్టేసి నాలాగా ఉండగలుగుతున్నాను. పాత్రకు నటనాపరంగా న్యాయం చేయగలిగితేనే ప్రేక్షకులు ఆదరిస్తారని భావిస్తున్నాను"అని శృతిహాసన్ చెప్పింది.

అసలు పెళ్లే చేసుకోను!


సాయి పల్లవి

మలయాళ చిత్రం 'ప్రేమమ్'తో ఒక్కసారిగా ఎంతో పాపులర్ అయిన తార సాయి పల్లవి. ఈ చిత్రం ద్వారా వచ్చిన క్రేజ్‌తో ఈ భామకు వరుసగా మంచి ఆఫర్లు వచ్చాయి. తెలుగులో 'ఫిదా' చిత్రంతో ఈ భామ బ్లాక్‌బస్టర్ హిట్‌ను అందుకుంది. శేఖర్ కమ్ముల దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రంతో టాలీవుడ్‌లో ఈ అమ్మడికి మంచి క్రేజ్ వచ్చింది. ఆతర్వాత తెలుగులో వరుసగా సినిమాలు చేస్తోంది ఈ భామ. ప్రస్తుతం తెలుగుతో పాటు తమిళ్ చిత్రాల్లో నటిస్తోంది సాయిపల్లవి. హీరోయిన్‌గా మంచి ఇమేజ్‌ను దక్కించుకున్న ఈ భామ పెళ్లిపై స్పందించిన తీరు అందరినీ షాక్‌కు గురిచేసింది. పెద్దలు కుదిర్చిన పెళ్లి చేసుకుంటావా? ప్రేమ వివాహం చేసుకుంటావా? అని ప్రశ్నించగా సాయి పల్లవి వెరైటీగా సమాధానమిచ్చింది. "నేను అసలు పెళ్లే చేసుకోను" అని చెప్పింది. జీవితాంతం తల్లిదండ్రులతోనే ఉంటూ వారిని కంటికి రెప్పలా చూసుకుంటానంటోంది ఈ అమ్మడు. అందుకే పెళ్లికి దూరంగా ఉండాలని భావిస్తోంది. పెళ్లిపై అమ్మడు స్పందించిన తీరుకు అభిమానుల నుంచి మిశ్రమ స్పందన లభించింది. ఇక వైద్య విద్యను అభ్యసించిన ఈ బ్యూటీ... గతంలో కొన్ని ఛానళ్లలో డ్యాన్స్ పోటీల్లోనూ పాల్గొంది. మంచి డ్యాన్సర్ అయిన సాయి పల్లవికి ఇప్పుడు సౌత్‌లో హీరోయిన్‌గా మంచి పాపులారిటీ ఉంది.

మిత్రుడు ఎంత ముఖ్యమో శత్రువూ అంతే ముఖ్యం

శివకార్తికేయ, కీర్తి సురేష్, సమంత ప్రధాన తారాగణంగా సాయికృష్ణ ఫిలింస్ బ్యానర్‌పై లక్ష్మి పెండ్యాల సమర్పణలో సాయికృష్ణ పెండ్యాల నిర్మిస్తున్న చిత్రం 'సీమరాజా'. ఈ చిత్రం డబ్బింగ్ పనులు పూర్తిచేసుకొని క్లీన్ 'యు' సర్టిఫికెట్‌తో ఈనెల 8న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో ఏర్పాటైన విలేకరుల సమావేశంలో నిర్మాత సాయికృష్ణ పెండ్యాల మాట్లాడుతూ "నిర్మాతగా ఇది నా నాలుగవ చిత్రం. ఈ సినిమాలోని 'మనిషి బ్రతకడానికి మిత్రుడు ఎంత ముఖ్యమో శత్రువు కూడా అంతే ముఖ్యం' అన్న డైలాగ్ చాలా నచ్చింది. అందుకే ఈ చిత్రాన్ని తెలుగులో విడుదల చేస్తున్నాను. ఈ చిత్రానికి చంద్రబోస్, వెన్నెలకంటితో పాటలు రాయించాము. శ్రేయా ఘోషల్‌తో ఒక పాట పాడించాము. ఈ చిత్రం చూస్తే ఎక్కడా కూడా డబ్బింగ్ సినిమా చూస్తున్నామనే ఫీలింగ్ కలగదు. ట్రైలర్‌కు మంచి స్పందన వస్తోంది.



ఇందులో సమంత మెయిన్ హీరోయిన్‌గా అద్భుతంగా నటించింది. శివకార్తికేయన్ నటన హైలైట్‌గా ఉంటుంది. సిమ్రాన్ తొలిసారిగా ఇందులో విలన్‌గా చేసింది. సినిమాలో చాలా పవర్‌ఫుల్ డైలాగ్స్ ఉంటాయి. ఇక అల్లరి చిల్లరగా తిరిగే రాజ కుటుంబీకుడిగా హీరో శివకార్తికేయన్ కనిపిస్తాడు. ఈ చిత్రాన్ని దాదాపు 400 థియేటర్లలో విడుదల చేస్తున్నాం"అని అన్నారు.

'అర్జున్ సురవరం'గా నిఖిల్


నిఖిల్

నిఖిల్, లావణ్య త్రిపాఠి జంటగా నటిస్తున్న చిత్రం 'అర్జున్ సురవరం'. ఈ చిత్రానికి ముందుగా 'ముద్ర' అనే టైటిల్ ఖరారు చేసినా ఇప్పుడు ఆ టైటిల్‌ను 'అర్జున్ సురవరం'గా మార్చారు ఫిల్మ్‌మేకర్స్. తాజాగా ఈ చిత్ర టైటిల్ లోగో విడుదలైంది. ఈ టైటిల్ లాంచ్ కార్యక్రమంలో నిఖిల్, లావణ్య త్రిపాఠి, దర్శకుడు సంతోష్, నిర్మాతలు పాల్గొన్నారు. యూరప్‌లో చివరి పాట చిత్రీకరణతో షూటింగ్ పూర్తి చేసుకుంది ఈ చిత్రం. పోస్ట్‌ప్రొడక్షన్ పనుల్లో బిజీగా ఉన్న ఈ చిత్రాన్ని మార్చి 29న విడుదల చేస్తామని ఫిల్మ్‌మేకర్స్ ప్రకటించారు. ఇందులో జర్నలిస్ట్‌గా నటిస్తున్నారు నిఖిల్. వెన్నెల కిషోర్, పోసాని కృష్ణమురళి, నాగినీడు, ప్రగతి, సత్య, తరుణ్ అరోరా, రాజా రవీంద్ర ఈ చిత్రంలో ముఖ్య పాత్రల్లో నటిస్తున్నారు. ఔరా సినిమాస్ పివిటి, మూవీ డైనమిక్స్ ఎల్‌ఎల్‌పి బ్యానర్లపై కావ్య వేణుగోపాల్, రాజు కుమార్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. బి.మధు అర్జున్ సురవరం ఈ చిత్రాన్ని సమర్పిస్తున్నారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీః సూర్య, సంగీతంః స్యామ్ సిఎస్, ఆర్ట్ః సాహి సురేష్, ఫైట్స్ః వెంకట్.


త్రిష

ఆమెతో వృత్తిపరమైన పోటీ ఉంది

టాలీవుడ్, కోలీవుడ్‌లో దశాబ్దానికి పైగా టాప్ హీరోయిన్‌గా రాణిస్తున్న బ్యూటీ త్రిష. తెలుగు, తమిళ్ భాషల్లో పలువురు స్టార్ హీరోలతో ఎన్నో హిట్ సినిమాల్లో నటించి టాప్ హీరోయిన్‌గా ప్రేక్షకుల హృదయాల్లో తనకంటూ ఓ ప్రత్యేక స్థానాన్ని ఏర్పరచుకుంది. తన కెరీర్‌లో పలువురు హీరోయిన్‌లతో పోటీపడుతూ విజయాలను అందుకుంది ఈ భామ. ఈనేపథ్యంలో నయనతారతో తనకు వృత్తిపరమైన పోటీ ఉందని చెప్పింది త్రిష. "నయనతార, నేను దశాబ్దానికి పైగా సినిమాల్లో నటిస్తున్నాం. మా మధ్య స్నేహపూర్వకమైన పోటీ ఉంది. కానీ మా మధ్య పలువురు ఆరోపిస్తున్నట్టు ఎటువంటి విభేదాలు లేవు. మేం కలిసినప్పుడల్లా సరదాగా ముచ్చటించుకుంటాం. కానీ నయనతారనే నాకు పెద్ద పోటీ. అయితే ఎప్పటికప్పుడు మేమిద్దరం 'ఆల్ ది బెస్ట్' చెప్పుకుంటాం"అని చెప్పింది ఈ అందాల తార.

అన్యాయాలు, అక్రమాలపై పోరాడే విద్యార్థి నాయకుడు

నటుడు, నిర్మాత, దర్శకుడు పి.సత్యారెడ్డి తన తనయుడు మనీష్ బాబును హీరోగా పరిచయం చేస్తూ రాజా వన్నెం రెడ్డి దర్శకత్వంలో జనం ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై నిర్మిస్తున్న చిత్రం 'ప్రశ్నిస్తా'. ఈ చిత్రం లోగో లాంచ్ కార్యక్రమం హైదరాబాద్‌లోని ప్రసాద్‌ల్యాబ్‌లో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో నిర్మాతలు బెల్లంకొండ సురేష్, సి.కళ్యాణ్, టి.ప్రసన్నకుమార్, దాసరి కిరణ్, తుమ్మలపల్లి రామసత్యనారాయణ, అభిషేక్ అగర్వాల్, హీరోహీరోయిన్లు మనీష్‌బాబు, అక్షిత, హసీనా మస్తాన్ మీర్జా, సత్యారెడ్డి, రాజా వన్నెం రెడ్డి, మాటల రచయిత రాజేంద్ర కుమార్, సంగీత దర్శకుడు వెంగి, సతీష్ రెడ్డి, శేషుబాబు, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సి.కళ్యాణ్ మాట్లాడుతూ "తన తనయుడు మనీష్‌ను హీరోగా పరిచయం చేస్తూ సత్యారెడ్డి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. సినిమా టైటిల్ చాలా బాగుంది. మంచి టెక్నీషియన్స్ ఈ సినిమాకు పనిచేస్తున్నారు. ఈ సినిమా సూపర్ హిట్ అయి మనీష్ మరిన్ని మంచి సినిమాలు చేయాలి"అని అన్నారు. నిర్మాత పి.సత్యారెడ్డి మాట్లాడుతూ "రాజా వన్నెం రెడ్డి మంచి కథతో అద్భుతంగా ఈ సినిమా చేస్తున్నారు. సమాజంలో జరుగుతున్న అన్యాయాలు, అక్రమాలు, ప్రభుత్వ విధానాల మీద ఓ విద్యార్థి నాయకుడు ఏవిధంగా పోరాడాడు? ఎలా ప్రశ్నించాడు? అనేది ఈ సినిమా కథ. మా అబ్బాయిని, ఈ సినిమాను ఆదరించాలని కోరుకుంటున్నాను"అని తెలిపారు. దర్శకుడు రాజా వన్నెం రెడ్డి మాట్లాడుతూ "నేటి ట్రెండ్‌కు తగ్గట్టు ఈ సినిమా ఉంటుంది. సత్యారెడ్డి క్వాలిటీకి వెనుకాడకుండా ఈ సినిమాను నిర్మించారు. తప్పకుండా మనీష్ మంచి హీరో అవుతాడు"అని చెప్పారు. హీరో మనీష్‌బాబు మాట్లాడుతూ హీరోగా తనకు మంచి పేరు తెచ్చే చిత్రమిదని అన్నారు.


అక్షిత, మనీష్‌బాబు, హసీనా మస్తాన్


మమ్ముట్టి

వైఎస్ఆర్ పోరాట పటిమ ఎంతో మందికి ఆదర్శం

వైఎస్ రాజశేఖర్ రెడ్డి చేపట్టిన పాదయాత్ర ఆధారంగా మహి వి.రాఘవ్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'యాత్ర'. ఈనెల 8న ఈ చిత్రాన్ని ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా రిలీజ్ చేసేందుకు నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు. వైఎస్ఆర్ పాత్రలో మలయాళ సూపర్‌స్టార్ మమ్ముట్టి అద్భుతంగా నటించారు. 70 ఎంఎం ఎంటర్‌టైన్‌మెంట్స్, నిర్వాణ సంస్థలు అమెరికాలోని సీటెల్‌లో 'యాత్ర' ప్రీమియర్ షో మొదటి టికెట్‌ను వేలం వేశాయి. ఈ వేలంలో మునీశ్వర్ రెడ్డి 6,116 డాలర్లకు (దాదాపు 4.37 లక్షలు) మొదటి టికెట్‌ను గెలుచుకున్నారు. అయితే 12 డాలర్ల విలువ చేసే టికెట్‌ను అతనికి అందించి మిగతా డబ్బులను వైఎస్ఆర్ ఫౌండేషన్‌కు విరాళంగా ఇస్తామని నిర్మాతలు తెలిపారు. రాజన్న క్యాంటీన్స్, వాటర్ ప్లాంట్స్ కోసం ఈ డబ్బును వెచ్చించనున్నారు. ఈ సందర్భంగా చిత్ర నిర్మాతలు విజయ్ చిల్లా, శశి దేవిరెడ్డి మాట్లాడుతూ "వైఎస్ఆర్ పాత్రలో మమ్ముట్టి నటించిన 'యాత్ర' చిత్రాన్ని ఈనెల 8న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా రిలీజ్ చేస్తున్నాం. ఈ సినిమాపై భారీ అంచనాలున్నాయి. వైఎస్ రాజశేఖర్ రెడ్డి రాజకీయ ప్రయాణంలో ఆయన చేసిన పాదయాత్ర చరిత్రలో నిలిచిపోయింది. వైఎస్ఆర్ పోరాట పటిమ ఎంతో మందికి ఆదర్శంగా నిలిచింది. వైఎస్ఆర్ పాదయాత్రలో జరిగిన వాస్తవిక, భావోద్వేగ సంఘటనలతో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాం"అని అన్నారు. మమ్ముట్టి, రావు రమేష్, జగపతి బాబు, సుహాసిని, అనసూయ, పోసాని, సచిన్ కద్కర్, వినోద్ కుమార్ జీవా, 30 ఇయర్స్ పృథ్వీ ప్రధాన పాత్రల్లో నటించిన ఈ చిత్రానికి సినిమాటోగ్రాఫర్ః సత్యన్ సూర్యన్, మ్యూజిక్ః కె, ఎడిటర్ః శ్రీకర్ ప్రసాద్, సాహిత్యంః సిరివెన్నెల సీతారామశాస్త్రి.

మన తెలంగాణ
హైదరాబాద్
మంగళవారం 5 ఫిబ్రవరి 2019
www.manatelangana.news

వడ్డీ రేటులో పావు శాతం కోత

ఆర్‌బిఐ సమీక్షపై ఎస్‌బిఐ అంచనా

న్యూఢిల్లీ : ఆర్‌బిఐ ఈసారి కూడా యథాతథంగా వడ్డీ రేట్లను కొనసాగించవచ్చని పలువురు నిపుణులు అంచనా వేసినప్పటికీ దీనికి విరుద్ధంగా ఎస్‌బిఐ స్పందించింది. ఆర్‌బిఐ వడ్డీ రేటులో 25 బేసిస్ పాయింట్ల మేర కోత విధించే అవకాశాలు ఉన్నాయని ఎస్‌బిఐ నివేదిక అంచనా వేసింది. ద్రవ్యోల్బణం తగ్గుముఖం పట్ట డం, ఇతర అంశాలు సానుకూలంగా ఉండడం వల్ల రేటులో కోత ఉండవచ్చని చెప్పింది. ఆర్‌బిఐ గవర్నర్ శక్తికాంతదాస్ నేతృత్వంలోని ఆరుగురు సభ్యులు ద్రవ్య విధాన కమిటీ (ఎంపిసి) ముంబైలో ఫిబ్రవరి 7న సమీక్ష వివరాలను ప్రకటించనుంది. ఫిబ్రవరిలో ఆర్‌బిఐ తన వైఖరి మార్చుకొంటుందని అంచనా వేస్తున్నామని ఎస్‌బిఐ తెలిపింది. గతంలో మూడుసార్లు ఆర్‌బిఐ వడ్డీ రేటు విషయంలో యథాతథ స్థితి కొనసాగించింది.

ఆర్‌బిఐ సమీక్ష సమయంలో మార్పు

ఆర్‌బిఐ(భారతీయ రిజర్వు బ్యాంక్) పరపతి విధాన సమీక్ష ఈ నెల 5 నుంచి 7 వరకు జరగనుంది. పరపతి నిర్ణయాలను వెల్లడించే సమయాన్ని మార్పు చేసినట్టు ఆర్‌బిఐ వెబ్‌సైట్‌లో పేర్కొంది. గురువారం ఉదయం 11.45 గంటలకు ఆర్‌బిఐ నిర్ణయాలను ప్రకటిస్తుందని రిజర్వు బ్యాంక్ వెబ్‌సైట్‌లో పేర్కొంది. గత కొద్ది సమీక్షా సమావేశాల నిర్ణయాల్ని మధ్యాహ్నం 2.30 గంటలకు వెలువరిస్తూ వచ్చిన ఆర్‌బిఐ, ఈసారి మార్పు చేసింది. వేళల మార్పునకు కారణాలు తెలియరాలేదు. కాగా ఈసారి కూడా ఆర్‌బిఐ వడ్డీ రేట్లను యథాతథంగానే కొనసాగించే అవకాశముందని నిపుణులు అంచనా వేస్తున్నారు. ద్రవ్యోల్బణం దిగివచ్చినప్పటికీ ఆర్థిక సవాళ్లు, క్రూడ్ ఆయిల్ ధరలు పెరిగిన కారణంగా ఈవారంలో ఆర్‌బిఐ వడ్డీ రేట్లను యథాతథంగానే కొనసాగించవచ్చని అంటున్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2018–19)లో ఆర్‌బిఐ ఆరో ద్వైపాక్షిక పరపతి సమీక్ష సమావేశాలు 5న(మంగళవారం) ప్రారంభవనున్నాయి. అనంతరం 7వ తేదీన ముగుస్తాయి. గత సమీక్షలో రిజర్వు బ్యాంక్ రేట్లను యథాతథంగానే కొనసాగించింది. దీంతో ప్రస్తుతం రెపో 6.25 శాతంగా అమలవుతోంది. రివర్స్ రెపో 6.25 శాతం వద్ద కొనసాగుతోంది. ఎంఎస్‌ఎఫ్, బ్యాంక్ రేటు 6.75 శాతంగా ఉంది.

షేర్ల బైబ్యాక్‌కు కోల్ ఇండియా ఆమోదం



ముంబై : షేర్ల బైబ్యాక్‌కు కోల్ ఇండియా బోర్డు డైరెక్టర్లు ఆమోదం తెలిపారు. షేరు ధర రూ.235 వద్ద 4.46 కోట్ల షేర్ల బైబ్యాక్ ప్రతిపాదనకు బోర్డు అంగీకరించిందని రెగ్యులేటరీ ఫైలింగ్‌లో కంపెనీ వెల్లడించింది. ఈ బైబ్యాక్ విలువ రూ.1,050 కోట్లు మించకుండా ఉంటుంది. ప్రస్తుతం బిఎస్‌ఇలో క్లోజింగ్ రేటు రూ.222 కంటే 6 శాతం ఎక్కువగా బైబ్యాక్ ధర ఉంది. అంటే కంపెనీ దాదాపు 0.72 శాతం వాటాలను తిరిగి కొనుగోలు చేస్తోంది. దీని ప్రకారం, కోల్ ఇండియాలో కేంద్ర ప్రభుత్వం వాటా 72.90 శాతం, మిగతా పబ్లిక్ వద్ద ఉంటుంది.


స్టాక్ మార్కెట్

ఈ రోజు మార్కెట్ ముగింపు		మార్పు	%
సెన్సెక్స్	36,582.74	113.31	(0.31%)
నిఫ్టీ	10,912.25	18.60	(0.17%)

కరెన్సీ మారక రేట్లు

అమెరికన్ డాలర్	71.47
యూరో	81.86
బ్రిటిష్ పౌండ్	93.47
ఆస్ట్రేలియన్ డాలర్	51.75
కెనడియన్ డాలర్	54.61
సింగపూర్ డాలర్	52.88
స్విస్ ఫ్రాంక్	71.73
చైనీస్ యువాన్	10.60
మలేషియన్ రింగిట్	17.48
న్యూజిలాండ్ డాలర్	49.33
హాంకాంగ్ డాలర్	9.11
జపనీస్ యెన్	0.65
కువైట్ దినార్	235.87
సౌతాఫ్రికన్ రాండ్	5.36

బులియన్



బంగారం ధర

నగరం	ధర (రూ / 10 గ్రాములు)		
	22 క్యారట్	24 క్యారట్	మార్పు(%)
చెన్నై	31810	34021.39	0.41%
ముంబై	32490	34748.66	0%
ఢిల్లీ	32500	34759.36	0.31%
కోల్‌కతా	32820	35101.60	0.15%
కేరళ	31100	33262.03	0.65%
బెంగళూరు	31250	33422.46	0.16%
హైదరాబాద్	3181	3402.14	90.04%
గల్ఫ్	139.55	149.25	0.5%

వెండి ధర (రూ./ కిలో)

చెన్నై	₹ 43848.00
ముంబై	₹ 43848.00
ఢిల్లీ	₹ 43848.00
కోల్‌కతా	₹ 43848.00
హైదరాబాద్	₹ 43848.00



జోరుగా ఐటి నియామకాలు



- 9 నెలల్లో 70,000 ఉద్యోగాలు
- ఇన్ఫోసిస్, టిసిఎస్, విప్రో, హెచ్‌సిఎల్ టెక్‌లలో వ్యాపార వృద్ధి
- వచ్చే ఆర్థిక సంవత్సరంలోనూ మరిన్ని ఉద్యోగాలు : నివేదిక

న్యూఢిల్లీ : ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2018–19) ఐటి(ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ) పరిశ్రమలో నియామకాల జోరు కనిపిస్తోంది. గత ఆర్థిక సంవత్సరం(2017–18)తో పోలిస్తే మెరుగ్గా ఉన్నాయి. దేశీయంగా నాలుగు దిగ్గజ సాఫ్ట్‌వేర్ సేవల సంస్థల గణాంకాలను ఎకనమిక్ టైమ్స్ వార్తా సంస్థ పరిశీలించి, ఈ నివేదికను వెల్లడించింది. ప్రస్తుతం ఆర్థిక సంవత్సరం తొలి తొమ్మిది నెలల్లో టిసిఎస్(టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్), ఇన్ఫోసిస్, విప్రో, హెచ్‌సిఎల్ టెక్నాలజీస్‌లు మొత్తంగా 70,000 మందిని నియమించుకున్నాయి. 2017–18తో పోలిస్తే ఈ గణాంకాలు ఐదు రెట్లు ఎక్కువగా ఉన్నాయి. డిజిటల్ టెక్నాలజీలో వేగవంతమైన మార్పులు, సంప్రదాయ వ్యాపారాలపై ఒత్తిడి, ఆటోమేషన్, ప్రధాన మార్కెట్లలో రక్షణాత్మక విధానాలు పెరగడం వంటి కారణాలతో 2017–18లో ఈ నాలుగు సంస్థలు 13,972 మందిని మాత్రమే నియమించుకున్నాయి.



వ్యాపార వృద్ధి మెరుగైంది: టిసిఎస్

2018–19 తొలి 9 నెలల్లో 22,931 మంది ఉద్యోగులను నియమించుకోవడంపై టిసిఎస్ సీనియర్ ఎగ్జిక్యూటివ్ స్పందిస్తూ, వ్యాపార వృద్ధి మళ్లీ పుంజుకుందని, దీంతో రెండంకెల వృద్ధి రేటు దిశగా పయనిస్తున్నామన్నారు. ఈ సంవత్సరంలో టిసిఎస్ దాదాపు 28 వేల క్యాంపస్ ఆఫర్లను చేసింది. అంతకు ముందు సంవత్సరం ఇదే సమయంలో 3,657 మందికి మాత్రమే ఆఫర్ చేసినట్టు నివేదిక తెలిపింది. నియామకాల్లో గణనీయమైన వృద్ధి కనిపిస్తోందని, దీనికి కారణం వ్యాపార వృద్ధి అని టిసిఎస్ గ్లోబల్ హెచ్‌ఆర్ హెడ్ అజోయేంద్ర ముఖర్జీ అన్నారు. 'ముందుగా ఊహించనిదేమీ కాదని, ఎందుకంటే మా లక్ష్యం రెండంకెల వృద్ధిని సాధించడం. మేము మార్కెట్‌ను చూస్తున్నాం. ఇక్కడ అవకాశాలు పొందగలమని నమ్ముతున్నాం' అని ఆయన అన్నారు.



బిలియన్ డాలర్ల డీల్ పొందాం: ఇన్ఫోసిస్


తొలి మూడు త్రైమాసికాల్లో దేశీయ రెండో అతిపెద్ద ఐటి సేవల సంస్థ ఇన్ఫోసిస్ దాదాపు 21,398 మందిని నియమించుకుంది. అయితే అంతకుముందు సంవత్సరంలో ఈ సంస్థ నియామకాలు 3,743 మంది మాత్రమే. ఇన్ఫోసిస్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్(సిఒఒ) ప్రవీణ్ రావ్ మాట్లాడుతూ, గత మూడు త్రైమాసికాల్లో 1 బిలియన్ డాలర్ల విలువచేసే అతిపెద్ద డీల్‌ను పొందామని, ఇలాంటి డీల్స్ వచ్చే సంవత్సరాల్లోనూ రానున్నాయని అన్నారు.

క్యాంపస్ నియామకాలు రెట్టింపు: విప్రో

ఇదే విధంగా తొమ్మి నెలల కాలంలో హెచ్‌సిఎల్ టెక్, విప్రో కంపెనీలు కూడావరుసగా12,247మంది, 12,456 మంది నియామకాలు చేపట్టాయి. ఈ సంస్థలు కాలేజీ క్యాంపస్‌లకు వెళ్లి నియమాకాలుచేపట్టాయి. క్యాంపస్ సెలక్షన్లను రెట్టింపు చేయాలని విప్రో యోచిస్తోంది.

ఫోర్బ్స్ ఇండియా 'అండర్ 30'లో విజయ్ దేవరకొండ











ముంబై : ఫోర్బ్స్ ఇండియా '30 అండర్ 30' జాబితాలో టాలీవుడ్ రైజింగ్ స్టార్ విజయ్ దేవరకొండ స్థానం దక్కించుకున్నారు. ఇంకా అథ్లెట్ హిమ దాస్, వ్లోగర్ ప్రజక్త కోలి, క్రికెటర్ స్మృతి మంధన కూడా జాబిజాలో ఉన్నారు. ఫోర్బ్స్ ఇండియా విడుదల చేసిన ఆరో ఎడిషన్ జాబితాలో 30 మంది యువ విజేతలు.. వివిధ రంగాలకు చెందిన వారిని ఎంపిక చేశారు. 2019 సంవత్సరానికి వివిధ రంగాల్లో అద్భుత ప్రతిభ కనబర్చిన 30 ఏళ్ల లోపు వారు ఈ జాబితాలో ఉన్నారు. 2017లో అర్జున్‌రెడ్డి చిత్రం ద్వారా సంచలనం సృష్టించిన విజయ్ దేవరకొండ ఫోర్బ్స్ ఇండియా జాబితాలో చోటు పొందారు. వయస్సు 25 అయినా 52 ఏళ్లు అయినా సక్సెస్‌లను అభినందించడంతోపాటు, తక్కువ వయస్సులోనే విజయాలను అందుకున్నవారి ప్రతిభ, ధైర్యాన్ని గుర్తించడమే తమ లక్ష్యమని ఫోర్బ్స్ ఇండియా వెల్లడించింది. ఈ యువ జాబితాతో రూపొందించిన కథనాన్ని ఫిబ్రవరి 15న మ్యాగజైన్‌లో చూడొచ్చని ఫోరబ్స్ ఇండియా తెలిపింది. 16 కేటగిరీల్లో 300 పేర్లను పరిశీలించిన అనంతరం ఈ జాబితాను రూపొంచారు. మీడియా, క్రీడలు, మార్కెటింగ్, పరిశ్రమ, ఎంటర్‌టైన్మెంట్, హాస్పిటాలిటీ, టెక్నాలజీ రంగాల్లోని వారిని ఎంపిక చేసింది. మహిళా క్రికెట్ సంచలనం స్మృతి మంధన, ప్రముఖ అథ్లెట్ హిమాదాస్ ఈ జాబితాలో చోటు దక్కించుకున్నారు. వీరితోపాటు యూట్యూబ్ పర్సనాలిటీ ప్రజక్త కోలీ, సింగర్ మేఘన మిశ్రా, ఆయుష్ అగర్వాల్ లాంటివారి పేర్లున్నాయి. ఇంకా ఫైనాన్స్ సంస్థను నడుపుతున్న ఐఐటియన్లు వసంత్ కాంత్, అనురాగ్ శ్రీవాస్తవ, రోహన్‌గుప్త ఉన్నారు. ఇంకా నింజా కార్ట్ ద్వారా రైతులకు నేరుగా తమ ఉత్పత్తులను విక్రయించుకునే అవకాశం కల్పిస్తున్న కార్తీశ్వరన్, శరత్ లోగనాథన్, అశుతోష్ విక్రం తదితరులు జాబితాలో స్థానం పొందారు.

మూడు రెట్లు పెరిగిన ఐడిబిఐ బ్యాంక్ నష్టం



న్యూఢిల్లీ: మూడో త్రైమాసిక ఫలితాల్లో ఐడిబిఐ బ్యాంక్ అధ్వాన్నమైన పనితీరును చూపింది. డిసెంబర్ ముగింపునాటి క్యూ3 ఫలితాల్లో బ్యాంక్ భారీగా రూ. 4,185.48 కోట్ల నికర నష్టాన్ని నమోదు చేసింది. గతంతో పోలిస్తే నికర నష్టం మూడు రెట్లు పెరిగింది. బ్యాంకు ఇచ్చిన రుణాలు వసూలు కాకపోవడమే నష్టాలకు ప్రధాన కారణమని ఐడిబిఐ పేర్కొంది. గతేడాది ఇదే సమయంలో నికర నష్టం రూ.1,524.31 కోట్లుగా ఉంది. మొత్తం ఆదాయం గతంతో పోలిస్తే రూ.6,190 కోట్లకు తగ్గిందని బ్యాంక్ పేర్కొంది. నిరర్థక ఆస్తులు గతంలో 24.72 శాతం ఉండగా, ఈ ఈసారి 29 శాతం పెరిగాయి. అయితే ఎన్‌పిఎ(నిరర్థక ఆస్తులు) 14.01 శాతానికి తగ్గడం ఒక్కటే ఐడిబిఐ బ్యాంక్‌కు ఊరట కల్గించే విషయం. గతంలో ఈ ఎన్‌పిఎల శాతం 16.02 శాతంగా ఉంది. బ్యాంకుకు ఉన్న మొండి బకాయిలు రూ. 5,074.80 కోట్లకు పెరిగాయి. ఎన్‌పిఎల నుండి రికవరీలు రూ.3,440 కోట్లకు పెరిగాయి. గత సంవత్సరం ఈ రికవరీలు రూ. 537 కోట్లుగా ఉన్నాయి. కాగా బ్యాంక్‌కు గతంలో కేంద్ర ప్రభుత్వమే యజమానిగా ఉండేది. కాగా ప్రస్తుతం ఎల్‌ఐసి నూతనంగా యాజమాన్య పగ్గాలు చేపట్టింది. బ్యాంకులో ఎల్‌ఐసి వాటాలు ఈ జనవరి 21 నాటికి 51 శాతానికి చేరాయి

ఆఖరి గంటలో లాభాలు


113 పాయింట్లు పెరిగిన సెన్సెక్స్

న్యూఢిల్లీ : దేశీయ స్టాక్ మార్కెట్లు సోమవారం లాభాలను నమోదు చేశాయి. నష్టాలతో ప్రారంభమైన దేశీయ సూచీలు మధ్యాహ్నం నాటికి కోలుకున్నాయి. ఆటో, లోహ, ఎఫ్ఎంసిజి, ఫార్మా రంగాలు అమ్మకాల ఒత్తిడికి లోనవగా, మధ్యాహ్నం వరకు మార్కెట్లు నష్టాల్లోనే ట్రేడ్ అయ్యాయి. అయితే చివరి గంటలో బ్యాంక్, ఎనర్జీ, ఐటి రంగాల్లో కొనుగోళ్లు ఊపందుకోవడంతో సెన్సెక్స్ 113 పాయింట్లకు పైగా లాభపడింది. 36582.74 పాయింట్ల వద్ద స్థిరపడింది. ఇక నిఫ్టీ కూడా 18 పాయింట్లు లాభపడి 10,900 మార్కును దాటింది. సెన్సెక్స్ ఒకానొక దశలో తీవ్ర అమ్మకాల ఒత్తిడికి లోనైంది. మధ్యాహ్నం 12 గంటల సమయంలో దాదాపు 200 పాయింట్లకుపైగా నష్టాల్లో కొనసాగింది. ఆ తర్వాత ఆఖరి సమయంలో పుంజుకున్నాయి. ప్రధానంగా రిలయన్స్ ఇండస్ట్రీస్, ఒఎన్‌జిసి, బజాజ్ ఆటో, టిసిఎస్, కొటక్ మహీంద్రా బ్యాంక్ షేర్లు భారీ లాభాలను నమోదు చేశాయి. ఎన్‌ఎస్‌ఇలో యస్ బ్యాంక్, హిందాల్కో, హిందుస్థాన్ పెట్రోలియం, పవర్ గ్రిడ్, ఎన్‌టిపిసి షేర్లు నష్టపోయాయి.

పాతాళానికి ఆర్‌కామ్

ఒక్క రోజులోనే 35 శాతం పతనం

న్యూఢిల్లీ: రిలయన్స్ కమ్యునికేషన్స్(ఆర్‌కాం) అధినేత అనిల్ అంబానీ అప్పులను తీర్చేందుకు ఆర్‌కాం కంపెనీ దివాలా పిటిషన్ దాఖలు చేసేందుకు సిద్ధమయ్యారు. రూ.49 వేల కోట్ల మేరకు అప్పులను తిరిగి చెల్లించలేని పరిస్థితుల్లో ఉన్న ఆయన ఆఖరికి ఈ నిర్ణయానికి వచ్చారు. దీంతో సోమవారం ట్రేడింగ్ సెషన్‌లో కంపెనీ షేర్లు భారీగా నష్టపోయాయి. మార్కెట్ ఆరంభంలో ఆర్‌కామ్ షేరు ఒక దశలో 48 శాతం పతనమైంది. ఆ తర్వాత కోలుకొని దాదాపు 35 శాతం నష్టంతో రూ.7.55 వద్ద స్థిరపడింది. అడాగ్ గ్రూప్‌లోని ఐదు ప్రధానకంపెనీల షేర్ల పరిస్థితీ ఇలాగే ఉంది. రిలయన్స్‌హోం రూ.30.55 ,రిలయన్స్ నేవల్ ఇంజినీరింగ్ రూ.10.19, రిలయన్స్ నిప్పన్ లైఫ్ రూ.130.50, రిలయన్స్ పవర్ రూ.18.05ల వద్ద ముగిశాయి. ఈ ఐదు కంపెనీల షేర్లు ఆల్‌టైమ్ కనిష్ఠానికి దగ్గర్లో ఉన్నాయి. దివాల పరిష్కార ప్రక్రియకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు ఆర్‌కామ్ ఎక్స్‌ఛేంజిలకు సమాచారం ఇవ్వడంతో వాటి షేర్లు భారీగా పతనమయ్యాయి. కాగా అనిల్ అంబానీ వేల కోట్ల అప్పుల్లో మునిగి ఉంటే, అదే సమయానికి అన్న ముఖేష్ అంబానీ తన 4జి, జియో నెట్‌వర్క్‌లతో దూసుకెళ్తున్నారు. 2017 జూన్‌లో అనిల్ అంబానీ తన కున్న అప్పులను కోర్టు బయటే పరిష్కరించుకుందామనిరు ణదాతలను అభ్యర్థించారు. ప్రత్యర్థి కంపెనీ అయిన ఎయిర్ సెల్ విలీనం, అన్న ముఖేష్ అంబానీకి తన స్పెక్ట్రమ్, టవర్స్ వంటి ఉపకరణాల విక్రయాలకు సిద్ధపడ్డారు. ఈ రెండు పనులు విఫలమయ్యాయి. ఎయిర్ సెల్ పూర్తిగా కనుమరుగు కాగా, ఆర్‌కాం తనటెలికాం వ్యాపారాన్నే మూసివేయాల్సి వచ్చింది.



టాప్ గెయినర్స్ (+)

కంపెనీ పేరు	గరిష్టం	కనిష్టం	ముగింపు ధర	క్రితం ముగింపు	మార్పు	లాభం%
టైటాన్ కంపెనీ	1,050.00	1,009.05	1,025.75	991.55	34.20	3.45
రిలయన్స్	1,296.95	1,242.05	1,290.90	1,249.95	40.95	3.28
ఒఎన్‌జిసి	147.45	142.45	146.25	141.80	4.45	3.14
ఐచర్ మోటర్స్	20,431.95	19,435.00	20,128.30	19,663.40	464.90	2.36
బజాజ్ ఆటో	2,672.40	2,565.45	2,642.50	2,602.75	39.75	1.53
కోటాక్ మహేంద్రా	1,274.70	1,245.00	1,272.20	1,255.70	16.50	1.31
టిసిఎస్	2,055.45	2,023.00	2,050.25	2,029.95	20.30	1.00
హెచ్‌డిఎఫ్‌సి	1,981.95	1,942.00	1,978.50	1,961.25	17.25	0.88
హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్	2,113.00	2,082.65	2,104.90	2,090.45	14.45	0.69
యాక్సిస్ బ్యాంక్	724.50	708.00	720.50	717.25	3.25	0.45

టాప్ లూజర్స్ (-)

కంపెనీ పేరు	గరిష్టం	కనిష్టం	ముగింపు ధర	క్రితం ముగింపు	మార్పు	నష్టం%
ఇండియాబుల్స్	691.00	622.60	650.75	678.65	27.90	4.11
హిందల్కో	209.90	201.45	204.20	211.40	7.20	3.41
హెచ్‌పిసిఎల్	232.40	224.70	226.50	234.00	7.50	3.21
యస్ బ్యాంక్	184.70	175.60	179.80	185.60	5.80	3.13
పంవర్‌గ్రిడ్ కార్ఫ్	189.50	183.75	184.60	190.20	5.60	2.94
సిప్లా	521.00	506.20	509.60	521.35	11.75	2.25
ఎన్‌టిపిసి	140.40	136.75	137.25	140.15	2.90	2.07
ఎం అండ్ ఎం	688.40	670.35	674.45	688.40	13.95	2.03
డా. రెడ్డీస్ ల్యాబ్	2,878.00	2,715.25	2,735.20	2,791.25	56.05	2.01
సన్ ఫార్మా	423.00	409.20	414.80	423.25	8.45	2.00

మాల్యా అప్పగింతకు బ్రిటన్ ఓకే


ఫైలుపై సంతకాలు... అప్పీలుకు గడువు



లండన్ : బ్రిటన్‌కు పారిపోయిన ఆర్థిక నేరస్తుడు విజయ్ మాల్యాను భారత్‌కు అప్పగించేందుకు బ్రిటన్ అంగీకరించింది. సంబంధిత కీలక ఫైలుపై అధికారిక సంతకాలు జరిగాయి. మాల్యాను బ్రిటన్ నుంచి ఇండి యాకు తరలించేందుకు బ్రిటన్ హోం మంత్రి సాజిద్ జావిద్ ఆదేశాలు ఇచ్చారు. ఈ విషయాన్ని అక్కడి హోంశాఖ ధ్రువీక రించింది. బ్యాంకులకు రుణాల ఎగవేత, కేసుల దశలోనే బ్రిటన్‌కు ఉడా యించిన మాల్యాను పట్టితెప్పించేందుకు, చట్టరీత్యా చర్యలకు భారత ప్రభుత్వం యత్నిస్తూ వస్తోంది. ఈ దశలో ఇప్పుడు బ్రిటన్ నుంచి అధికా రిక స్పందన వెలువడింది. లిక్కర్ వ్యాపార దిగ్గజంగా పేరొందిన మాల్యా బ్రిటన్‌లో ఉండిపోవడానికి, విచారణలు తప్పించుకోవడానికి న్యాయస్థా నాలను ఆశ్రయిస్తూ వచ్చారు. 63 సంవత్సరాల మాల్యా గత ఏడది డిసెంబర్ 10వ తేదీన వెస్ట్‌మినిస్టర్ మెజిస్ట్రేట్ కోర్టులో విచారణకు ఎదు ర్కొన్నారు. అప్పుడే దీనికి సంబంధించి విచారణకు ఆయనను ఇండి యాకు అప్పగించేందుకు రంగం సిద్ధం అయింది. అయితే బ్రిటన్ సీని యర్ మంత్రి పాకిస్థాన్ సంతతికి చెందిన జావిద్ ఆ ఆదేశాలపై సంత కాలు చేసేందుకు రెండు నెలల సమయం పట్టింది. అన్ని అంశాలను పరి గణనలోకి తీసుకుని మాల్యా అప్పగింత ఉత్తర్వులపై మంత్రి సంతకాలు చేశారని ధ్రువీకరించారు. మూడేళ్లుగా మాల్యా బ్రిటన్‌లో తలదాచుకుంటు న్నారు. భారత జైళ్లలో భద్రత లేదని తను ఇండియాకు రాదల్చుకోలేదని మాల్యా చెపుతూ వచ్చారు. బ్యాంకులకు దాదాపుగా రూ 9 వేల కోట్ల మేర రుణాలు ఎగవేసి విదేశాలకు పారిపోయినట్లుగా మాల్యాపై అభియోగాలు ఉన్నాయి. ఆయన అప్పగింతకు ఇంతకు ముందు వెలువరించిన ఆదేశా లపై మాల్యా బెయిల్ పొందారు. అయితే ఇప్పుడు అప్పగింత ఫైలు హెూం మంత్రిత్వశాఖకు వెళ్లడం సంతకం జరగడంతో మాల్యాను భారత్‌కు తీసుకురా వ్వేందుకు వీలేర్పడింది. అయితే కింగ్‌ఫిషర్ మాజీ అధినేత మాల్యా ఇప్పు టి ఉత్తర్వులకు వ్యతిరేకంగా కోర్టులో అప్పీలు చేసుకునేందుకు 14 రోజుల గడువు ఇచ్చారు. మాల్యా లీగల్ బృందం అన్ని అంశాలను జాగ్రత్తగా పరి శీలించి తదుపరి చర్యలు తీసుకుంటుందని సన్నిహితులు తెలిపారు.

మోడీ సర్కార్ నిప్పుతో ఆడుకుంటోంది

సొంత పార్టీని ఘాటుగా విమర్శించిన శత్రుఘ్న



పాట్నా: పార్టీపట్ల అసంతృప్తితో ఉన్న బిజెపి నాయ కుడు శత్రుఘ్న సిన్హా సోమవారం నరేంద్ర మోడీ ప్రభుత్వంపై తాజా తకఫ్యూని పేల్చారు. పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీని లక్ష్యంగా చేసుకున్న మోడీ... నిప్పుతో ఆడుకుంటున్నారని హెచ్చరించారు. ఆమె అన్ని పరిస్థితుల్ని ఎదుర్కొని నిలిచి గెలిచిన ప్రజా నాయకురాలని శత్రు కొని యాడారు. పాట్నా సాహెబ్ నుంచి రెండుసార్లు వరుసగా గెలిచిన ఈ పార్ల మెంటు సభ్యుడు మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీ దాదాపు విశ్వసనీయతను పోగొట్టుకుంది. మేము ఏది చెప్పినా ప్రజలు ఆమోదించడం లేదు. అవినీతి కేసుతో సంబంధం ఉన్న పోలీస్ కమిషన ర్‌ను ప్రశ్నించేందుకు సిబిఐ అధికారులు బృందం వచ్చినందుకు నిరసనగా మమతా బెనర్జీ కోల్‌కతాలో ధర్నా ప్రారంభించిన ఒక రోజు తర్వాత శత్రు ఈ వ్యాఖ్య చేశారు. 'మోడీగారూ: ఏం జరుగుతోంది? ఆరోపణల ఊబిలో కూరుకుపోయిన, పరాభవానికి గురైన ప్రభుత్వ వ్యవస్థల ద్వారా నిప్పుతో ఎందుకు చెలగాటమాడుతున్నారు? అధికార కొద్ది రోజుల్లో ఎన్నికలు సమీ పిస్తున్న తరుణంలో ఇదేమిటి?' అని సిన్హా నిలదీశారు. ఇటీవల కోల్‌క తాలో మమతా బెనర్జీ నిర్వహించిన ప్రతిపక్షాల ర్యాలీలో కూడా శత్రుఘ్న సిన్హా తన అసంతృప్తిని వెళ్లగక్కారు.

21న సునందా పుష్కర్ హత్య కేసు విచారణ



న్యూఢిల్లీ : కాంగ్రెస్ నేత, మాజీ కేంద్ర మంత్రి శశి థరూర్ భార్య సునందా పుష్కర్ హత్య కేసును ఢిల్లీ లోని సెషన్స్ కోర్టు ఈనెల 21న విచారించనుంది. సునందా పుష్కర్ హత్య కేసులో ఆమె భర్త శశి థరూర్ ఆరోపణలు ఎదుర్కొంటున్న సంగతి తెలి సిందే. సునందా పుష్కర్ కేసును అంతకుముందు అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ కోర్టు సెషన్స్ కోర్టుకు బదలాయించింది. కాగా, ఈ కేసులో బిజెప్స్ నివేదికను పరిగణనలోకి ఢిల్లీ పోలీసులను సెషన్స్ కోర్టు ఆదేశించింది. కాగా, ఈ కేసులో న్యాయస్థానానికి సహకరించేందుకు అనుమతించాలని బిజెపి నేత సుబ్రహ్మణ్య స్వామి అప్పీలును కోర్టు తోసిపుచ్చింది. కాగా సునంద పుష్కర్ కేసును దర్యాప్తు చేసిన సిట్ శశిథరూర్‌పై హత్యారోపణలు చేయలేదు. భార్య సునందా పుష్కర్‌ను శశిథరూర్ నిత్యం వేధింపులకు గురిచేయడం ఆమె మరణానికి దారితీసిందని చార్జిషీట్‌లో సిట్ పేర్కొంది.

మానసిక ప్రశాంతత వ్యాధిని జయిస్తుంది

గోవా సిఎం పారికర్ క్యాన్సర్ డే సందేశం

పనాజీ : మనసు ప్రశాంతంగా ఉంటే ఎలాంటి వ్యాధినైనా జయించ వచ్చు...అని అనారోగ్యంతో బాధపడుతున్న గోవా ముఖ్యమంత్రి మనో హర్ పారికర్ సోమవారం చెప్పారు. ప్రపంచ క్యాన్సర్ దినం సందర్భంగా ఆయన ఈ సందేశాన్నిస్తూ ట్వీట్ చేశారు. 63 ఏళ్ల పారికర్ క్లోమగ్రంథి సంబంధించిన అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఇటీవలే ఆయనను ఢిల్లీలోని ఎయిమ్స్‌లో చేర్పించారు. పారికర్‌కు క్లోమగ్రంథి సమస్య ఉందని గత ఏడాది ఫిబ్రవరిలో గుర్తించారు. అప్పటి నుంచీ ఢిల్లీ, న్యూయార్క్, ముంబయి, గోవా ఆస్పత్రుల్లో చేర్పించి ఆయనకు చికిత్స అందిస్తున్నారు. ఆయన ఆరోగ్యపరిస్థితి నిలకడగా ఉందని జనవరిలో ఎయిమ్స్ వర్గాలు తెలిపాయి. ఎయిమ్స్‌లోని రోటరీ క్యాన్సర్ ఆస్పత్రిలో చేరిన పారికర్ ఆంకాలజిస్ట్ అతుల్ శర్మ పర్యవేక్షణలో ఉన్నారు. బిజెపి నాయకుడు ఎల్‌కె అద్వానీ, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ, సైన్యాధిపతి జనరల్ బిపిన్ రావత్ అంతకు ముందు గోవాలో పారికర్‌ను కలిసి ఆయన ఆరోగ్యం గురించి తెలుసుకున్నారు.

పంచాయతీల విలీనంపై తీర్పు వాయిదా

మన తెలంగాణ/ హైదరాబాద్ : రాష్ట్రంలో పలు పంచాయతీలను సమీ పంలోని మున్సిపాలిటీల్లో చేర్చడాన్ని సవాల్ చేసిన కేసుల్లో తీర్పును తర్వాత వెలువరిస్తామని హైకోర్టు వెల్లడించింది. ఇరుపక్షాల వాదనలు ముగియ డంతో తీర్పును వాయిదా వేస్తున్నట్లు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ తొట్ట తిల్ బి.రాధాకృష్ణన్, న్యాయమూర్తి జస్టిస్ ఎ.రాజశేఖర్‌రెడ్డితో కూడిన డివిజన్ బెంచ్ ప్రకటించింది. నల్లగొండ, రంగారెడ్డి, మెదక్, ఖమ్మం, నిజా మాబాద్, నల్గొండ, కరీంనగర్, రాజన్న సిరిసిల్ల, మహబూబ్‌నగర్ జిల్లాల నుంచి దాఖలైన పలు వ్యాజ్యాలపై తీర్పు వాయిదా వేసింది. నల్లగొండ జిల్లా పెద్దవూర మండలం రామన్నగూడెం తాండ, మరో ఎనిమిది తాండా లను తొలగించడాన్ని ప్రశ్నిస్తూ రమావత్ నాగేశ్వర నాయక్, రమావత్ ప్రధాన్ నాయక్‌లు వ్యాజ్యాలు దాఖలు చేశారు. పంచాయతీరాజ్, మునిసి పాలిటీ యాక్ట్‌లోని నిబంధనలను ఉల్లంఘించారనే కేసుల్ని కూడా ధర్మా సనం విచారించింది. దాదాపు వంద వ్యాజ్యాల తరపు న్యాయవాదులు వాదిస్తూ.. ఏజీ రూమ్‌లో కూర్చుని గ్రామాలను మున్సిపాలిటీల్లో విలీనం చేశారని, గ్రామాల్లో ప్రజలు ఉపాధి లేకుండా చేయడమేనన్నారు. ఉపాధి హామీ పథకం లేకుండాపోతుందన్నారు. గ్రామ పంచాయతీలు మునిసిపా లిటీల్లో కలిసిపోయాయని ప్రభుత్వం వాదించింది.

గుయిడోకే యూరప్ దేశాల మద్దతు

పారిస్ : వెనిజులా ప్రతిపక్ష నేత జువాన్ గుయిడోనే ఆ దేశ తాత్కాలిక అధ్యక్షుడిగా పలు యూరప్ దేశాలు గుర్తించాయి. ఈ మేరకు సోమవారం ఫ్రాన్స్, బ్రిటన్, స్పెయిన్, ఆస్ట్రియా, స్వీడన్, డెన్మార్క్‌లు అధికారిక ప్రక టన వెలువరించాయి. ఇప్పటికే అన్నింటి కన్నా ముందుగా అమెరికా వెనె జువెలా అధికార మార్పిడిని గుర్తించింది. యువ నేత గుయిడోకు తమ పూర్తి మద్దతు ప్రత్యక్ష సహకారం అందిస్తోంది. ప్రెసిడెంట్ నికోలస్ మదురో దేశంలో ఎన్నికలకు పిలుపు ఇవ్వాలని దీనికి వారం రోజుల గడువు ఇస్తున్నామని యూరప్ దేశాలు ఇటీవలే ప్రకటించాయి. అయితే ఎటువంటి స్పందన లేకపోవడంతో ప్రధాన యూరప్ దేశాలు సమిష్టిగానే ప్రస్తుత నేతను తాత్కాలిక అధ్యక్షుడిగా గుర్తించాయి. ఇప్పటి వరకూ ఉన్న అధ్యక్షుడు తమ అధికార హయాంపై నెలకొన్న అనుమానాలను నివృత్తి చేసుకోలేదు. తాము పెట్టిన గడువులోగా ఎన్నికలకు పిలుపు నివ్వలేదు. ఈ దశలో ఆయనను అధికారికంగా అధ్యక్షుడిగా గుర్తించడంలేదన్నారు.

బెంగాల్ సివంగిపై కేంద్రం చర్య?

హోంమంత్రి రాజ్‌నాథ్ సంకేతాలు • మమత వీధి ధర్నా రెండోరోజు • రైళ్ల నిలిపివేత, నేతల సంఘీభావ యాత్ర

కోల్‌కతా /న్యూఢిల్లీ : కేంద్రం – బెంగాల్ మధ్య రగులు కున్న రాజకీయ చిచ్చు సోమవారం మరింత భగ్గు మంది. సిఎం మమత బెనర్జీ ధర్నా సాగుతోంది. పరిస్థి తిని గమనిస్తున్నామని, సరైన చర్యలు తీసుకునే అధి కారం కేంద్రానికి ఉందని కేంద్ర హోం మంత్రి రాజ్‌నాథ్ సింగ్ సోమవారం స్పందించారు. దీనితో రాజకీయ వివాదం మరింత తీవ్రతరం అవుతుందని భావిస్తు న్నారు. కోల్‌కతా నగర పోలీసు కమిషనర్‌ను విచారిం చేందుకు సిబిఐ అధికారుల బృందం రావడం, వారిని పోలీసులు అడ్డుకుని పోలీసు జీపులలో పోలీసు స్టేషన్లకు తరలించడం రగడకు దారితీసింది. సిబిఐని అడ్డుపెట్టు కుని ప్రధాని మోడీ రాజకీయ కక్షకు పాల్పడుతున్నట్లు ఆరోపిస్తూ బెంగాల్ సిఎం మమత బెనర్జీ నగరంలోని ప్రసిద్ధి చెందిన మెట్రో సినిమా చౌక్ వద్ద చేపట్టిన ధర్నా సోమవారానికి రెండో రోజుకు చేరుకుంది. దేశవ్యా ప్తంగా ఉన్న ప్రతిపక్ష నేతలు కొందరు మమత ధర్నాకు వస్తున్నారు. ఆమెకు సంఘీభావం తెలియచేస్తున్నారు. మరో వైపు సిబిఐ అధికారుల పట్ల కోల్‌కతా పోలీసు అధి కారుల వైఖరిని తప్పపడుతూ సిబిఐ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. విధుల నిర్వహణకు వెళ్లిన తమ అధికా రులపై జులుం చేశారని పేర్కొంటూ దాఖలు అయిన పిటిషన్‌పై విచారణ చేపట్టారు. మరో వైపు కేంద్ర హోం మంత్రి రాజ్‌నాథ్ సింగ్ బెంగాల్‌లో అసాధారణ పరిస్థితి నెలకొందని, రాజ్యాంగ ఉల్లంఘనకు ఇప్పటి ఘటనలు ప్రతీకగా మారాయని పేర్కొన్నారు. కోల్‌కతా ఇతర ప్రాంతాలలో టిఎంసి కార్యకర్తలు ప్రదర్శనలు నిర్వహి స్తున్నారు. మోడీ, అమిత్ షాల దిష్టిబొమ్మలు తగులబెడు తున్నారు. రాష్ట్రంలో జరుగుతున్న పరిణామాలు అసా ధారణంగా మారాయి. దురదృష్టకరంగా ఉన్నాయని





రాజ్‌నాథ్ చెప్పారు. బెంగాల్‌లో చివరికి రాజ్యాంగాన్ని కాలరాస్తున్నారు, దేశంలో ఏ ప్రాంతంలో అయినా రాజ్యాంగ పరిరక్షణకు, సాధారణ పరిస్థితుల కల్పనకు చర్యలు తీసుకునే అధికారం కేంద్రానికి అన్ని విధాలుగా ఉందని హోం మంత్రి పేర్కొన్నారు. దీనితో బెంగాల్‌లో పరిస్థితి చక్కబెట్టే కారణంతో కేంద్రం అత్యవసర రీతి లోనే స్పందించేందుకు వీలుందని విశ్లేషణలు వెలువ డ్డాయి. రాష్ట్రంలో పరిస్థితిపై గవర్నర్ కేశరీనాథ్ త్రిపాఠీ నుంచి నివేదిక తెప్పించుకున్నట్లు కూడా రాజ్‌నాథ్ చెప్పారు. అయితే ఇందులోని అంశాలను వెల్లడించే దుకు నిరాకరించారు. సిబిఐ బృందాల రాకకు నిరస నగా అధికార టిఎంసి కార్యకర్తలు నేతలు పలు చోట్ల ప్రదర్శనలకు దిగారు. కోల్‌కతాలో తమ నాయకురాలు మమత బెనర్జీ ధర్నా చేస్తున్న చోటికి మారుమూల ప్రాంతాల నుంచి జనం తరలివస్తున్నారు. దీనితో నగ రంలో ఉద్రిక్తత నెలకొంది. పలు చోట్ల రైళ్లను నిలిపివేశారు. శాంతియుత ప్రదర్శన లకు దిగాలని, దిష్టిబొమ్మల దగ్ధాలకు ఇతర చర్యలకు పాల్పడవద్దని ధర్నా వేదిక నుంచి మమత పిలుపు నిచ్చారు. రాజ్యాంగాన్ని రక్షించాలి. సమాఖ్య వ్యవస్థను నిలబెట్టుకోవాలనేదే తమ నినాదం అని చెప్పారు. రాష్ట్ర పోలీసు బలగాలను రక్షించాలని, ఐఎఎస్, ఇతరత్రా సివిల్ సర్వీసు అధికారులను కేంద్ర దర్యాప్తు ముప్పు నుంచి రక్షించాల్సి ఉందని మమత చెప్పారు. ఆదివారం రాత్రి నుంచే మమత ధర్నా వద్దనే ఉన్నారు. నగర పోలీసు కమిషనర్ రాజీవ్‌కుమార్, పలువురు మంత్రులు, పార్టీ ఎంపీలు, నేతలు ధర్నాలో పాల్గొ న్నారు. అమరావతి, చెన్నై, బెంగళూరు, ఇతర ప్రాంతాల నుంచి ప్రాంతీయ పార్టీల నేతలు మమతకు మద్దతుగా నిలుస్తూ ప్రకటనలు వెలువరించారు. కేంద్రం ధోరణికి వ్యతిరేకంగా సాగే పోరులో తోడుంటామని చెప్పారు. కోల్‌కతాలో జనవరి 19వ తేదీన జరిగిన ప్రతి పక్షాల సభ విజయవంతం కావడంతో ప్రధాని మోడీ, అమిత్ షా సహించలేకపోతున్నట్లు, పాత స్కామ్‌ల ఫైళ్లపై కొత్త దర్యాప్తులకు దిగుతున్నారని ఆంధ్రప్రదేశ్ సిఎం చంద్రబాబు నాయుడు ఇతరులు మండిపడ్డారు. దేశంలో ఇప్పుడు ఎమర్జెన్సీ నాటి రోజులు గుర్తుకు వస్తు న్నాయని జెడిఎస్ జాతీయ అధ్యక్షుడు హెచ్‌డి దేవెగౌడ ఒక ప్రకటన వెలువరించారు.

బెంగాల్ వే'ఢీ'

(మొదటిపేజీ తరువాయి)

పక్షాలు తిప్పికొట్టేందుకు యత్నించాయి. ఈ దశలో సభ అర్ధాంతరంగా వాయిదా పడింది. కోల్‌కతా నగర పోలీసు కమిషనర్ రాజీవ్ కుమార్ నివాసం వద్ద సిబిఐ బృందాల మొహరింపు పట్ల ప్రతిపక్షాలు నిరసన వ్యక్తం చేశాయి. కోల్‌కతాలో మమత బెనర్జీ ధర్నా అంశం కూడా సభలో ప్రస్తావ నకు వచ్చింది. సిబిఐ దురుసుగా తమను ఖండిస్తున్నట్లు టిఎంసి సభ్యులు లోక్‌సభలో నిరసనలకు దిగారు. ఈ దశలో హోం మంత్రి రాజ్‌నాథ్ సింగ్ లేచి బెంగాల్‌లో అసాధారణ పరిస్థితి నెలకొందని ఆందోళన వ్యక్తం చేశారు. అక్కడ సిబిఐని పోలీసులతో రాష్ట్ర ప్రభుత్వం అటకాయించిందని, ఇది చట్ట బద్ధంగా విధినిర్వహణకు దిగే అధికారులను అడ్డుకోవడం కిందికి వస్తుందని అన్నారు. చిట్‌ఫండ్ స్కామ్‌పై పోలీసు కమిషనర్ నుంచి వివరణ తీసుకోవల్సి ఉంది. అందుకే సిబిఐ బృందం అక్కడికి వెళ్లింది. వారిని అడ్డుకోవడం మౌలిక సమాఖ్య వ్యవస్థకు విరుద్ధం అని హోం మంత్రి రాజ్‌నాథ్ సింగ్ స్పందిం చారు. ప్రస్తుత పరిణామం, సిఎం ధర్నాకు దిగడం వంటివి రాష్ట్రంలో చివరికి రాజ్యాంగ పతనానికి దారితీస్తోందని, ఈ దశలో కేంద్రం చర్యకు అవకాశం ఉందని సంకేత ప్రాయంగా తెలిపారు. దేశంలో ఏ ప్రాంతంలో అయినా సాధారణ పరిస్థితి నెలకొల్పేలా చర్యలు తీసుకునేందుకు కేంద్రానికి విశేషాధి కారాలు ఉన్నాయని, రాజ్యాంగం ఈ విధంగా నిర్దేశించి ఉందని స్పష్టం చేశారు. రాష్ట్ర గవర్నర్ నుంచి తమకు నివేదిక ఇప్పటికే తెప్పించుకున్నట్లు చెప్పారు. దీనిని బట్టి కేంద్రం చర్యలు ఉంటాయన్నారు.

బెంగాల్‌పై కేంద్రం రాజకీయ కుట్ర

కేంద్రం తీరుతో పశ్చిమ బెంగాల్‌లో సంక్షోభం నెలకొందని టిఎంసి నేత సౌగ థారాయ్ చెప్పారు. రాష్ట్రంలో రాజకీయ ఆధిపత్యం సాధించుకునేందుకు కేంద్రం సిబిఐని పావుగా వాడుకొంటోందన్నారు. ఇతర అన్ని పార్టీలతో కలిసి కేంద్రం వైఖరిపై తమ పార్టీ పోరు సాగిస్తుందని తెలిపారు. సభలో బిజెడి నేత బి మెహతాబ్ మాట్లాడుతూ సిబిఐ తీరు అరాచకంగా ఉంద న్నారు. సంస్థ విశ్వసనీయత అనుమానాస్పదం అయిందన్నారు. కేంద్రం గుప్పిట్లో సిబిఐ రాజకీయ ఆయుధంగా మారితే పరిస్థితి దిగజారుతుందని అన్నారు. మనం బనానా రిపబ్లిక్‌లో లేమని తెలిపారు. ప్రతిపక్షాలను దెబ్బతీ సేందుకు కేంద్రం సిబిఐని వాడుకొంటోందని కాంగ్రెస్ నేత మల్లికార్జున ఖర్గే విమర్శించారు. సిబిఐ దుర్వినియోగం ఉదంతాలు కొత్తేమీ కాదని, యుపిలో, తమిళనాడులో, కర్నాటకలో కూడా జరిగాయని అన్నా రు. ఇతర ప్రతిపక్ష సభ్యులు కూడా సిబిఐ వైఖరి, కేంద్రం తీరును ఖండించారు. రాజ్య సభలో కూడా ఇదే పరిస్థితి నెలకొంది. సభలో టిఎంసి నేత డెరెక్ ఒ బ్రెయిన్ నిరసన వ్యక్తం చేశారు. ఘటనపై చర్చకు నోటీసు ఇచ్చారు. ప్రతిపక్ష సభ్యులు వెల్‌లోకి దూసుకుపోవడంతో సభ వాయిదా పడింది.

శుక్రవారం వరకూ మమత ధర్నా

సిబిఐ వైఖరికి నిరసన పేరిట మమత బెనర్జీ తలపెట్టిన ధర్నా కార్యక్రమం ఈ నెల 8వ తేదీ శుక్రవారం వరకూ కొనసాగుతుంది. రాష్ట్రంలో విద్యార్థుల పరీ క్షలు ఉన్నందున ఆరోజుతో ధర్నా ముగుస్తుంది. విద్యార్థులకు ఇబ్బందికలు గకుండా ఉండేందుకు తాము మైకుల వాడకం లేదని, త్వరలో పరీక్షలు ఉన్నందున శుక్రవారంతో ధర్నా ముగుస్తుందని మమతబెనర్జీ సోమవారం తెలిపారు. ఇది సత్యాగ్రహం అని, సిబిఐ వైఖరికి వ్యతిరేకంగా తమ ప్రశాంత రాజకీయ ప్రతిఘటన అని చెప్పారు. రాష్ట్రంలో కుట్రకు బిజెపి యత్నిస్తోం దని, దీనిని అడ్డుకునేందుకు తాము ధర్నాకు దిగాల్సి వచ్చిందన్నారు.

22 పార్టీల మద్దతు : టిఎంసి ఎంపి

బెంగాల్‌లో కేంద్రం పెత్తనానికి వ్యతిరేకంగా దేశంలోని 22 రాజకీయ పార్టీలు కలిసికట్టుగా వ్యవహరిస్తున్నాయని టిఎంసి ఎంపి డెరెక్ ఒబ్రెయిన్ చెప్పారు. ఢిల్లీలో ఆయన విలేకరులతో మాట్లాడారు. సిబిఐ వైఖరిని నిరసిస్తూ ధర్నాకు దిగిన మమతకు పలు పార్టీలు మద్దతు ప్రకటించాయని తెలిపారు. యావత్తూ ప్రతిపక్షం తమ నాయకురాలికి అండగా ఉందన్నారు. ఈ సంద ర్భంగా ఆయన చంద్రబాబు నాయుడు, స్టాలిన్, అఖిలేష్ యాదవ్, ఇతరుల పేర్లను ప్రస్తావించారు. ప్రతిపక్ష సీనియర్ నేత శరద్ పవార్ నివాసంలో వివిధ పార్టీల నేతల సమావేశం జరిగింది. ఇందులో చంద్రబాబు నాయుడు, అఖిలేష్ యాదవ్, ఇతర నేతలు పాల్గొన్నట్లు తెలిసింది. కోల్‌కతాలో జరిగిన రీతిలోనే ఢిల్లీలోనూ జరిగిందని, కేజ్రీవాల్ పట్ల దురుసుగా వ్యవహరించారని పవార్ విమర్శించారు.

అవినీతి కూటమి అది : కేంద్ర మంత్రి

మమత బెనర్జీ తమ మోసాలను కప్పిపుచ్చుకునేందుకు యత్నిస్తున్నారని, ఆమెకు ఇప్పుడు ప్రతిపక్షాలు మద్దతు ఇవ్వడం విడ్డూరంగా ఉందని కేంద్ర న్యాయ మంత్రి రవిశంకర్ ప్రసాద్ విమర్శించారు. ప్రతిపక్షాలది అవినీతి జట్టు అన్నారు. లోగుట్టును దాచిపెడుతున్న పోలీసు కమిషనర్‌కు మద్దతుగా సిఎం ధర్నాకు దిగడం దారుణం అన్నారు. సిబిఐ చర్య సమాఖ్యవాదంపై దాడి అనే విమర్శలను మంత్రి తిప్పికొట్టారు. నిజానికి అవినీతిని కప్పిపుచ్చు కునేందుకు మమతనే ఇప్పుడు హై డ్రామాకు దిగిందని అన్నారు.

కేంద్రం, మమతలపై లెఫ్ట్ విమర్శలు

కేంద్ర ప్రభుత్వం సిబిఐని దుర్వినియోగపరుస్తోందని అయితే మమత బెనర్జీ ఇంతకంటే ఎక్కువగా స్కామ్‌ల్లో పాపాలను కప్పిపుచ్చుకునేందుకు తన అధి కారాన్ని పోలీసు యంత్రాంగాన్ని వాడుకొంటోందని వామపక్షాలు విమర్శించాయి. అటు మోడీ ఇటు మమత ఇద్దరూ ఈ విధంగా అక్రమాలలో ఘనులు అని తెలిపారు.

పిఎం కిసాన్‌కు ఆధార్ ఉండాల్సిందే

న్యూఢిల్లీ: రైతుల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త పథకం ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి లబ్ధి చేకూరాలంటే ఆధార్ తప్పనిసరిగా ఉండాలని అధికారులు తెలి పారు. చిన్న, మధ్య తరహా రైతులకు ఆర్థిక సహ కారం అందజేయడమే లక్ష్యంగా ఈ పథకాన్ని ప్రవేశపెట్టారు. దీనికి కింద రైతులకు ఏడాదికి రూ.6వేలు అందజేస్తారు. మూడు విడతల్లో లబ్ధి దారులకు ఈ నగదు అందనుంది. ఈ లబ్ధి చేకూ రాలంటే రైతులు ఆధార్‌ను తప్పనిసరిగా ఉండాలి. గుర్తింపు నిరూపించుకునేందుకు రైతులు ఆధార్ నెంబర్‌ను ఇవ్వాల్సి ఉంది. డిసెంబరు 2018మార్చి 2019 వరకు తొలి విడత కింద రూ.2వేలను రైతుల ఖాతాల్లో జమ చేసేందుకు ఆధార్ నెంబరును అప్పనలేగా ఇవ్వాల్సి ఉంది. కానీ రెండో విడత నగదు బ్యాంకు ఖాతాల్లో వేయాలంటే అందుకు ఆధార్ నెంబర్ తప్పనిసరి అని కేంద్ర వ్యవసాయమంత్రిత్వ శాఖ వెల్లడించింది. మొదట విడత నగదు



పొందేందుకు ఆధార్‌కు బదులుగా డ్రైవింగ్ లైసెన్స్, ఓటర్ ఐడీ కార్డు, ఎన్‌ఆర్‌ఈజీఏ జాబ్ కార్డు లేదా ఇతర గుర్తింపు కార్డులు ఏమైనా ఉన్నా సరిపోతుంది. రెండో విడత నగదు పొందాలంటే మాత్రం తప్పనిసరిగా ఆధార్ నెంబరును అధికారులు తీసుకోవాల్సిందిగా కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలను ఆదేశించింది. అర్హు లైన రైతులకు నేరుగా లబ్ధి చేకూరేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు సంబంధిత అధికారులు తెలిపారు. అర్హులైన రైతుల జాబితాను వీలైనంత త్వరగా రూపొందించి కేంద్రానికి పంపించా ల్సిందిగా సూచించారు.రైతు పేరు, లింగం, ఎస్సీ/ఎస్టీ కిందకు వస్తారా లేదా? వారి బ్యాంకు ఖాతా నెంబరు, మొబైల్ నెంబరు వివరాలు సేక రించాలని రాష్ట్ర ప్రభుత్వ అధికారులకు సూచిం చారు. ఈ పథకం కింద 2హెక్టార్ల దాకా సాగు భూమి ఉండే రైతులకు ఏడాది రూ.6వేలు అంద జేస్తారు. ఈ మొత్తాన్ని నేరుగా లబ్ధిదారులైన రైతుల బ్యాంకు ఖాతాల్లోకే బదిలీ చేస్తారు. ఈ పథకానికి కేంద్ర ప్రభుత్వమే నిధులు సమకూర స్తుంది. ఫిబ్రవరి 1న కేంద్ర ఆర్థికశాఖ తాత్కాలిక మంత్రి పీయూష్ గోయల్ బడ్జెట్‌లో ఈ పథ కాన్ని ప్రకటించిన విషయం తెలిసిందే.

పోప్ ఫ్రాన్సిస్‌కు ఎమిరేట్స్‌లో ఘనస్వాగతం

అరబ్ దేశానికి వచ్చిన మొదటి క్రైస్తవ గురువు

అబు దాబి: క్రైస్త వుల ప్రధాన మత గురువు పోప్ ఫ్రాన్సిస్ సోమ వారం తన చారి త్రాత్మకమైన యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ పర్యటన కు శ్రీకారం చుట్టారు. ఆయనకు ఉత్సాహభరితమైన ఘన స్వాగతం లభించింది. మతప రమైన స్వాతంత్ర్యంపై ఆంక్షలకు పేరొందిన ముస్లిం ప్రాంతంలో మత సహ నంపై జరిగే ఒక ప్రదర్శనలో మత నాయకుల సదస్సులో పోప్ ప్రసంగి స్తారు. అబుదాబి అధ్యక్ష భవనానికి చేరుకున్న పోప్ ఫ్రాన్సిస్ అపూర్వమైన సైనిక వందనాన్ని స్వీకరించారు. కాస్త మితిమీరిన పోకడలున్న ఎమిరేట్స్‌లో నిరాడంబరతకు పేరొందిన పోప్ ఫ్రాన్సిస్‌కు రెడ్ కార్పెట్ స్వాగతం లభించడం ఎన్నదగిన విశేషం. మతగురువు వాహనం వెంట ప్యాలెస్ గార్డ్స్ వరకు అశ్వదళం అనుసరించింది. అబుదాబి యువరాజు షేక్ మహ్మద్ బిన్ జాయెద్ అల్ నహ్యాన్, ఎమిరేట్ ఉపాధ్యక్షుడు, ప్రధానమంత్రి షేక్ మహ్మద్ బిన్ రషీద్ అల్ మక్తూమ్ మధ్యలో పోప్ నిలబడ్డారు. ఒక క్రైస్తవ మతగు రువు అరేబియా దేశాల్ని సందర్శించడం ఇదే మొదటిసారి.



మందలుగా జనం అక్రమ తరలింపు

భారీ కుట్రలో భారతీయుడు భాంబా

న్యూయార్క్ : మానవ అక్రమ రవాణా కుట్రలో భారతీయుడు యద్వీందర్ సింగ్ భాంబా (60 ఏండ్లు) పాత్ర ఉందని వెల్లడైంది. అమెరికాకు మనుష్యు లను అక్రమంగా తరలించడంలో తాను సహకరించినట్లు ఈ వ్యక్తి అంగీకరిం చారు. వ్యూహ్యార్క్‌లో రెకో మెజిస్ట్రేట్ జడ్జి ముందు ఈ వ్యక్తి నేరం అంగీకరించారు. అమెరికాలో ప్రయోజనాలు పొందేందుకు పలువురు అక్రమంగా వెళ్లేందుకు పైరవీలు చేస్తూ ఉంటారు. వీరి బలహీనతలను, అవసరాలను తాను సొమ్ము చేసుకున్నట్లు యద్వీందర్ సింగ్ తమ వాంగ్మూలంలో తెలిపారు. తాను అక్రమ పద్ధతులలో చట్ట వ్యతిరేకంగా దాదాపు 400 మందికి అమెరికా ప్రవేశం కల్పించినట్లు తెలియచేసుకున్నారు. గత నెలలో ఈ వ్యక్తి నేరాంగీ కారం జరిగినట్లు అమెరికా న్యాయ చట్ట విభాగం అధికారులు సోమవారం తెలిపారు. మానవ అక్రమ రవాణా కుట్ర గురించి తనకు తెలిసింది తక్కువే అని, అయితే జనాన్ని అక్రమంగా తరలించడంలో తన వంతు పాత్ర ఉన్నది కంగానే ఉందని ఈ వ్యక్తి చెప్పారు. మానవ అక్రమ రవాణా, చట్ట విరుద్ధ ఆని కిని అమెరికా తీవ్ర స్థాయి నేరంగా పరిగణిస్తుంది. దీనికి అనుగుణంగా శిక్షలు భారీ స్థాయిలోనే పడుతాయి. అమెరికా మెజిస్ట్రేట్ జడ్జి సిబియా కాత్రి నే కొల్ ఎదుట ఈ వ్యక్తి తన నేరాలను ఒప్పేసుకున్నారు. అమెరికాలో అపారా ఆర్థిక, ఉద్యోగ అవకాశాలను ఊతంగా చేసుకుని మానవ అక్రమ రవాణా జరుగుతూ వస్తోంది. డొమినికన్ రిపబ్లిక్‌ను ప్రధాన కేంద్రంగా చేసుకుని ఇండియా, హైతీ, ప్యూర్టో రికోలలో మానవ రవాణా కుట్ర సాగుతూ వస్తోం దని విచారణలో వెల్లడైంది. ఈ కుట్ర చాలా తీవ్రస్థాయిలో సాగుతూ వచ్చింది. అమెరికా లోనికి తనకు 400 మందిని తరలించడం ఒక వ్యవహా రంతో సంబంధం ఉందని ఈ వ్యక్తి నేరం అంగీకరించారు. 2013 –2015



మధ్యలో అక్రమంగా వీరిని తాను తరలించినట్లు తెలిపారు. కరీబియన్ దీవుల నుంచి సాగుతోన్న కుట్రకు ఈ వ్యక్తి నేరాల సారథ్యం వహించినట్లు, కుట్రదారులకు కీలక వ్యక్తిగా మారినట్లు న్యాయ, చట్ట వ్యవహారాల విభాగం అసిస్టెంట్ జనరల్ బ్రెయాన్ బెన్‌కోవ్స్కి తెలిపారు.

ఒక్కో వ్యక్తి నుంచి 85000 డాలర్ల వరకూ

అమెరికాలో అక్రమంగా పొగావేసేందుకు ఈ వ్యక్తి రేట్లను కూడా ఖరారు చేసుకున్నాడు. వారి వారి స్థితిగతులను, అవసరాలను బట్టి ఒక్కొక్కరి నుంచి 30000 నుంచి గరిష్ఠంగా చూస్తే 85000 డాలర్ల వరకూ గుంజేవారు. 2013 నుంచి 2016 వరకూ ఈ విధంగా ఎక్కువగా ఇండియా నుంచి వీరిని లాక్కున్నారు. యద్వీందర్ సింగ్‌కు ఈ వ్యవహారమే ప్రధాన ఆదాయ వన రుగా మారిందని అధికారులు తెలిపారు. 2017 ఆగస్టులోనే చట్ట విభాగం ఈ వ్యక్తిని అరెస్టు చేసింది. విచారణ పలు దఫాలుగా సాగుతూ వచ్చింది. కరీ బియన్ దీవుల స్థావరానికి తొలుత మనుష్యులను తీసుకురావడం జరుగుతూ వచ్చింది. థాయిలాండ్, అరబ్ ఎమిరేట్స్, అర్జెంటీనా, ఇరాన్, పనామా, వెనె జువెలా, బెలిజ్, హైతీ వంటి దేశాలు అధికంగా ఇండియా నుంచి ప్రజలను విమానాలలో తీసుకువచ్చే వారు. వీరికి కరీబియన్‌లో విడిది కల్పించి తర వాత అమెరికాకు చేర్చేవారని వెల్లడైంది. పలు ప్రాంతాల నుంచి వచ్చిన వారిని బోట్లలో ప్యూర్టో రికోకు కానీ ఫ్లోరిడాకు కానీ తీసుకువెళ్లే వారు. తర వాత బసలో ఉంచి అక్కడి నుంచి విమానాలలో అమెరికాలోని వివిధ ప్రాంతాలలో ప్రవేశపెట్టే వారు. అక్రమ బేసులకు అమెరికాలో మారుపేర్లతో గుర్తింపు కార్డులను అందించడం అనుమానాలు రాకుండా వ్యవహరించడం జరుగుతూ వచ్చింది. ఇక అక్రమ పద్ధతులలో తీసుకువచ్చిన వారిని అత్యంత ప్రమాదకరమైన నావలలో అమెరికా తీర ప్రాంత పట్టణాలకు తీసుకువచ్చే వారు. ఎక్కువ మందితో అనుకూలం గా నావలలో వీరి ప్రయాణాలు సాగేవి. ఈ క్రమంలో ఒకరిద్దరు ప్రమాదాలలో చనిపోయినట్లు కూడా జస్టిస్ విభాగం తెలిపింది. తమ వద్దకు వచ్చిన వారికి నకిలీ తప్పుడు ఉద్యోగ పత్రాలను ఇవ్వడం, వీటి ద్వారా విజిట్ వీసాలు పొందడం వంటి పలు చర్యలకు భాంబా పాల్పడి నట్లు వెల్లడైంది. తన ఆక్రమ తంతు నిర్వహణ కోసం గాను అమెరికాలో ఈ వ్యక్తి ఎక్క డికక్కడ అధికారులకు ముడుపులు అందించడం కూడా చేసేవారు. ఈ క్రమంలో ఈ వ్యక్తి ఆయన ద్వారా నడిచిన ముఠా తరఫున పలువురు ఇమిగ్రేషన్, పాస్ పోర్ట్, విమానాశ్రయ అధికారులకు ఎప్పటికప్పుడు భారీగా నగదు అందినట్లు దర్యాప్తులో వెల్లడైంది. సార్వత్రిక అనివార్య ఇమ్మిగ్రేషన్, పాస్‌పోర్టు నియంత్రణ పద్ధతు లను తోసిరాజంటూ తన వ్యవహారం సాగించినట్లు అధికారులు తేల్చారు. ప్రస్తుతం విచారణ క్రమం ముగియడం, ఈ వ్యక్తి నేరాంగీకారానికి దిగడంతో ఎటువంటి శిక్ష పడుతుందనేది వెల్లడి కావల్సి ఉంది.

భారత బ్యాడ్మింటన్ కోచ్ పి.గోపీచంద్‌కు అరుదైన గౌరవం దక్కింది. భారత క్రీడా పురస్కారాల ఎంపిక కమిటీలో గోపీచంద్‌కు స్థానం లభించింది. గోపీచంద్‌తో పాటు స్టార్ షూటర్ అభినవ్ బింద్రా కీలక సభ్యులుగా ఉంటారు. టెన్నిస్ స్టార్ మహేశ్ భూపతి, దిగ్గజ అథ్లెట్ పిటి.ఉష తదితరులు కమిటీ సభ్యులుగా కొనసాగుతారు.

ఆస్ట్రేలియా క్లీన్‌స్వీప్

రెండో టెస్టులోనూ లంక చిత్తు



కాన్‌బెర్రా: శ్రీలంకతో జరిగిన రెండో, చివరి టెస్టులో ఆస్ట్రేలియా 366 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. ఈ విజయంతో రెండు మ్యాచ్‌ల సిరీస్‌ను 2–0తో క్లీన్‌స్వీప్ చేసింది. 516 పరుగుల భారీ లక్ష్యంతో రెండో ఇన్నింగ్స్ చేపట్టిన లంకను ఆస్ట్రేలియా బౌలర్లు 149 పరుగులకే కుప్పకూల్చారు. 17/0 ఓవర్‌నైట్ స్కోరుతో సోమవారం నాలుగో రోజు బ్యాటింగ్ ప్రారంభించిన లంకను ఆసీస్ బౌలర్లు హడలెత్తించారు. మిచెల్ స్టార్క్, పాట్ కమిన్స్ అద్భుత బౌలింగ్‌తో లంక బ్యాట్స్‌మెన్‌ను బెంబేలెత్తించారు. ఓపెనర్ లహిరు తిరిమన్నె 30 పరుగులు చేయగా, కుశాల్ మెండిస్ 42 పరుగులతో టాప్ స్కోరర్‌గా నిలిచాడు. వికెట్ కీపర్ డిక్వెలా (27), కరుణరత్నె (22) తప్ప మిగతావారు కనీసం రెండంకెలా స్కోరును కూడా అందుకోలేక పోయారు. దీంతో లంకకు ఘోర పరాజయం తప్పలేదు. ఆస్ట్రేలియా బౌలర్లలో స్టార్క్ ఐదు, కమిన్స్ మూడె వికెట్లు పడగొట్టారు. స్టార్క్ మొదటి ఇన్నింగ్స్‌లోనూ ఐదు వికెట్లు తీశాడు. అతనికే మ్యాన్ ఆఫ్‌ది మ్యాచ్ అవార్డు లభించింది. ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్‌లో 5 వికెట్ల నష్టానికి 234 పరుగులు చేసి డిక్లేర్డ్ చేసింది. రెండో ఇన్నింగ్స్‌లో 3వికెట్ల నష్టానికి 196 పరుగులు చేసింది. లంక మొదటి ఇన్నింగ్స్‌లో 215 పరుగులకే కుప్పకూలింది. అయినా లంకకు ఫాలోఆన్ ఆడించకుండా ఆస్ట్రేలియా తిరిగి బ్యాటింగ్ ప్రారంభించింది. చివరికి 3 వికెట్ల నష్టానికి 196 పరుగులు చేసి డిక్లేర్డ్ చేసింది.




పటేల్ ఒంటరి పోరాటం

సౌరాష్ట్ర 158/5, విదర్భతో రంజీ ఫైనల్



నాగ్‌పూర్: విదర్భతో జరుగుతున్న రంజీ ట్రోఫీ ఫైనల్లో సౌరాష్ట్ర తొలి ఇన్నింగ్స్‌లో ఐదు వికెట్ల నష్టానికి 158 పరుగులు చేసింది. అంతకుముందు విదర్భ మొదటి ఇన్నింగ్స్‌ల 312 పరుగులకు ఆలౌటైంది. జవాబుగా తొలి ఇన్నింగ్స్ చేపట్టిన సౌరాష్ట్ర వరుస క్రమంలో వికెట్లు కోల్పోయి కష్టాల్లో చిక్కుకుంది. విదర్భ మొదటి ఇన్నింగ్స్ స్కోరును అందుకోవాలంటే సౌరాష్ట్ర మరో 154 పరుగులు చేయాలి. ఒకవైపు వికెట్లు పడుతున్నా ఓపెనర్ స్నెల్ పటేల్ ఒంటరి పోరాటం చేస్తున్నాడు. ప్రత్యర్థి బౌలర్లను దీటుగా ఎదుర్కొంటున్న పటేల్ 14 ఫోర్లతో 87 పరుగులు చేసి నాటౌట్‌గా ఉన్నాడు. అతనికి ప్రేరక్ మన్కడ్ 16(బ్యాటింగ్) అండగా నిలిచాడు. స్టార్ ఆటగాడు చటేశ్వర్ పుజారా నిరాశ పరిచాడు. పుజారా ఒక పరుగు మాత్రమే చేసి పెవిలియన్ చేరాడు. ఓపెనర్ హర్విక్ దేశాయ్ (10), విశ్వరాజ్ జడేజా (18) కూడా జట్టుకు అండగా నిలువలేక పోయారు. మరోవైపు అర్పిత్ వస్వదా (13), షెల్డన్ జాక్సన్ (9) కూడా విఫలమయ్యారు. దీంతో సౌరాష్ట్ర కష్టాల్లో చిక్కుకుంది. ప్రత్యర్థి జట్టులో ఆదిత్య సర్వాటే మూడు, అక్షయ్ రెండు వికెట్లు పడగొట్టారు. అంతకుముందు విదర్భ తొలి ఇన్నింగ్స్‌లో 312 పరుగులకు ఆలౌటైంది. కీలక ఇన్నింగ్స్ ఆడిన అక్షయ్ కర్నెవర్ 8 ఫోర్లు, రెండు సిక్స్‌లతో 73 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. సౌరాష్ట్ర బౌలర్లలో కెప్టెన్ ఉనద్కట్ మూడు, చేతన్, మక్వానా రెండేసి వికెట్లు తీశారు.





బుమ్రా టాప్ ర్యాంక్ పదిలం

దుబాయి: అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసిసి) తాజాగా ప్రకటించిన వన్డే ర్యాంకింగ్స్‌లో టీమిండియా కెప్టెన్ విరాట్ కోహ్లి, స్పీడ్‌స్టర్ జస్‌ప్రిత్ బుమ్రాలు టాప్ ర్యాంక్‌ను నిలబెట్టుకున్నారు. బ్యాటింగ్ విభాగంలో కోహ్లి నంబర్‌వన్‌గా నిలువగా, బౌలింగ్‌లో బుమ్రా టాప్ ర్యాంక్‌ను కాపాడుకున్నాడు. భారత్–కివీస్, పాకిస్థాన్–సౌతాఫ్రికా జటల మధ్య వన్డే సిరీస్‌లు ముగిసిన నేపథ్యంలో ఐసిసి తాజాగా ర్యాంకింగ్స్‌ను ప్రకటించింది. ఈ ర్యాంకింగ్స్‌లో విరాట్ కోహ్లి 887 రేటింగ్ పాయింట్లతో మొదటి ర్యాంక్‌లో నిలిచాడు. ఈ సిరీస్‌లో కోహ్లి కేవలం మూడు మ్యాచ్‌లే ఆడిన విషయం తెలిసిందే. అయినా అతని టాప్ ర్యాంక్ చెక్కుచెదరలేదు. ఇక, భారత్‌కే చెందిన స్టార్ ఓపెనర్ రోహిత్ శర్మ కూడా రెండో ర్యాంక్‌ను నిలబెట్టుకున్నాడు. ఇటీవల ముగిసిన వన్డే సిరీస్‌లో వీరిద్దరూ మెరుగైన బ్యాటింగ్‌ను కనబరచడంతో పాత ర్యాంక్‌లను కాపాడుకున్నారు. ఇక, భారత్‌తో జరిగిన సిరీస్‌లో మెరుపులు మెరిపించిన న్యూజిలాండ్ స్టార్ బ్యాట్స్‌మన్ రాస్ టైలర్ తాజా ర్యాంకింగ్స్‌లో మూడో ర్యాంక్‌కు ఎగబాకాడు. సిరీస్‌లో టైలర్ అద్భుతంగా రాణించిన విషయం తెలిసిందే. దీంతో అతను టాప్–3లో నిలిచాడు. మరోవైపు భారత ఓపెనర్ శిఖర్ ధావన్ తాజా ర్యాంకింగ్స్‌లో పదో స్థానంతో సరిపెట్టుకున్నాడు. మహేంద్ర సింగ్ ధోని 17వ, కేదార్ జాదవ్ 35వ ర్యాంక్‌లో నిలిచారు. ఇక, బౌలింగ్ విభాగంలో బుమ్రా టాప్ ర్యాంక్‌ను కాపాడుకున్నాడు. కివీస్ సిరీస్‌కు దూరంగా ఉన్నా బుమ్రా టాప్ ర్యాంక్‌కు ఢోకా లేకుండా పోయింది. స్పిన్నర్లు కుల్దీప్ నాలుగో, చాహల్ ఐదో ర్యాంక్‌లో నిలిచారు. టీమ్ విభాగంలో భారత్ రెండో స్థానాన్ని కాపాడుకుంది. ఇంగ్లండ్ మొదటి ర్యాంక్‌లో నిలవగా, దక్షిణాఫ్రికా మూడో స్థానంలో కొనసాగుతోంది.

ఐసిసి తీరు బాధాకరం



షేన్‌వార్న్

నార్త్‌సౌండ్: స్లో ఓవర్‌రేట్ కారణంతో వెస్టిండీస్ కెప్టెన్ జాసన్ హోల్డర్‌పై ఒక మ్యాచ్ నిషేధాన్ని విధిస్తూ అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసిసి) తీసుకున్న నిర్ణయంపై ఆస్ట్రేలియా మాజీ దిగ్గజ క్రికెటర్ షేన్‌వార్న్ ఆగ్రహం వ్యక్తం చేశాడు. ఐసిసి తీసుకున్న నిర్ణయం సమంజసంగా లేదన్నాడు. ఇంగ్లండ్–విండీస్ జట్ల మధ్య జరిగిన రెండో టెస్టు మూడో రోజుల్లోనే ముగిసిన నేపథ్యంలో ఐసిసి ఇలాంటి నిర్ణయం ఏమాత్రం సహేతుకం కాదన్నాడు. ఐసిసి ముందు వెనక ఆలోచించకుండా హోల్డర్‌పై నిషేధం విధించడం బాధాకరమన్నాడు. ఈ అంశంపై హోల్డర్ న్యాయ స్థానాన్ని ఆశ్రయించాలని వార్న్ సూచించాడు. ఇక, ఇంగ్లండ్‌ను రెండు టెస్టుల్లోనూ చిత్తుగా ఓడించిన విండీస్‌పై వార్న్ ప్రశంసలు కురిపించాడు. రానున్న రోజుల్లో కూడా విండీస్ ఇలాంటి మరెన్నో విజయాలు సాధించాలని ఆకాంక్షించాడు.



ఇంగ్లీష్ ప్రీమియర్ లీగ్ ఫుట్‌బాల్‌లో భాగంగా మాంచెస్టర్ యునైటెడ్–లీసెస్టర్ సిటీ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో ఆటగాళ్ల హోరాహోరీ..

ఎదురులేని టీమిండియా



మన తెలంగాణ/క్రీడా విభాగం: క్లిష్టమైన ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ సిరీస్‌లలో వన్డే సిరీస్‌లు గెలిచి టీమిండియా నయా చరిత్రకు శ్రీకారం చుట్టింది. కివీస్‌తో జరిగిన ఐదు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌ను 4–1తో నెగ్గడం ద్వారా భారత్ చరిత్ర సృష్టించింది. కివీస్ గడ్డపై గతంలో ఎన్నడూ కూడా భారత్ ఈ తేడాతో విజయం సాధించలేదు. కానీ, ఈ సిరీస్‌లో మాత్రం భారీ ఆధిక్యంతో సిరీస్‌ను దక్కించుకుని ప్రకంపనలు సృష్టించింది. ప్రధాన బౌలర్ జస్‌ప్రిత్ బుమ్రా లేకుండానే భారత్ సిరీస్ దక్కించుకోవడం విశేషం. అంతకుముందు ఆస్ట్రేలియాతో జరిగిన టెస్టు, వన్డే సిరీస్‌లలో కూడా భారత్ జయకేతనం ఎగుర వేసిన విషయం తెలిసిందే. తాజాగా కివీస్ గడ్డపై కూడా సిరీస్ నెగ్గి తనకు ఎదురులేదని నిరూపించింది. కొంత కాలం క్రితమే దక్షిణాఫ్రికా గడ్డపై కూడా భారత్ వన్డే సిరీస్ గెలిచిన సంగతి మరచి పోకూడదు. ప్రపంచకప్‌కు కొంత సమయం మాత్రమే మిగిలివున్న తరుణంలో టీమిండియా సాధించిన విజయాలు జట్టు ఆత్మవిశ్వాసాన్ని రెట్టింపు చేస్తాయనడంలో సందేహం లేదు. బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో ప్రస్తుతం భారత్ బలంగా మారింది. ఒంటిచేత్తో మ్యాచ్ ఫలితాన్ని తారుమారు చేసే ఆటగాళ్లకు జట్టులో కొదవలేదు. దీంతో పాటు రిజర్వ్‌బెంచ్ కూడా చాలా పటిష్టంగా తయారైంది. ప్రస్తుతం ఉన్న ఆటగాళ్లతో రెండు అంతర్జాతీయ స్థాయి జట్లను సులువుగా ఎంపిక చేసే వీలు భారత్‌కు ఉంది. దీన్ని బట్టి టీమిండియా ఎంత బలంగా ఉందో ఊహించుకోవచ్చు. ప్రస్తుతం జట్టులో స్థానం కోసం తీవ్ర పోటీ నెలకొంది. తుది జట్టులో చోటు సంపాదించడం చాలా క్లిష్టంగా తయారైంది. ఏమాత్రం విఫలమైనా జట్టులో చోటు కోల్పోక తప్పదు. ఆ స్థానాన్ని భర్తీ చేసేందుకు రిజర్వ్‌బెంచ్ ఆటగాళ్లు సిద్ధంగా ఉన్నారు. కీలక ఆటగాళ్లుగా పేరు తెచ్చుకున్న యువరాజ్ సింగ్, సురేశ్ రైనా, మనీష్ పాండే, రాబిన్ ఉతప్ప, రిషబ్ పంత్, మనోజ్ తివారీ, ఉనద్కట్, ఉమేశ్ యాదవ్, అశ్విన్, రహానె, రాహుల్ తదితరులు టీమిండియాలో స్థానం తీవ్రంగా శ్రమిస్తున్నా ఫలితం లేకుండా పోతోంది. ప్రస్తుతం ఉన్న ఆటగాళ్లను తట్టుకుని టీమిండియాలో చోటు సంపాదించడం వీరికి చాలా కష్టంగా మారింది. ఇలాంటి పరిస్థితుల్లో రానున్న ప్రపంచకప్‌లో భారత్ గెలుపు అవకాశాలు మరింత పెరిగాయి. ప్రస్తుతం జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్న ఆటగాళ్లే దాదాపు వరల్డ్‌కప్‌లో ఆడే అవకాశాలున్నాయి. అశ్విన్, మనీష్‌పాండే, రహానెలకు ప్రపంచకప్‌లో ఛాన్స్ దొరికే పరిస్థితి కనిపిస్తోంది. కానీ, తాజాగా కివీస్, ఆస్ట్రేలియా సిరీస్‌లలో ప్రస్తుత ఆటగాళ్లు పర్వాలేదనిపించడంతో వీరి ఆశయం అంత తేలిక నెరవేరే పరిస్థితి లేదు. ప్రస్తుతం జట్టులో ఉన్న జడేజా, కుల్దీప్, ఖలీల్, సిరాజ్ తదితరులు కూడా తుది జట్టులో స్థానం కోసం తీవ్రంగా శ్రమించాల్సి వస్తోంది. ఒకప్పుడూ జట్టులో కీలకంగా ఉన్న రహానె, జడేజాలు టెస్టులకే పరిమితమయ్యారు. జడేజా వన్డేలకు ఎంపిక అవుతున్నా తుది జట్టులో మాత్రం చోటు సంపాదించలేక పోతున్నాడు. అశ్విన్ వన్డే ద్వారాలు చాలా కాలం క్రితమే మూసుకు పోయాయి. రహానెది కూడా ఇటువంటి పరిస్థితే. ఇటీవల వివాదంలో చిక్కుకున్న రాహుల్‌ను తిరిగి జట్టుకు ఎంపిక చేస్తారా లేదా అన్నది ఆసక్తికరంగా మారింది.

ఆ సమస్యను అధిగమించాలి

వరుస విజయాలు సాధిస్తున్నా టీమిండియాకు కొన్ని సమస్యలు ఇంకా వెంటాడుతూనే ఉన్నాయి. ఇందులో ప్రధానమైంది ఓపెనింగ్ భాగస్వామ్యం. ప్రపంచంలోనే అత్యుత్తమ వన్డే ఓపెనర్లుగా పేరు తెచ్చుకున్న శిఖర్ ధావన్, రోహిత్ శర్మలు కివీస్ సిరీస్‌లో ఆశించిన స్థాయిలో శుభారంభం అందించలేక పోయారు. చివరి రెండు వన్డేల్లో వీరిద్దరూ ఘోరంగా విఫలయ్యారు. వీరి వైఫల్యం జట్టుపై తీవ్ర ప్రభావాన్నే చూపింది. కీలకమైన ప్రపంచకప్ సమీపించిన తరుణంలో ఓపెనర్లు తడబడడం ఆందోళక కలిగించే పరిణామమే. ముఖ్యంగా ధావన్‌లో మునుపటి జోష్ కనిపించడం లేదు. అతను తరచు విఫలమవుతున్నాడు. దీని ప్రభావం తర్వాత వచ్చే బ్యాట్స్‌మన్‌పై పడుతోంది. రోహిత్‌లో కూడా నిలకడ లోపించింది. ఇలాంటి పరిస్థితుల్లో ఓపెనర్ల మరింత మెరుగైన ఆటను కనబరచాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అంతేగాక బౌన్స్ పిచ్‌లపై తడబాటుకు గురి కావడం భారత బ్యాట్స్‌మెన్ అలవాటుగా మార్చుకున్నారు. చివరి రెండు వన్డేల్లో టాప్ ఆర్డర్ తక్కువ స్కోరుకు పరిమితం కావడం దీనికి నిదర్శనంగా చెప్పుకోవచ్చు. రానున్న సిరీస్‌లోనైనా బ్యాట్స్‌మెన్ తమ బ్యాటింగ్‌ను మెరుగు పరుచుకోవాల్సిన అవసరం ఉంది. లేకుంటే ప్రపంచకప్ వంటి మెగా టోర్నమెంట్‌లో విజయం సాధించడం అంత సులువుకాదు.







తమిళనాడులో సోమవారం భారీగా బంగారం పట్టుబడింది. చెన్నై, కోయంబత్తూరు ఎయిర్‌పోర్టుల్లో 2.4 కేజీల బంగారాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కోయంబత్తూరులో సిబ్బంది తనిఖీలు నిర్వహిస్తుండగా అక్రమంగా తరలిస్తున్న 1.5 కేజీల బంగారాన్ని ప్రయాణికుడి వద్ద నుంచి స్వాధీనం చేసుకున్నారు. కేరళలోని పాలక్కాడకు చెందిన ఇద్దరిని పోలీసులు అరెస్ట్ చేశారు.



సిబిఐ చీఫ్‌గా శుక్లా బాధ్యతల స్వీకారం

న్యూఢిల్లీ: కేంద్ర దర్యాప్తు సంస్థ (సిబిఐ)కి నూతన సారథిగా నియమితులైన రిషికుమార్ శుక్లా సోమవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. కోల్‌కతా పోలీసులకు, సిబిఐకి మధ్య ఘర్షణ నెలకొని, అది కేంద్రం, పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం మధ్య రాజకీయ తుఫానుకు దారితీసిన తరుణంలో రిషికుమార్ శుక్లా ఉద్యోగ బాధ్యతలను చేపట్టారు. సాధారణ పరిస్థితుల్లో అయితే, కొత్తగా నియమితులైన వ్యక్తికి ఉద్యోగంలో చేరేందుకు వారం రోజుల వ్యవధి ఉంటుంది. అయితే దర్యాప్తు సంస్థకు, కోల్‌కతా పోలీసులకు మధ్య వచ్చిన తగాదావల్ల శనివారం నియమితులైన శుక్లా రెండు రోజుల్లోనే అంటే సోమవారమే తన పదవిని స్వీకరించారని అధికారులు తెలిపారు. 1983 బ్యాచ్ ఐపిఎస్ అధికారి శుక్లా మధ్యప్రదేశ్ కేడర్ నుంచి వచ్చారు.పూర్తి స్థాయి డైరెక్టర్‌గా నియమితులైన రిషికుమార్ శుక్లా సమస్యల్లో చిక్కుకున్న సిబిఐని గట్టెక్కిస్తారని అనుకుంటున్నారు. శారదా కుంభకోణం కేసులో కోల్‌కతా కమిషనర్ రాజీవ్ కుమార్ సాక్ష్యాల్ని నాశనం చేశారని ఆరోపిస్తూ సిబిఐ సుప్రీం కోర్టులో సవాల్ చేసింది. ఈ వ్యవహారం చిలికి చిలికి గాలివానగా మారి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య ఘర్షణకు దారితీసింది.

ఇంట గెలిచి రచ్చ గెలవాలి

కార్యకర్తలకు నితిన్ గడ్కరీ సూచన



నాగ్‌పూర్: పార్టీ కార్యకర్తలు తొలుత ఇంటి బాధ్యతలు సమర్థంగా నిర్వహించిన తరవాతే పార్టీ గురించి ఆలోచించాలని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ హితవు పలికారు. ఇంటిని చక్కబెట్టుకోలేనివారు పార్టీలో రాణించడం కష్టమని ఆయన అభిప్రాయపడ్డారు. నాగ్‌పూర్‌లో జరిగిన 'అఖిల భారతీయ విద్యార్థి పరిషత్' మాజీ నేతలు నిర్వహించిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ''మేము పార్టీ, దేశానికి అంకితమవుతామంటూ చాలా మంది నన్ను సంప్రదిస్తుంటారు. అలాంటి వారిలో ఒకాయన ఇంటి దగ్గర ఉన్న దుకాణం సరిగా నడపలేకపోయారు.. ఇంట్లో భార్య, పిల్లలు ఉన్నారు.. ఇక నుంచి పార్టీలో పనిచేద్దామనుకుంటున్నాను.. అంటూ నా దగ్గరకు వచ్చారు. ముందు ఇంటి బాధ్యతలు సరిగా నిర్వర్తించండి. ఇంటిని సరిగా చక్కబెట్టుకోలేనివారు దేశ అవసరాలను తీర్చడం కష్టం అని సమాధానపరచి తిప్పి పంపాను'' అని తన అనుభవంలోని ఓ ఘటనను గడ్కరీ గుర్తుచేసుకున్నారు. ప్రతి ఒక్కరూ ఇంటి బాధ్యతలు నిర్వర్తించి, పిల్లల బాగోగులు చూసుకోవాలని.. ఆ తరవాతే పార్టీ కోసం, దేశం కోసం పనిచేయాలని కార్యకర్తలకు సూచించారు.

బాలుకు మాతృవియోగం

హైదరాబాద్: ప్రముఖ గాయకుడు ఎస్‌పి బాలసుబ్రహ్మణ్యం తల్లి శకుంతలమ్మ(89) కన్నుమూశారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె సోమవారం ఉదయం తుదిశ్వాస విడిచారు. కచేరీ కార్యక్రమాల నిమిత్తం లండన్‌కు వెళ్లిన బాలసుబ్రహ్మణ్యం తల్లి మరణ వార్త తెలియగానే వెంటనే భారత్‌కు బయలుదేరారు. సోమవారం సాయంత్రం కల్లా ఆయన స్వస్థలానికి చేరుకుంటారు. మంగళవారం శకుంతలమ్మ స్వస్థలమైన నెల్లూరులో ఆమె అంత్యక్రియలను నిర్వహించనున్నారు.

అగ్రవర్ణాల రిజర్వేషన్‌కి మహారాష్ట్ర ఆమోదం

ముంబై: అగ్రవర్ణ పేదలకు ఇటీవల కేంద్రం కల్పించిన 10 శాతం రిజర్వేషన్లకు మహారాష్ట్ర ప్రభుత్వం సోమవారం ఆమోదం తెలిపింది. సరిగ్గా లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలోబిజెపి పాలిత రాష్ట్రాలన్నీ రిజర్వేషన్ సవరణ బిల్లుకు ఆమోదం తెలుపుతున్నాయి. ఇప్పటివరకు అగ్రవర్ణ రిజర్వేషన్లకు ఆమోదం తెలిపిన రాష్ట్రాల్లో మహారాష్ట్ర ఏడవది. మహారాష్ట్రతో పాటు బీహార్, గుజరాత్, హిమాచల్ ప్రదేశ్, ఉత్తర ప్రదేశ్, జార్ఖండ్, అసోం తదితర రాష్ట్రాలు కొత్త రిజర్వేషన్ల అమలుకు అంగీకారం తెలిపాయి. అగ్రవర్ణాల్లోని పేదలకు విద్య, ఉద్యోగ అవకాశాల్లో 10 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ గతనెల 7న కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగ సవరణ చేసిన సంగతి తెలిసిందే.

ఇది మమత విధించిన ఎమర్జెన్సీ: జవడేకర్



న్యూఢిల్లీ: విచారణ నిమిత్తం వచ్చిన కేంద్ర దర్యాప్తు సంస్థ అధికారుల్ని పోలీసులు అదుపులోకి తీసుకోవడం వంటి ఘటన ఇప్పటి వరకు ఎన్నడూ జరగలేదని కేంద్రమంత్రి ప్రకాశ్ జవడేకర్ అన్నారు. పశ్చిమబెంగాల్‌లో నెలకొన్న పరిస్థితులపై ఆయన సోమవారం మీడియా సమావేశంలో మాట్లాడారు. ఇలా సిబిఐ అధికారుల్ని అదుపులోకి తీసుకోవడమనేది ప్రజాస్వామ్యాన్ని హత్య చేసినట్లేనని ఆయన ఆరోపించారు. సీఎం మమతా బెనర్జీ చేస్తున్న సత్యాగ్రహాన్ని ఆయన విమర్శించారు.'ఓ విచారణ బృందాన్ని పోలీసులు అదుపులోకి తీసుకోవడం ఇంతకముందెన్నడూ జరగలేదు. ఇది ప్రజాస్వామ్యాన్ని హత్య చేయడమే. అసలు మమతా బెనర్జీ సత్యాగ్రహాన్ని ఎందుకు చేస్తున్నారని మేం ప్రశ్నిస్తున్నాం? ఆమె ఎవరిని కాపాడాలని ప్రయత్నిస్తున్నారు. పోలీస్ కమీషనర్‌నా? లేదా తనని తాను కాపాడుకుంటున్నారా? ప్రతిపక్ష పార్టీల నేతలు మమతా బెనర్జీకి మద్దతు ఇస్తున్నారు. అసలు వాళ్లంతా ఎవరు? బెయిల్‌పై బయట ఉన్నవాళ్లు. అలాంటి వాళ్లు ఆమెకు అండగా నిలుస్తున్నారు. ఇది మహాకూటమి కాదు. అవినీతిపరులంతా కలిసి నిలబడుతున్నారు. ఇది పశ్చిమ బెంగాల్‌లో మమత విధించిన అత్యవసర పరిస్థితి. కేంద్రంలో కాదు' అని ఆయన విమర్శించారు.

సోమాలియాలో కారుబాంబు పేలుడు

తొమ్మిది మంది పౌరుల మృతి

మొఘదీషు : సోమాలియాలో సోమవారం ఉగ్రవాదులు దాడికి దిగారు. దేశ రాజధాని మొఘదీషులో కారు బాంబు పేలుడు జరిపారు. ఈ ఘటనలో తొమ్మండుగురు పౌరులు మృతి చెందారు. పలువురు గాయపడ్డారు.ఈ విషయాన్ని స్థానిక పోలీసులు వెల్లడించారు. అత్యంత రద్దీగా ఉండే ఒక మాల్ వద్ద పేలుడు పదార్థాలతో కూడిన కారు పేలిందని తెలిపారు. ఇది ఉగ్రవాద చర్య అని దాదాపుగా నిర్ధారణ అయింది. జనం ఎక్కువగా ఉన్న మాల్ సమీపంలోనే పేలుడు జరిగింది. దీనితో తీవ్ర ప్రాణ, ఆస్తి నష్టం జరిగిందని స్థానిక పోలీసు అధికారి అహ్మద్ మోఅలీన్ అలీ నిర్ధారించారు. అమాయక పౌరులను దెబ్బతీయాలనే ఉద్దేశంతోనే మాల్ ఆవరణలోనే కారు బాంబును ఉగ్రవాదులు పేల్చినట్లుగా తెలుస్తోందని ప్రకటించారు. పేలుడు తీవ్రతతో సమీపంలోని భవంతి కూడా కుప్పకూలిందని, ఇందులో ఉన్న వారు కూడా కొందరు దుర్మరణం చెందారు. పేలుడు తీవ్రత ఎక్కువగా ఉందని, చాలా మంది దూరంగా ఎగిరిపడి ప్రాణాలు విడిచారని, శిథిలాల కింద క్షతగాత్రులు పడి ఉన్నారని అక్కడి దుకాణ యజమాని మునీరా అబ్దుకదిర్ తెలిపారు. సోమాలీలో అల్‌ఖైదా ప్రాబల్యం చాలా వరకూ తగ్గింది. అయితే గ్రామీణ మారుమూల ప్రాంతాలలో ఈ సంస్థ వెన్నుదన్నులతో పుట్టుకొచ్చిన చిన్నపాటి ఉగ్రవాద సంస్థలు దాడులకు పాల్పడుతూ వస్తున్నాయి. ఇప్పటి దాడికూడా వీటిపనే అని అనుమానిస్తున్నారు.





మౌని అమావాస్య సందర్భంగా పుణ్యస్నానాలు చేసే భక్తులతో త్రివేణి సంగమం కిటకిటలాడిపోయింది. దాదాపు ఐదు కోట్ల మంది సోమవారం పుణ్యస్నానాలు ఆచరించారని అధికారులు అంచనా వేశారు. వేలాదిగా నాగ సాధువులు కూడా త్రివేణి సంగమంలో పుణ్యస్నానాలు ఆచరించారు. తెల్లవారు జాము నుంచి సాయంకాలం వరకు భక్తులు స్నానాలు ఆచరిస్తూనే ఉన్నారు. ఈ సందర్భంగా అధికారులు విస్తృత ఏర్పాట్లు చేశారు

పొత్తుకోసం బాబు వెంపర్లాడారు

బిజెపి జాతీయ అధ్యక్షుడు అమిత్‌షా



పలాస: తెలుగుదేశం అధినేత, ఏపీ సిఎం చంద్రబాబు ప్రతి విషయంలోనూ యూటర్న్ తీసుకున్నారని బిజెపి జాతీయ అధ్యక్షుడు అమిత్‌షా విమర్శించారు. శ్రీకాకుళం జిల్లా పలాస రైల్వేక్వార్టర్స్ వద్ద బిజెపి ప్రజాచైతన్య బస్సు యాత్రను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తొలుత చంద్రబాబు కాంగ్రెస్ నుంచి గెలిచారని.. ఎన్టీఆర్ తెలుగు ప్రజల కోసం పార్టీ పెడితే ఆయన పంచన చేరారన్నారు. 1998లో వాజపేయి ప్రధాని అవుతారని తెలిశాక ప్రభుత్వ లబ్ధికోసం బిజెపితో చేతులు కలిపారని చెప్పారు. 2004లో బిజెపి అధికారం కోల్పోగానే కొత్తవారితో జతకట్టారని.. ఇప్పుడు ఎన్డీయే ప్రభుత్వం నుంచి వైదొలిగాక ఏపీ ప్రజలను మోసగించిన కాంగ్రెస్‌తో జతకలిశారని ఆయన ఆరోపించారు.

టిడిపి నేతలు దుష్ప్రచారం చేస్తున్నారు

తమ అవినీతి ఆరోపణలను కప్పిపుచ్చుకునేందుకే బిజెపిపై టిడిపి నేతలు దుష్ప్రచారం చేస్తున్నారని అమిత్‌షా మండిపడ్డారు. రాష్ట్రాభివృద్ధికి ఎంతో తోడ్పాటు అందించామని చెప్పారు. రాష్ట్రానికి కేంద్రం ఇచ్చిన హామీల్లో సింహభాగం మొదటి ఐదేళ్లలోనే పూర్తిచేశామని.. తిరుపతిలో ఐఐటీ, ఐఐఎస్ఈఆర్.. విశాఖలో ఐఐఎం, తాడేపల్లిగూడెంలో ఎన్ఐటీ ఏర్పాటు చేశామన్నారు. ఈ సంస్థలేవీ ఇంతకు ముందు ఏపీలో లేవని ఆయన చెప్పారు. గుంటూరు జిల్లా మంగళగిరిలో ఎయిమ్స్, విశాఖలో ఎన్ఐపీఈఆర్ నెలకొల్పామని.. పెట్రోలియం విశ్వవిద్యాలయాన్ని కూడా ఎపికి కేటాయించామని అమిత్‌షా చెప్పారు.

బహిరంగ సభ రద్దు

పలాసలో అమిత్‌షా పర్యటన జనం లేక వెలవెలబోయింది. బస్సు యాత్ర ప్రారంభోత్సవానికి వచ్చిన ఆయన.. బహిరంగ సభలోనూ పాల్గొనాల్సి ఉంది. వేలాది మంది కూర్చునేందుకు వీలుగా కుర్చీలను కూడా ఏర్పాటు చేశారు. అయితే జనం లేకపోవడంతో బహిరంగ సభను అమిత్‌షా రద్దు చేసుకున్నారు. ప్రజలెవరూ రాకపోవడంతో సభను ప్రజా చైతన్య యాత్ర బస్సు వరకే పరిమితం చేశారు.

టిడిపి నిరసన

అమిత్‌షా రాకపై టిడిపి శ్రేణులు పెద్ద ఎత్తున నిరసనకు దిగాయి. పలాస ఎమ్మెల్యే గౌతు శ్యామసుందర శివాజీ, జిల్లా టిడిపి అధ్యక్షురాలు గౌతు శిరీష ఆధ్వర్యంలో కార్యకర్తలు కాశీబుగ్గ పాతబస్టాండ్‌లోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద ఆందోళనకు దిగారు. అమిత్‌షా గోబ్యాక్ అంటూ నినాదాలు చేశారు. అనంతరం పోలీసులు నేతలను అదుపులోకి తీసుకుని కాశీబుగ్గ పీఎస్‌కు తరలించారు. పోలీసుల వైఖరిని నిరసిస్తూ ఎమ్మెల్యే శివాజీ, గౌతు శిరీష, కార్యకర్తలు పోలీస్ స్టేషన్‌లోనే బైఠాయించారు.

బిజెపిలో దమ్మున్న నాయకుడు గడ్కరీ

ప్రశంసించిన రాహుల్‌గాంధీ



న్యూఢిల్లీ: 'ఇంటిని చక్కదిద్దుకోలేని వారు దేశాన్ని పాలించలేరు' అని వ్యాఖ్యానించిన కేంద్రమంత్రి నితిన్ గడ్కరీని కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ సోమవారం ప్రశంసించారు. ఆయన దమ్మున్న నాయకుడు. అలాగే... రాఫెల్ ఒప్పందం– అనిల్ అంబానీ, రైతుల్లో నెలకొన్న నిరాశా నిస్పృహలు, వ్యవస్థలు నాశనమవుతున్న తీరు గురించి కూడా గడ్కరీ చెప్పాలి... అని రాహుల్‌గాంధీ కోరారు. పార్టీ కార్యకర్తలు మొదట తమ ఇంటి బాధ్యతలు నెరవేర్చాలి. అలా చేయలేనివారు దేశాన్ని పాలించలేరు' అని గడ్కరీ చేసిన వ్యాఖ్యల గురించి వచ్చిన రిపోర్ట్‌ను రాహుల్‌గాంధీ పేర్కొన్నారు. నాగపూర్‌లో శనివారం జరిగిన అఖిల్ భారతీయ విద్యార్థి పరిషద్ (ఎబివిపి) మాజీ కార్యకర్తల సమావేశంలో గడ్కరీ ఈ వ్యాఖ్యలు చేశారు. 'గడ్కరీజీ! బిజెపీలో కాస్త దమ్మున్న నాయకుడు మీరొక్కరే' అని రాహుల్‌గాంధీ అభినందించారు. కేంద్ర మంత్రి ఇటీవల చేసిన వ్యాఖ్యల్ని కాంగ్రెస్ పార్టీలో ఇతర నాయకులు కూడా ప్రశంసించిన నేపథ్యంలో రాహుల్‌గాంధీ గడ్కరీని అభినందించారు. బిజెపి నాయకత్వంపై కన్నేసి గడ్కరీ ఈ వ్యాఖ్యలు చేశారని కాంగ్రెస్ నాయకులు అభిప్రాయపడ్డారు. హామీలను నెరవేర్చని నాయకుల్ని ప్రజలే కొడతారు అని అంతకు ముందు కూడా గడ్కరీ వ్యాఖ్యానించారు. కేంద్ర మంత్రి చేసిన ఈ వ్యాఖ్యను కాంగ్రెస్ ప్రతినిధి మనీష్ తివారీ కొనియాడారు. ప్రధాని నరేంద్రమోడీని ఉద్దేశించే గడ్కరీ ఈ వ్యాఖ్యలు చేసి ఉండవచ్చన్నారు. అయితే అదే సమయంలో గడ్కరీ ప్రధానమంత్రి కుర్చీపై కన్నేసి ఉంటారని కూడా మనీష్ తివారీ అభిప్రాయపడ్డారు.

ఏపీలో అక్రమంగా ఓట్లు తొలగిస్తున్నారు

ఇసికి ఫిర్యాదు చేసిన జగన్



న్యూఢిల్లీ : ఆంధ్రప్రదేశ్‌లో అక్రమంగా ఓట్లు తొలగిస్తున్నారని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధినేత జగన్ కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారు. సీ ఈసీ సునీల్ అరోరాను జగన్ సోమవారం కలిశారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. ఓటర్ల జాబితాలో దొంగ ఓట్లు చేరుస్తున్నారని ఈసీకి ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. మరోవైపు తమ పార్టీ సానుభూతిపరుల ఓట్లు తొలగిస్తున్నారని ఆరోపించారు. ప్రజాసాధికార సర్వే, ఇంకో సర్వే అంటూ మోసాలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో పోలీసు యంత్రాంగాన్ని దుర్వినియోగం చేయడానికి చంద్రబాబు ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు. తన సామాజిక వర్గానికి చెందిన వ్యక్తులను కీలక పోస్టుల్లో చంద్రబాబు ప్రమోట్ చేస్తున్నారని ఆరోపించారు. డబ్బు పంపిణీ కోసం పోలీసులను ఎలా వాడుకోబోతున్నారో వంటి విషయాలను ఈసీకి వివరించినట్లు జగన్ చెప్పారు. తనపై హత్యాయత్నం జరిగితే తప్పుదోవ పట్టించారని.. ఈ విషయాన్ని కూడా కేంద్ర ఎన్నికల సంఘం దృష్టికి తీసుకొచ్చినట్లు చెప్పారు.



రాష్ట్రపతిభవన్‌లోని మొఘల్ గార్డెన్‌లో తులిప్ పూల వరసల వద్ద రాష్ట్రపతి రామ్‌నాథ్‌కోవింద్ దంపతులు. బుధవారం నుంచి అయిదు రోజులు ఈ గార్డెన్‌ను సందర్శకుల కోసం తెరుస్తారు.

అన్నాహజారే ప్రాణం కాపాడండి

బిజెపిపై శివసేన, ఎమ్ఎన్ఎస్ విమర్శలు



ముంబయి : లోక్‌పాల్, లోకాయుక్తాల నియామకాలు చేపట్టాలని, రైతుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తన సొంత గ్రామం రాలేగావ్ సిద్ధిలో నిరాహార దీక్షకు దిగిన సామాజిక ఉద్యమకారుడు అన్నాహజారే ప్రాణం కాపాడాలని శివసేన పార్టీ... కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఆయన దీక్ష ఆరో రోజుకి చేరిన నేపథ్యంలో దీనిపై తమ పార్టీ పత్రిక సామ్నాలో ఓ కథనాన్ని ప్రచురించింది. 'మొదట అన్నాహజారే ప్రాణాలను కాపాడండి. ఆ తర్వాతే ఇతర విషయాల గురించి ఆలోచించండి. ఈ పోరాటంలో ఆయన ప్రాణాలు పోవాలనే ప్రభుత్వం భావిస్తే, మన సంస్కృతి వ్యాధిగ్రస్తమైందని భావించాలి. ఆయన లోక్‌పాల్, లోకాయుక్త, రైతుల సమస్యల పరిష్కారం కోసం దీక్ష చేస్తున్నారు. ప్రధానమంత్రి నుంచి ఆయనకు ఓ లేఖ వచ్చింది. ఆయన అమరుడయ్యేవరకు దీక్ష కొనసాగించాలని తాము కోరుకుంటున్నట్లుగా అందులో ఉంది' అని పేర్కొంది. హజారే దీక్షకు మీడియా ద్వారా ప్రచారం జరగకుండా చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రయత్నిస్తున్నాయని శివసేన ఆరోపించింది. 'గతంలోలా హజారే దీక్షపై ప్రచారం జరిగితే, దేశ వ్యాప్తంగా ప్రజల్లో కదలికలు వచ్చేవి. ఆయన దీక్షపై ప్రచారం జరగకుండా ప్రభుత్వం ప్రయత్నిస్తోంది' అని పేర్కొంది.

హజారేను కలిసిన రాజ్ థాకరే, రాజేంద్ర సింగ్

అన్నాహజారేను మహారాష్ట్ర నవనిర్మాణ సేన (ఎమ్ఎన్ఎస్) అధ్యక్షుడు రాజ్ థాకరే, సామాజిక కార్యకర్త రాజేంద్ర సింగ్ సోమవారం కలిశారు. ఆయన పోరాటానికి తాను పూర్తి మద్దతు తెలుపుతున్నానని, నిరుపయోగ బిజెపి ప్రభుత్వం సమస్యలను పట్టించుకోవట్లేదని ఠాక్రే అన్నారు. హజారే ప్రాణాన్ని త్యాగం చేయొద్దని, దీక్ష విరమించి తమతో కలిసి రాష్ట్ర వ్యాప్త పర్యటన చేయాలని, బిజెపి ప్రభుత్వాన్ని గద్దె దించాలని ఆయన కోరారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తమ ఎన్నికల మేనిఫెస్టోను కూడా అమలు చేయట్లేదని ఆయన విమర్శించారు. 'ఎన్నికలకు ముందు హజారేపై నరేంద్ర మోడీ ప్రశంసల వర్షం కురిపించారు. ఆయన చాలా నిజాయతీ పరుడని, ఉన్నత విలువలు గల వ్యక్తని అన్నారు. ఆయన ప్రభుత్వం ఏర్పడి ఐదేళ్లయినప్పటికీ ఇప్పటికీ హజారే డిమాండ్‌లను నెరవేర్చలేదు. హజారే 2013లో చేసిన దీక్ష కారణంగానే బిజెపి 2014 ఎన్నికల తరువాత అధికారంలోకి వచ్చింది. మరోవైపు ఆయన దీక్షకు ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ మద్దతు తెలపకపోవడం ఆశ్చర్యం కలిగిస్తోంది. హజారే వల్లే కేజ్రీవాల్ ఎవరో దేశానికి తెలిసింది. ఆయన కనీసం ఇక్కడకు వచ్చి హజారే ఆరోగ్య పరిస్థితి గురించి కూడా తెలుసుకోవట్లేదు' అని ఆయన విమర్శించారు.

అయోధ్య భూ సేకరణ చట్టంపై సుప్రీంలో పిటిషన్



న్యూఢిల్లీ : అయోధ్యలో భూసేకరణకు కేంద్ర చట్టానికి వ్యతిరేకంగా సుప్రీంకోర్టులో సోమవారం పిటిషన్ దాఖలయింది. వివాద సుడుల మధ్య ఉన్న రామజన్మభూమి బాబ్రీ మసీదు వద్ద ఖాళీ స్థలం ఉంది. ఈ భూ సేకరణకు తీసుకువచ్చిన 1993 కేంద్ర చట్టం రాజ్యాంగ బద్ధతను ఏడుగురు వ్యక్తిగత హోదాలో సవాలు చేశారు. అయోధ్య విచారణ ప్రక్రియ వేగవంతపు దశలోనే ఈ పిటిషన్ దాఖలు అయింది. పిటిషనర్లలో లక్నోకు చెందిన ఇద్దరు న్యాయవాదులు కూడా ఉన్నారు. రాష్ట్రానికి చెందిన భూమిని స్వాధీనం చేసుకునే హక్కు పార్లమెంట్‌కు లేదని, సంబంధిత కేంద్ర చట్టం చెల్లనేరదని పిటిషనర్లు విన్నవించుకున్నారు. పిటిషనర్లు తమను తాము రామ భక్తులుగా తెలియచేసుకున్నారు. అయోధ్య రామమందిర దరిదాపులలోని మతసంస్థల కార్యకలాపాల నిర్వహణ అంశాల ఖరారు కేవలం రాష్ట్ర లెజిస్లేచర్ పరిధిలోకి వస్తుంది. దీనితో పార్లమెంట్‌కు కేంద్రానికి సంబంధం లేదని పిటిషనర్లలో ఒకరైన పిటిషనర్ చెప్పారు. అయోధ్యలోని కొన్ని ప్రాంతాల సేకరణకు సంబంధించిన అయోధ్య చట్టం, 1993 చట్టం రాజ్యాంగ వ్యతిరేకం అని తెలిపారు. రాజ్యాంగంలో 25వ అధికరణ పరిధిలో దీనిపై వివరణ ఉంది. దీని మేరకు హిందువులకు మతపరమైన భరోసా కల్పించే హక్కును పొందుపర్చారు. అయితే దీనికి ప్రతిఘాతంగా కేంద్రం చట్టం తీసుకువచ్చిందని పిటిషనర్లు తెలిపారు. అయోధ్య రామ మందిర పరిసరాలలో దాదాపు 68 ఎకరాల భూమి ఉంది. ఇందులో పూజలు, దర్శనాదికాలు, క్రతువుల నిర్వహణ వంటి వాటిలో కేంద్రం కానీ యుపి ప్రభుత్వం కానీ జోక్యం చేసుకోకుండా చూడాల్సి ఉందని ఈ మేరకు న్యాయస్థానం ఉత్తర్వులు వెలువరించాలని అభ్యర్థించారు.

Printed and Published by **Tumu Mohan Rao** on behalf of Moveon Media Private Limited, Printed at M/s. JAGATI PUBLICATIONS LIMITED, Sakshi Press, D-75 & C-52, Industrial Estate (APIE), Balanagar-500037 Medchel-Malkajgiri District, TELANGANA and Published from H.No.1-1-60/7A, 4th floor Beacon towers, street no.13, Jawaharnagar, near RTC X Roads Hyderabad-500020 Telangana state, Editor : **Anjaiah Polisetty**, RNI No. TELTEL/2012/42234. Email Id. editor@manatelangana.org. Phone No.040-27655666